ప్రజాశక్తి

సైద్ధాంతిక బులెటిన్

పోరాటమే మార్గం

ఆశయబలంతోనే సమరశీలత

అర్జెంటీనా నిరుద్యోగ పోరాటం

టెర్రరిజం కారణాలు-కోణాలు

ప్రజాస్వామ్యం - ప్రపంచీకరణ

పెట్టుబడిదారీ కవలలు అభివృద్ధి, పేదరికం

CPI(M)
17th Congress
19-24, March 2002. Hyderabad

ఫిబ్రవరి 2002



వెల. రు.5/-

ఉక్కుమనిషి స్టాలిన్

కచ్చితమైన సమాచారం తెలుసుకోవడంలోనూ, వివరాలు అధ్యయనం చేయడంలోనూ స్టాలిన్‌కు పెట్టింది పేరు. మన దేశంలోగల జాతుల సమస్యను గురించి డాక్టర్ రాధాకృష్ణన్‌తో స్టాలిన్ చర్చిస్తూంటే ఇన్ని వివరాలు యీయన కెలా తెలుసా అని రాధాకృష్ణన్ విస్తుపోయారట.

టోంకిన్‌గల్ఫ్‌లో వియత్నాం తనపై దాడిచేసిందని ఒక అభూత కల్పన గావించి హానోయ్‌పై అమెరికన్ సామ్రాజ్యవాదులు బాంబులదాడి ప్రారంభించారు. దాంతో హడలిపోయిన కృశ్చేవ్ అమెరికా దుశ్చర్యను ఖండించడానికే జంకాడు. ఈ కామెర్ల రోగికి స్టాలిన్ పిరికివాడుగా కనిపించడంలో ఆశ్చర్యంలేదు. కాని స్టాలిన్ మనో నిబ్బరం కలవాడన్నది జగమెరిగిన సత్యం. అనేకమంది వ్యాఖ్యాతలూ, రాజకీయవేత్తలూ ఆ విషయాన్ని పలుసార్లు పేర్కొన్నారు.

హిట్లర్ దాడికి అరు వారాల్లో రష్యా మొత్తం పాదాక్రాంతమవుతుందని సామ్రాజ్య వాదులు భయభ్రాంతుల య్యారు. తక్షణం తమకు ఏ సహాయం కావాలోపోయి స్టాలిన్‌ను కనుక్కురమ్మని రూజ్వెల్టు తన ప్రత్యేక దూతగా హాప్కిన్సును పంపించాడు. ఆసంభాషణల్లో అల్యూమినియం కావాలని స్టాలిన్ హాప్కిన్సును కోరారు. నేడో రేపో రష్యా కూలుతుందని ప్రపంచం భావిస్తూంది. కాగా స్టాలిన్ విమాన ఉత్పత్తికి అల్యూమినియం కావాలని దీర్ఘకాల యుద్ధ పథకాన్ని వేస్తున్నాడేమిటని హాప్కిన్సు ఆశ్చర్యచకితుడైనట్లు తానే ఒక గ్రంథంలో వ్రాశాడు.

బాంబులు పడుతున్న మాస్కో నగరంలో స్టాలిన్ కొరకు ఒక అండర్ గ్రౌండు షెల్టరు వుండేది కాని ఆయన ఏనాడూ దానిలోకి అడుగుపెట్టి ఎరుగడు అని జనరల్ స్టెమెంకొవ్ వ్రాశాడు.

1941 నవంబరు విప్లవ దినోత్సవంనాటికి హిట్లరు బలగాలు మాస్కో పొలిమేర్లలోకి చొచ్చుకువచ్చాయి. ముఖ్యపట్టణాన్ని క్యూబిషేవ్‌కు మార్చారు. డిమిత్రోవ్‌లాంటి అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమ నేతలను కూడా క్యూబిషేవ్‌కి తరలించారు. స్టాలిన్ మాస్కోని వదలలేదు. పైగా ముట్టడికిగురైన ఆ పట్టణంలోనే ఆయన విప్లవదినోత్సవం పెరేడ్‌ను ఏర్పాటు చేయించాడు. తాను ఆ సాయుధ దళాలను ఉద్దేశించి ఉపన్యసించాడు. ఈ ఘటన సోవియట్ ప్రజలను ఉత్సాహపరిచింది. ఆ సైనిక దళాలను ఉగ్రూతలూగించింది. అందరికీ విశ్వాసం కలిగించింది. ఈ విషయాన్ని కామ్రేడ్ డిమిత్రోవ్, మార్షల్ ఝుకోవ్, స్టెమెంకోవ్ మొదలైన వారంతా పేర్కొన్నాడు.

ఝుకోవ్ ఇంకా ఇలారాశాడు:

“మాస్కో యుద్ధంలో స్టాలిన్ పాత్ర ఏమిటన్న ప్రశ్నలు అనేకంగా వస్తున్నాయి.

స్టాలిన్ మాస్కోలోనే వున్నాడు. వున్న ఆయుధాలను, సేనలను తన ఆధీనంలో పెట్టుకొని ఆయన శత్రువు ఓటమిని సాధించారు. పీపుల్సు పమీసారియెట్ సిబ్బంది సహాయంతో, రక్షణ శాఖాధిపతిగా వున్న వనరులను సమీకరించి, గొప్ప కృషి చేసి విజయానికి అవసరమైన వ్యూహాన్ని నిర్మించిన ఘనత ఆయనకే దక్కింది. దాదాపు అసాధ్యమనుకున్న దానిని ఆయన సాధించాడు. గత యుద్ధంలో నన్ను బాగా కదిలించిన ఘటన ఏమిటని అడిగితే మాస్కో యుద్ధం అంటాను.

చరిత్రలో మరొక్క ఉదాహరణ చూద్దాం. యుద్ధం ముగింపుకు వస్తున్న రోజులవి. జపాన్ సేనలు ఎర్రసేనకు లొంగాలా, అమెరికా ముందు లొంగాలా అన్న ప్రశ్న ముందుకు వస్తోంది. జపాన్‌వాణ్ణి తన ముందు పాదాక్రాంతం చేసుకునేందుకు అటంబాంబు వంటి బ్రహ్మాస్త్రం తమ చెంతనున్నదని అమెరికన్ సామ్రాజ్య వాదులు కులుకుతున్నారు. ఆ విషయం చర్చిల్‌కి ముందే తెలుసు. ట్రూమన్ తమ వద్ద ఒక బ్రహ్మాస్త్రం వున్నదని స్టాలిన్‌కి చెప్పదలచాడు. సామ్రాజ్యవాదులు కనిపెట్టిన ఆయుధం సంగతి విని స్టాలిన్ ఎంత కంగు తింటాడో చూద్దామని చర్చిల్ కొంచెం ఎడంగా కూర్చొని పరిశీలిస్తున్నాడు. ఇంతలో ట్రూమన్ ఆ విషయాన్ని చెప్పనూ చెప్పాడు స్టాలిన్ విననూ విన్నాడు. కాని ఆయన ముఖంలో ఏ మార్పు కనబడలేదు. అది అసలు ఆటంబాబు అని, అత్యద్భుత శక్తిగలదని స్టాలిన్‌కి అర్థమైనట్లు లేదు అనుకున్నాడు చర్చిల్. తామంత గొప్ప విషయాన్ని చెప్పగా నోరువిప్పి పల్లెత్తు ప్రశ్ననైనా వేయలేదేమని ట్రూమన్ ఆశ్చర్య చకితుడయ్యాడు. ఈ విషయాన్నంతటినీ చర్చిల్ తన యుద్ధస్మృతులలో స్వయంగా వర్ణించాడు. కాని స్టాలిన్ ప్లానులు స్టాలిన్‌వి. ఆటంబాంబును సాధించడమేకాదు. అధిగమించాలి. మాస్కోకు తిరిగి వెళ్ళిన వెంటనే మాలటోవ్‌తో సంప్రదించాడు. శాస్త్రవేత్తలనూ, నిపుణులనూ అందుకు సన్నద్ధం చేశాడు. ఈ ఘటన లన్నింటివల్ల స్టాలిన్ ఒక గొప్ప నిబ్బరం గల వ్యక్తి అని జగతి భావించింది. కాని కుళ్ళుబోతు కృశ్చేవ్ మాత్రం స్టాలిన్‌లో పిరికితనాన్ని కనిపెట్టాడు.

స్టాలిన్ కూతురు స్వెట్లానా రష్యా విడిచిపెట్టి వెలుపలికి వచ్చిందనగానే స్టాలిన్ బ్రతుకును బ్రహ్మాండంగా ఎండగడుతుందని గంపెడంత ఆశతో అమెరికా ఆమెకు ఆశ్రయమిచ్చింది. లక్షలకొలదీ డాలర్ల

(మిగతా 27వపేజీలో)

LPSA1017116

లోపలి పేజీల్లో

1. పోరాటమే మార్గం ...4
2. ప్రజాధనం ప్రైవేట్ లూటీ ...7
3. స్పెక్ట్రమ్ విద్యుత్ కుంభకోణం ...8
4. ఆశయబలంతోనే సమరశీలత ...9
5. కార్మికవర్గ అంతర్జాతీయత ...10
6. సామ్రాజ్యవాదంపై అధ్యయనానికి మార్గదర్శి ...11
7. పెట్టుబడిదారీ కవలలు-అభివృద్ధి, పేదరికం ...12
8. పరివార్ కబంధహస్తాల్లో మతసామరస్యం ...14
9. అర్జెంటీనాలో నిరుద్యోగ కార్మికోద్యమం ...17
10. టెర్రరిజం కారణాలు-కోణాలు ...20
11. ప్రజాస్వామ్యం-ప్రపంచీకరణ...23

ప్రజలకు బాధ్యత వహించడం మన విద్యుక్తధర్మం. ప్రతిమాట, ప్రతిచర్య, ప్రతివిధానం ప్రజల ప్రయోజనాలకు అనుగుణ్యంగా ఉండాలి. తప్పులు జరిగితే సరిదిద్దుకోవాలి. ప్రజలకు బాధ్యత వహించడమంటే అదే.

మనం విజయం సాధించినంత మాత్రాన, సామ్రాజ్యవాదులు, వారి తొత్తులు పగతీర్చుకోవడానికి చేసే ఉన్మత్త కుట్రలకు వ్యతిరేకంగా మన జాగురూకతను ఏమాత్రం సడలించకూడదు. జాగురూకతను సడలించడమంటే రాజకీయంగా అస్త్రసన్యాసం చేయడమే. చేతులు ముడుచుకు కూర్చోవడమే.

-మావో

ప్రజాశక్తి సాహితీ సంస్థ తరపున
ప్రచురణకర్త, ముద్రాపకుడు : **వి.కృష్ణయ్య,**
సంపాదకులు: **వి.శ్రీనివాసరావు**
ముద్రణ ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, 1-1-60/2, ఆర్టీసీ క్రాస్‌రోడ్స్, హైదరాబాద్ 20
ఫోన్ : ఎడిటోరియల్ 7665420, 7663761
మేనేజర్ : 7673787 ఫ్యాక్స్ : 7639921
EMail : Prajasakti@hotmail.com
PRJASAKTI, Hyderabad, RNI, Regd.No.52973/94
visit PRAJASAKTI at : www prajasakti com

గమనిక :ఈ సంచికలో వ్యాసాలలోని అభిప్రాయాలు రచయితలవి మాత్రమే.

మానవత్వంపై మతోన్మాద విషపుదాడి

దేశాన్ని అల్లకల్లోలం చేయడానికి సంఘ్‌పరివార్ 'టైంబాంబ్' అమర్చింది. దానికి టైం ఫిక్స్ చేసి 'కీ' ఇచ్చే బాధ్యతను బిజెపికి అప్పజెప్పింది. తన అస్థిత్వాన్ని కాపాడుకోవడానికి బిజెపి ఎంతకైనా తెగిస్తుందని జరుగుతున్న ఘటనలు తెలియజేస్తున్నాయి. కేంద్రంలో అధికారం చేపట్టి మూడేండ్లు కూడా నిండకుండానే దాని పలుకుబడి పడిపోయింది. ఏవిషయంలోనూ కాంగ్రెసుకు తీసిపోదని నిరూపించుకుంది. అవినీతిలో ఒక ఆకు ఎక్కువే చదివింది. ప్రజల్లో పునాదులు కదిలిపోయేకొద్దీ కొత్తగా కప్పుకొన్న సెక్యులర్ మునుగు తొలగించి మతోన్మాద విశ్వరూపాన్ని బయటపెట్టుకుంటున్నది. మార్చి 12 తర్వాత ఎప్పుడైనా అయోధ్యలో మందిర నిర్మాణాన్ని చేపట్టితీరుతామని విశ్వహిందూపరిషత్ చేసిన హెచ్చరికతో నాటకంలో మరో అంకం మొదలైంది. వివాదాస్పద స్థలాన్ని వి. హెచ్. పి. కి అప్పగించేందుకు న్యాయపరమైన ఆటంకాలేమున్నాయో అధ్యయనం చేయమని న్యాయశాఖామంత్రిని ప్రధాని ఆదేశించారు. అంటే మరోమారు దేశాన్ని అగ్నిగుండం చేయదలచారని స్పష్టంగా అర్ధమవుతుంది. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల పూర్వరంగంలో సంఘపరివారం ఈవ్యూహం పన్నింది. మరో డిశంబర్ 6 లాంటి చీకటిరోజులు సృష్టించదలచుకుంది. తన సంకుచిత రాజకీయప్రయోజనాలకోసం ఎంతటి అఘాయిత్యానికైనా పాల్పడుతుందనేది ఆర్‌యస్‌యస్ చరిత్ర తెలిసిన ఎవరికైనా విదితమే. దేశప్రజల మాన, ధన, ప్రాణాలతో చెలగాటమాడే ఈ రాక్షససంతతికి సమాజంలో స్థానం లేకుండా చేయాలి.

మతోన్మాదం నేడు మరల పురివిప్పి నాట్యం చేయడానికి బలమైన పూర్వరంగమే వుంది. ఒకటి: రాజకీయంగా బలహీనపడుతున్న తన స్థానాన్ని బలపరుచుకోవడం. రెండు: ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని పక్కదారిపట్టించడం. మూడు: గత ఐదు మాసాలుగా ప్రపంచవ్యాపితంగా ఉగ్రవాదం పేరుతో ముందుకు వస్తున్న ముస్లిం వ్యతిరేకతను సొమ్ము చేసుకోవడం. భారత సమాజంలో చారిత్రకంగా కొనసాగుతున్న వైవిధ్యాన్ని అణచివేసి హిందూ మతాన్ని ఒక జడపదార్థంగా తయారు చేయడం ఆర్‌యస్‌యస్ లక్ష్యం. ఇతరమతాలకు భిన్నంగా హిందూమతంలో కొట్లాది దేవుళ్లున్నారు. ప్రాంతానికొక దేవాలయ నమూనా వుంటుంది. ప్రార్థనలు, భజనల తీరు వేర్వేరు. అందరికీ ఒకే మత గ్రంథమంటూ లేదు. ఒక మనిషికి తన మతాన్ని గురించి కన్నా కులాన్ని గురించిన స్పృహ ఎక్కువ. కులాన్నిబట్టి దేవుళ్లు కూడా మారిపోతుంటారు. ఈనాటికీ దళితులను అగ్రవర్ణ దేవాలయాల్లోకి రానివ్వరు. ఇన్ని ప్రత్యేకతలున్న మతాన్ని ఒకే మూసలోకి మార్చి తమ పబ్బం గడుపుకోవాలని ఆర్‌యస్‌యస్ యత్నం. అందుకే పదేపదే ఏకాత్మతా యజ్ఞాలు, యాత్రలు అంటూ జనాన్ని మత కార్యకలాపాలలో భాగస్వాములను చేసే యత్నం చేస్తోంది. వారి కృషిలో కొంతవరకు జయప్రదమైనారు కూడా. అందుకే తమ ఉన్మాద కార్యక్రమాలను మరింత ఉధృతం చేస్తున్నారు. ఈ కార్యక్రమాలతో పాటు అధికారాన్ని ఉపయోగించుకొని ప్రభుత్వయంత్రాంగంలోకి చాకచక్యంగా జొరబడుతున్నారు. ఇది మరీ ప్రమాదకరమైన పరిణామం. అంతేకాదు విద్యలో మతోన్మాదాన్ని జొప్పించడం ద్వారా చిన్నతనం నుండే పిల్లల బుర్రలను విషపూరితం చేసే కుట్రకు శ్రీకారం చుట్టారు. సెక్యులర్ భావాలకు సమాధి కడుతున్నారు. రాజ్యాంగ పునాదులనే కదిలించివేస్తున్నారు. అత్యంత ప్రమాదకరమైన ఈ పరిణామాలు రానున్న కాలంలో ఫాసిస్టుపాలనకు ప్రారంభం కావచ్చు. మనిషిని రాక్షసిగా మార్చే ఈమతోన్మాద దెయ్యాన్ని వదలగొట్టాల్సిన బాధ్యత ప్రజలదే.

వి.శ్రీనివాసరావు
ఎడిటర్

పోరాటమే మార్గం

సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభ - సమీక్ష



ఎస్.వెంకట్రావు

పోరాటాలు ఉధృతం చేయండి !
పోరాటాలు విస్తృతం చేయండి !!

అనంతపురంలో జనవరి 10-12 తేదీల్లో జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు) రాష్ట్ర మహాసభ ఇచ్చిన పిలుపు ఇది.

నిర్దిష్ట అధ్యయనం, నిర్దిష్ట ఎత్తుగడలు, నిర్దిష్ట పోరాట పద్ధతుల ద్వారా మిలిటెంట్ ప్రజాపోరాటాలను రాష్ట్రం నలుమూలలకు, అన్ని జీవన రంగాలకు విస్తరించడమే నేడు ముందున్న ప్రధాన కర్తవ్యమని మహాసభ పార్టీ శ్రేణులకు పిలునిచ్చింది. పార్టీ ప్రజాపునాదిని విస్తరించుకోవాలన్నా, సమస్యల సుడిగుండంలో చిక్కుకున్న ప్రజానీకాన్ని పోరాటాల్లోకి సమీకరించి వారందరికీ నాయకత్వం వహించే స్థాయికి పార్టీ ఎదగాలన్నా ఈ కర్తవ్య నిర్వహణ అత్యంత కీలకమని గత నాలుగేళ్ల ఉద్యమ అనుభవాన్ని, ప్రస్తుత రాష్ట్ర రాజకీయ, ఆర్థిక, సామాజిక పరిస్థితులన్నీ సమీక్షించిన మహాసభ నిర్ణయానికి వచ్చింది.

అన్ని రాజకీయ పార్టీలు సభలు జరుపుకుంటాయి, సమీక్షలు చేసుకుంటాయి. కాని మార్క్సిస్టు పార్టీ మహాసభలు, పార్టీ సభల్లో జరిగే సమీక్ష ఇతర పార్టీల వంటిది కాదు. ఎందుకంటే మార్క్సిస్టు పార్టీ ఇతర పార్టీల వంటిది కాదు . అది ఒక విప్లవ పార్టీ. మార్క్సిజం- లెనినిజాన్ని భారతీయ పరిస్థితులకు అన్వయించడం ద్వారా భారత సమాజాన్ని జనతా ప్రజాస్వామ్య మార్గంలో సోషలిజం వైపు నడిపేందుకు కృషి చేస్తున్న పార్టీ అది. సరైన కార్యక్రమం, నిర్దిష్టమైన ఎత్తుగడలతో ప్రజా పోరాటాలు నిర్వహిస్తున్న పార్టీ అది. నాలుగేళ్లకొకసారి జరిగే మహాసభల్లో ఆ పోరాటాల అనుభవాలను ఆత్మవిమర్శనా పూర్వకంగా సమీక్షించుకుని, భవిష్యత్ పథనిర్దేశం చేసుకోవడం, ఆ పంథాలో పార్టీని నడిపే నాయకత్వాన్ని అత్యంత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఎన్నుకోవడం ఆ పార్టీ ప్రత్యేకత. ఈ సందర్భంగా జరిగే చర్చల్లోనూ, విధాన నిర్ణయాల్లోనూ, నాయకత్వ కమిటీల ఎన్నికల్లోనూ పైనుండి కింది వరకు పార్టీ శ్రేణులు మొత్తం పాల్గొనడం ఆ పార్టీ యొక్క విశిష్టత. మార్క్సిజం- లెనినిజం సూత్రమైన కేంద్రీకృత ప్రజాస్వామ్యాన్ని తూ.చ. తప్పక అమలు చేయడమే ఆ పార్టీ గొప్పదనం, ఇతర పార్టీలకు లేని, దానికి ఉన్న సుగుణం.

ఈ మార్క్సిస్టు మూల సూత్రాల మార్గదర్శకత్వంలో మూడురోజుల పాటు అనంతపురంలో జరిగిన సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలు ఉద్యమాన్ని సమీక్షించి పార్టీ శ్రేణులకు స్పష్టమైన పథనిర్దేశం చేయడంలో జయప్రదమైనాయని చెప్పవచ్చు. స్వీయానుభవాల నుండి నేర్చుకుని వాటిని మూల సిద్ధాంతంతో పరిపుష్టి చేయగలగడం ఈ మహాసభ ప్రత్యేకత. రాష్ట్రంలోని 40,000 మంది పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 551 మంది ప్రతినిధులు, 87 మంది పరిశీలకులు హాజరైన మహాసభలను పార్టీ ప్రధాన కార్యదర్శి హరికిషన్‌సింగ్ సూర్జిత్ ప్రారంభించారు. మహాసభలో రాష్ట్ర కార్యదర్శి సమర్పించిన రాజకీయ నిర్మాణ నివేదిక ఒక అధ్యయన పత్రం మాదిరిగా, భవిష్యత్ దిక్సూచిగా ఉంది. రాష్ట్ర ఉద్యమాన్ని, నాయకత్వ పని తీరును ఆత్మవిమర్శనాపూర్వకంగా పరిశీలించడం ద్వారా నివేదిక మహాసభలో చర్చలకు ఒక మంచి వరవడి సృష్టించింది. గత నాలుగేళ్లలో పార్టీ నిర్వహించిన కార్యకలాపాలు, రాష్ట్రంలో ప్రస్తుతం నెలకొన్న రాజకీయ పరిస్థితులను వివరించడంతో పాటు వివిధ సందర్భాల్లో పార్టీ తీసుకున్న రాజకీయ నిర్ణయాల ఫలితాలను నిర్మొహమాటంగా మహాసభ ముందుంచడం జరిగింది. గత నాలుగేళ్ల ఉద్యమ అనుభవాలను క్రోడీకరించి సరైన గుణపాఠాలు తీసింది. జిల్లా కేంద్రాలు, దిగువ స్థాయి కమిటీల పని తీరునూ, ప్రజాసంఘాలలో పార్టీ కృషినీ సమీక్షించి వాటిలోని తీవ్రమైన లోపాలను ఎత్తి చూపింది. వీటన్నిటినీ సరిదిద్దుకుని పార్టీ ముందుకు పోయేందుకు 40 నిర్దిష్ట ప్రతిపాదనలు చేసింది.

గత మహాసభల అనంతర కాలంలో రాష్ట్ర రాజకీయాల్లో వచ్చిన మార్పులను నిర్మాణ నివేదిక విపులీకరించింది. ఈ కాలంలో బిజెపికి వ్యతిరేకంగా లౌకిక శక్తులతో ఉన్న తెలుగుదేశం పార్టీ ప్లేటు ఫిరాయించి బిజెపి పంచన చేరింది. తెలుగుదేశం ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు విధానాలను తలకెత్తుకుని ప్రజలమీద వరుసగా భారాలు మోపడం ప్రారంభించింది. ప్రపంచ బ్యాంకు ఇచ్చే 7000 కోట్ల రూపాయల రుణానికి ఆశపడి మన సార్వభౌమాధికారాన్ని పణంగా పెట్టింది. ప్రపంచ బ్యాంకు సలహాదారుల పర్యవేక్షణలో అన్నిరంగాల్లోనూ సంస్కరణలు ప్రారంభమయ్యాయి. విద్యుత్ సంస్కరణల్లో భాగంగా విద్యుత్ ఛార్జీలు పెంచింది. విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీని ప్రయివేటీకరిస్తున్నది. సాగు నీటి నిర్వహణను సాగునీటి సంఘాలకు అప్పగించింది. నీటి తీరువా పెంచింది. నీటి మీటర్లు పెడుతున్నది. త్రాగునీటి నిర్వహణ కూడా ప్రయివేటీకరించడానికి సన్నాహాలు చేస్తున్నది. ఉన్నత, సాంకేతిక విద్యారంగంలో విచక్షణా రహితంగా ప్రయివేటీకరణను ప్రోత్సహిస్తున్నది. ప్రాథమిక విద్యా సంస్థల భారాన్ని ప్రజలమీద మోపేందుకు విద్యా కమిటీలు వేసింది. ఆసుపత్రుల్లో యూజర్ ఛార్జీలు ప్రవేశపెట్టింది. 2007 నాటికి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించేందుకు రెండు దశల కార్యక్రమం రూపొందించి అమలు ప్రారంభించింది. సబ్సిడీలు తగ్గించి ప్రజాపంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నది. వ్యవసాయాన్నికూడా కార్పొరేటీకరిస్తున్నది. విత్తనాలు, ఎరువులపై సబ్సిడీ ఎత్తివేసింది. భూ సంస్కరణలకు స్వస్తి చెప్పింది. వ్యవసాయ పనుల్లో యంత్రాల వినియోగాన్ని ప్రోత్సహించి కూలీలకు పనుల్లేకుండా చేస్తోంది. నీటి పారుదల ప్రాజెక్టుల విషయమే పట్టించుకోవడం మానేసింది. మరోవైపు రాష్ట్రప్రభుత్వం అనుసరిస్తున్న ప్రపంచ బ్యాంకు అనుకూల విధానాల వల్ల రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దిగజారిపోయింది. ప్రభుత్వ అప్పు స్థూల ఉత్పత్తిలో 21.16 శాతానికి పెరిగింది. 2000-01లో 5146 కోట్ల మేర అప్పు అసలు ఫాయిదాలు కట్టాల్సి వస్తోంది.

ఈ ప్రభుత్వ విధానాల మూలంగా కొద్దిమంది సంపన్నులు మాత్రమే లాభపడుతున్నారని, సామాన్య ప్రజల్లో అసంతృప్తి తీవ్రమవుతున్నదని మహాసభ నివేదిక విశ్లేషించింది. ఈ విధానాలు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడుతాయని ప్రభుత్వం పెద్ద ఎత్తున చేసిన ప్రచారాన్ని మొదట నమ్మిన అనేక మందిలో క్రమంగా భ్రమలు తొలగుతున్నాయి. ప్రభుత్వం ఇప్పటికీ భ్రమలు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నప్పటికీ దానికా శక్తి క్రమంగా తగ్గుతోంది. ఆపద మొక్కుల పథకాలు, బూటకపు భాగస్వామ్య కమిటీలను ముందుకు తెస్తోంది. విద్యా కమిటీలు, మదర్స్ కమిటీలు, నీటి సంఘాలు వంటి కమిటీల్లో ప్రజల భాగస్వామ్యం లేకపోగా వాటి ద్వారా స్థానిక సంస్థల అధికారాలను పభుత్వం హరిస్తోంది. అదే సమయంలో ప్రపంచ బ్యాంకు అడుగుజాడల్లో ప్రభుత్వం ప్రజలను

తప్పుతోవ పట్టించే సిద్ధాంతాలుకూడా ప్రచారం చేస్తోంది. ప్రజలకు రాజకీయాలు వద్దని, అభివృద్ధినుండి రాజకీయాలను దూరం చేయాలని ప్రచారం ప్రారంభించింది. కమ్యూనిస్టు వ్యతిరేక విషాన్నివెళ్లగక్కుతోంది. వీటితో బాటు ప్రభుత్వంలో నిరంకుశ ధోరణులు కూడా పెరుగుతున్నాయి. ఇన్ని చేస్తున్నప్పటికీ అసంతృప్తితో ఉన్న ప్రజలు గతంలో కన్నా ఎక్కువగా ఉద్యమాల్లోకి వస్తున్నారు. స్పాంటేనియస్ ఉద్యమాలు కూడా పెరుగుతున్నాయి. ఉద్యమాల్లో పాల్గొనే ప్రజల మధ్య ఐక్యత కూడా పెరుగుతోంది. అదే సమయంలో ప్రజల అసంతృప్తిని విచ్ఛిన్నకర మార్గాలవైపు మళ్లించే శక్తులు కూడా చురుకుగా ఉన్నాయి. ప్రాంతీయ తత్వాలు, మతతత్వాలు, దుందుడుకు వాదాలను రెచ్చగొట్టే శక్తులు కూడా ప్రజల అసంతృప్తిని ఆసరా చేసుకుని బలపడడానికి ప్రయత్నిస్తున్నాయి. పాలక పార్టీపై ప్రజల అసంతృప్తి ఇటీవల జరిగిన ఎన్నికల్లో వరుసగా కనిపించింది. పాలక పార్టీలో అనైక్యత, ముఠాతత్వం ఎక్కువవుతున్నాయి. ఇటీవల మంత్రివర్గ విస్తరణలో ఈ అసంతృప్తి బయట పడింది. అయినప్పటికీ పాలక పార్టీల్లో అదే ఇప్పటికీ ఐక్యంగా ఉన్న పార్టీ. రాష్ట్రంలో కాంగ్రెస్ తీవ్రమైన ముఠాతత్వం, విధాన పరమైన గందర గోళంతో సతమత మవుతున్నది. అందు వల్ల ఇప్పటికీ అది ప్రధాన ప్రతిపక్షంగా ఉన్నప్పటికీ ప్రజల్లో విశ్వాసం చూరగొనలేక పోతున్నది. సాంప్రదాయకంగా కాంగ్రెస్ పార్టీని సమర్థించే దళితులు, మైనార్టీలు తదితర తరగతుల్లో కూడా దాని పట్ల విశ్వాసం సడలుతున్నది. ఈ కాలంలో వచ్చిన రాజకీయ అవకాశాలను ఉపయోగించుకుని బిజెపి రాష్ట్రంలో కొంత విస్తరించింది. ఈ మధ్యకాలంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ అసమర్థ, అవినీతికర పాలన వల్ల రాష్ట్రంలో దాని ప్రతిష్ట కొంత దిగజారినప్పటికీ మతతత్వశక్తులు రాష్ట్రంలో అనేకరూపాల్లో చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉన్నాయి. ఈ కారణాలవల్ల తెలుగుదేశం ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడడం మార్క్సిస్టు పార్టీ ప్రధాన కర్తవ్యమైందని రాజకీయ నిర్మాణ నివేదిక స్పష్టం చేసింది. దీంతో పాటు మతతత్వ బిజెపితో పోరాటం అనేది కూడా ముఖ్యమైన అంశంగానే ఉందని పేర్కొంది. అందువల్ల రానున్న కాలంలో తెలుగుదేశం-బిజెపీలకు వ్యతిరేకంగా పోరాడటమే ప్రధాన రాజకీయ కర్తవ్యమని మహాసభ నిర్ణయించింది.

ఇలాంటి పరిస్థితుల్లో మార్క్సిస్టు పార్టీ నిర్వహిస్తున్న పాత్రను నివేదిక తులనాత్మకంగా పరిశీలించింది. ఇటీవల రాష్ట్రరాజకీయాలలోనూ, ప్రజాపోరాటాలలోనూ పార్టీ చురుకైన పాత్ర నిర్వహిస్తోందన్న విషయం పార్టీ సభ్యులు, సానుభూతిపరులే కాదు రాష్ట్ర ప్రజానీకం యావత్తూ గుర్తించారు. 1999 ఎన్నికల్లో తగిలిన ఎదురుదెబ్బలు, అంతకుముందు సోషలిజానికి తగిలిన ఎదురుదెబ్బలు దీని ఆసరాగా సోషలిజంపై జరిగిన దాడి, సరళీకరణ విధానాలవల్ల పార్టీ అనుయాయుల్లో తాత్కాలికంగా కలిగిన భ్రమలు మొదలైన వాటివల్ల పార్టీలో ఏర్పడిన నిరాశనూ, స్తబ్ధతనూ అధిగమించేందుకు ఈ పోరాటాలు తోడ్పడ్డాయి. చంద్రబాబు నాయుడు ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాలను గమనించి, విశ్లేషించి ఆవిధానాల ప్రమాదాల గురించి ప్రజలను ఎప్పటికప్పుడు హెచ్చరించడంలో పార్టీ అన్ని వేళలా ముందుంది. ఆ విధానాల పర్యవసానంగా ప్రజలమీద, ఉద్యోగ కార్మికుల మీద పడే భారాలకు వ్యతిరేకంగా పోరాడ్డంలోనూ, పోరాటాలను మిలిటెంట్‌గా నడపడంలోనూ మార్క్సిస్టు పార్టీ సాటిలేని మేటి కృషి చేసింది. సిపిఐ, ఇతర వామపక్షాలతో కలిసి ఐక్య ఉద్యమాల నిర్మాణానికి చేసిన కృషి ఈ కాలంలో సత్ఫలితాలు ఇచ్చింది. నాలుగు నెలలపాటు సాగిన విద్యుత్ ఉద్యమంలోనూ, ఆర్టీసి సమ్మె సందర్భంలోనూ మార్క్సిస్టు పార్టీ నిర్వహించిన పాత్ర, ప్రదర్శించిన పోరాట పటిమ దానికి ప్రజల్లో సమస్యలపై సమరశీలంగా పోరాడే పార్టీగా గుర్తింపు తెచ్చింది. కులవివక్ష వ్యతిరేక పోరాటం, అంగన్‌వాడి, గ్రామసేవకుల ఉద్యమం కార్మికుల్లోనూ, రైతుల్లోనూ, వ్యవసాయకార్మికుల్లోనూ పార్టీ చేసిన కృషి, గిరిజనులు, వివిధ వృత్తిదారులు, మైనారిటీలు, మహిళలు, యువకులు, విద్యార్థులు తదితర సెక్షన్ల సమస్యలపై పార్టీ చూపిన చొరవ దానికి ఆయా సెక్షన్లలో మంచి గుర్తింపు తెచ్చింది. పోరాటాలు చెయ్యడంలోనే కాదు, నిర్బంధాలు ఎదుర్కోవడంలోనూ, త్యాగాలు చేయడంలో కూడా అదే అన్ని రాజకీయ పార్టీలకన్నా ముందుపీఠిన నిలుచుంది. అందుకే ఆ పార్టీకి ప్రజల్లో గుర్తింపు, ప్రతిష్ట పెరిగింది. పార్టీ ప్రజా సమీకరణలోనూ, విస్తరణలోనూ, పార్టీ పత్రిక విస్తరణ, నిధి వసూళ్లు తదితర విషయాల్లోనూ ఈ పురోగమనం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవలి స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా ఇది కొంత మేరకు కనిపించింది.

ఈ మేరకు పార్టీని చురుగ్గా కదిలించడంలో పార్టీ రాష్ట్ర నాయకత్వం జయప్రదమయ్యిందనే చెప్పాలి. రాష్ట్ర కేంద్రంలో పరిణామాలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూనే జిల్లాల్లోకూడా ఆయా సమస్యలు వచ్చినప్పుడు కిందిస్థాయి నాయకత్వాన్ని అప్రమత్తం చేయడంలోనూ, వారికి సరైన గైడెన్స్ ఇవ్వడంలోనూ మంచి కృషి చేసింది. అదే సమయంలో రాష్ట్రంలోని బలహీన ప్రాంతాలకు కూడా ఈ కాలంలో పార్టీ నిర్మాణాన్ని విస్తరించడానికి రాష్ట్ర నాయకత్వం ప్రత్యేక శ్రద్ధతో కృషి చేసింది. ఇప్పుడు పార్టీ నిర్మాణం అన్ని జిల్లాలకూ, దాదాపు అన్ని కేంద్రాలకూ విస్తరించింది. అదే విధంగా రాష్ట్ర కేంద్రంనుండి అన్ని ప్రజారంగాల్లోనూ నిరంతర కార్యక్రమాలు, ఉద్యమాలు జరిగేట్లు నిర్మాణాన్ని రూపుదిద్దింది. ఇవన్నీ రాష్ట్ర నాయకత్వం సాధించిన విజయాలే. అయితే పార్టీ శ్రేణులకు నిరంతరాయంగా రాజకీయ విద్య గరిపే విషయంలోనూ, డివిజన్లు, మండలాలు, శాఖలవరకు పార్టీ నిర్మాణాన్ని మరింత లోతుగా పర్యవేక్షించడంలోనూ రాష్ట్ర నాయకత్వ స్థాయిలో

ఆసాంతం అదే స్ఫూర్తి

అరుణిమ దాల్చిన అనంతపురం పట్టణంలో జనవరి 10వ తేదీ ఉదయం సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలు ఎంత స్ఫూర్తివంతంగా ప్రారంభ మయ్యాయో 12వ తేదీ సాయంత్రం ప్రతినిధుల అంతర్జాతీయ గీతాలాపనతో అంతే స్ఫూర్తివంతంగా ముగిసాయి. మార్క్సిస్టు పార్టీ సీనియర్ నాయకులు లావు బాలగంగాధర రావు అరుణపతాకావిష్కరణతో మహాసభలు ప్రారంభమయ్యాయి. వయోభారం, అనారోగ్యం రెండూ కలిసి కదలనీయని పరిస్థితి కల్పించినప్పటికీ ఆయన అనంతపురం మహాసభలకు రావడం, అరుణపతాకాన్ని ఆవిష్కరించడం, అనంతరం కార్యకర్తలనుద్దేసించి ప్రసంగించడం ప్రతినిధులందరికీ స్ఫూర్తినిచ్చింది. ముందుగా మహాసభను నడిపించే అధ్యక్ష వర్గాన్ని, స్టీరింగ్ కమిటీని వాటితో బాటు అర్హతల కమిటీని మహాసభ ఎన్నుకున్నది. సభాకార్యక్రమాల ప్రారంభానికి ముందుగా ఇటీవల మరణించిన కమ్యూనిస్టు పార్టీ నేతలు, కార్యకర్తలు, ఇతర వామపక్ష, అభ్యుదయ వాదులకు మహాసభ నివాళు లర్పించింది. ముఖ్యంగా ఇటీవలి వరకు రాష్ట్రపార్టీని నడిపించడంలో ప్రధాన పాత్ర నిర్వహించిన కామ్రేడ్స్ మోటూరు హనుమంతరావు, నండూరి ప్రసాదరావులు లేని లోటు మహాసభలో కొట్టొచ్చినట్లు కనిపించింది. ఈ నేతలందరికీ శ్రద్ధాంజలి ఘటిస్తూ ప్రతినిధులు మౌనం పాటించారు. సంతాపతీర్మానం ఆమోదంతో సభాకార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అనంతరం ఆహ్వాన సంఘం అధ్యక్షులు సింగమనేని నారాయణ ప్రతినిధులను ఆహ్వానిస్తూ ప్రసంగించారు. మహాకవి శ్రీశ్రీ కవితలను ఉటంకిస్తూ అనంతపురం కరువు పరిస్థితులను వివరిస్తూ ఆయన చేసిన ఉపన్యాసం ప్రతినిధులను, ప్రారంభ సభకు హాజరైన ఇతరులనూ కదిలించి వేసింది. పార్టీ ప్రధాన కార్యదర్శి హరికిషన్ సింగ్ సూర్జిత్ ఉపన్యాసంతో ప్రారంభ సభ ముగిసింది. సూర్జిత్ తన ఉపన్యాసంలో కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్యతో తనకు గల సాన్నిహిత్యాన్ని గుర్తుతెచ్చుకున్నారు. తెలంగాణా పోరాటం దేశ ఆర్థిక, రాజకీయరంగంలో తెచ్చిన మార్పులనూ, లేవనెత్తిన అంశాలనూ గుర్తుచేస్తూ నేడు అంతర్జాతీయంగా, జాతీయంగా మారిన పరిస్థితుల్లో పార్టీ పంథాను వివరించారు. సూర్జిత్‌తో పాటు పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు సీతారాం ఏచూరి మహాసభలకు హాజరయ్యారు. పొలిట్ బ్యూరోసభ్యులు, త్రిపుర ముఖ్యమంత్రి మాణిక్ సర్కార్ కూడా ప్రతినిధులనుద్దేశించి క్లుప్తంగా ప్రసంగించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. మహాసభల్లో చర్చలను మూడురోజులపాటు నిశితంగా పరిశీలించిన ఏచూరి 12వ తేదీన ప్రతినిధుల నుద్దేశించి ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్ పార్టీ నిర్వహించిన విద్యుత్ పోరాటం, కులవివక్ష వ్యతిరేక పోరాటం ఇతర రాష్ట్రాల్లో పార్టీకి అనుభవాలనిచ్చాయని చెప్పారు. మూడు రోజుల మహాసభల్లో రాష్ట్రం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలపై మొత్తం 25 తీర్మానాలను మహాసభ ఆమోదించింది.

కొంత లోపం కూడా జరిగిందని నిర్మాణ నివేదిక పేర్కొంది. అదే విధంగా జిల్లాకేంద్రాలు, ఇంకా దిగువ స్థాయిలో పార్టీ కమిటీల కృషిని కూడా నివేదిక సమీక్షించింది. ప్రజా సమస్యలపై స్పందించడంలోనూ, నిర్మాణాన్ని విస్తరించడం, పటిష్టపరుచుకోవడంలో ఉన్నలోపాలను నిశితంగా ఎత్తి చూపింది. వీటిని సరిదిద్దుకోవడం రానున్న కాలంలో పార్టీకి అత్యంత కీలక విషయమని పేర్కొంది. నివేదికపై చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులంతా ఈ అభిప్రాయాలతో ఏకీభవించారు. తమ కమిటీల పనిలో నివేదిక ఎత్తిచూపిన లోపాలను సరిదిద్దుకుని ఉద్యమాన్ని మరింత ముందుకు తీసుకుపోతామని ప్రతిన చేసారు. నివేదికపై మూడుపూటలు జరిగిన చర్చల్లో వివిధ జిల్లాల నుండి, ప్రజారంగాలనుండి 60 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. చర్చలు ఎంతో ఉన్నత స్థాయిలో జరిగాయి. మహాసభకు అఖిల భారత కేంద్రం నుండి వచ్చిన పొలిట్‌బ్యూరో సభ్యులు సీతారాం ఏచూరి కూడా తన ముగింపు ఉపన్యాసంలో ఇదే విషయం చెప్పారు. మహాసభలో చర్చల కోసం 8 గంటలు కేటాయించగా మరో 4 గంటలు జిల్లాలు, సంఘాల వారీ గ్రూపు చర్చలు జరిగాయి. చర్చ సందర్భంగా ప్రతినిధులు తమ జిల్లాల్లోనూ, ప్రజారంగాల్లోనూ వచ్చిన ఉద్యమానుభవాలను వివరించడంతో పాటు జరిగిన పొరపాట్లను కూడా నిర్మొహమాటంగా చెప్పారు. కార్యదర్శి ప్రవేశ పెట్టిన నివేదికను స్థూలంగా అంగీకరిస్తూనే దానిలో పరిపుష్టం చేయాల్సిన కొన్ని ముఖ్యమైన విషయాలను దృష్టికి తెచ్చారు.

తెలుగుదేశానికి కాంగ్రెస్ ప్రత్యామ్నాయం కాదని మహాసభ అభిప్రాయపడింది. కాంగ్రెస్ కూడా అదే ఆర్థిక విధానాలు అనుసరించడం ముఖ్య కారణం. అంతేకాక 40 ఏళ్ల కాంగ్రెస్ పాలన దాన్ని ప్రజల నుండి వేరు చేసింది. అది తన ప్రతిష్టను కోల్పోయింది. ఈస్థితిలో వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ప్రత్యామ్నాయమే సరైన రాజకీయ వేదిక అవుతుంది. ప్రస్తుతం రాష్ట్రంలో సిపిఐ(ఎం), సిపిఐ రెండు ప్రధాన వామపక్ష పార్టీలు రాజకీయంగా కూడా కలిసి పనిచేస్తున్నాయి. ఆచరణలో ఐక్యతకు అవరోధంగా ఉన్న కొన్నిసమస్యలను పరిష్కరించుకోవాల్సి ఉంది. అదే సమయంలో ఇతర వామపక్ష గ్రూపులు సమస్యలపై కలిసి వస్తున్నా రాజకీయ కార్యాచరణకు సిద్ధంగా లేవు. వాటి వైఖరిలో మార్పు రావాల్సి ఉంది. రాష్ట్రంలో వామపక్ష శక్తుల ఐక్యత కోసం కృషిచేస్తూనే ఉద్యమాల ద్వారా ప్రజలను కూడగట్టి ప్రత్యామ్నాయ శక్తులను బలపరచుకోవాలని మహాసభ పిలుపునిచ్చింది.

మహాసభ నివేదికనూ, చర్చలనూ సంగ్రహ పరిస్తే ముందుకొచ్చిన సమస్యలు ఈ విధంగా ఉన్నాయి:

మొదటిది, పార్టీ రాజకీయ ఎత్తుగడలకు సంబంధించినది: రాష్ట్రంలో పార్టీ రాజకీయ విధానం జాతీయ విధానానికి లోబడి ఉంటుంది. కమ్యూనిస్టు పార్టీ తన రాజకీయ ఎత్తుగడల్లో ఒక భాగంగా బూర్జువా పార్టీల మధ్య చీలికలను, విభేదాలను ఉపయోగించుకోవాలి. ఒంటెత్తు వాదం పార్టీని నాశనం చేస్తుంది. అదే సమయంలో అది తన స్వతంత్రతను కూడా కాపాడుకోవాలి. లేకపోతే దాని పునాది బలహీన పడుతుంది. ఎన్నికల్లోనూ, పోరాటాల్లోనూ బూర్జువా పార్టీలతో కలిసి వ్యవహరిస్తూనే పార్టీ స్వతంత్రతను కాపాడుకోవడం ఎలా? 15 ఏళ్ల పాటు మన రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీతో మనకు గల ఎన్నికల అవగాహన వల్ల కలిగిన లాభనష్టాలను ఎలా అర్ధం చేసుకోవాలి? ఎటువంటి గుణపాఠాలు తీసుకోవాలి? ఈ పాఠాల దృష్ట్యా ప్రస్తుతం ప్రజావ్యవతిరేక విధానాలు అనుసరిస్తున్న తెలుగుదేశం-బిజెపి కూటమిని ఓడించే విషయంలోనూ, వారి విధానాలకు వ్యతిరేకంగా ఐక్య పోరాటాలు నిర్వహించే విషయంలోనూ కాంగ్రెస్‌తో ఏవిధంగా వ్యవహరించాలి?

రెండవది, ఉద్యమ విస్తరణకు సంబంధించింది: రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రపంచ బ్యాంకు ఆదేశిత విధానాల వల్ల ప్రజలపై భారాలు పెరుగుతున్న కొద్దీ అసంతృప్తి పెరిగి వారు మరింత ఎక్కువగా ఉద్యమాల్లోకి వస్తున్నారు. అసంతృప్తి చెందిన ప్రజలను ఉద్యమాల్లోకి నడపడంలోనూ, స్పాంటేనియస్ ఉద్యమాల్లో జోక్యం చేసుకోవడంలో ఇతర అన్ని పార్టీలకన్నా మార్క్సిస్టు పార్టీ ముందుంది. అనేక మిలిటెంటు పోరాటాలు నిర్వహించింది. దీని వల్ల పార్టీ ప్రతిష్ట పెరిగింది. వివిధ వర్గ సామాజిక సెక్షన్లలో పార్టీ, ప్రజాసంఘాలు నిరంతరాయంగా జరిపిన పోరాటాలు ఆ సెక్షన్లలో పార్టీకి మంచి గుర్తింపు తెచ్చాయి. అయితే ఈ ప్రతిష్ట, ఈ గుర్తింపు పార్టీ సభ్యత్వంలో తగిన విధంగా ప్రతిఫలించడంలేదు. పార్టీ కొత్త ప్రాంతాలకు విస్తరించినప్పటికీ దాని ప్రజాపునాది ఇంకా నిలకడగానే ఉంది. కొత్త ప్రాంతాల్లో, కొత్త సెక్షన్లలో ఉద్యమాలు జరిగిన చోట్ల విస్తరించింది, సాంప్రదాయకంగా బలంగా ఉన్న కొన్నిచోట్ల యధాతధంగానే ఉంది లేక కొంత తగ్గింది. ఈ లోపం ఎందుకు జరిగింది? ఎలా అధిగమించాలి?

ఈ రెండు సమస్యలకు సమాధానాలివ్వ డంతో పాటు గత పోరాటానుభవాల వెలుగులో భవిష్యత్ పోరాటాలు, ఎత్తుగడలు, నిర్మాణానికి సంబంధించి పార్టీ శ్రేణులకు స్పష్టమైన మార్గాన్ని నిర్దేశించింది.

మొదటిది, బూర్జువా పార్టీల్లో వైరుధ్యాలను, చీలికలను ఉపయోగించుకోవాలి, అదే సమయంలో పార్టీ స్వతంత్రతను కాపాడుకోవాలి. గతంలో తెలుగుదేశం పార్టీతో మిత్రత్వం విషయంలో పార్టీ స్వతంత్రత కాపాడుకోవడంలో లోపం జరిగింది. భవిష్యత్తులో కాంగ్రెస్‌తో కాని మరో బూర్జువా పార్టీతో గాని వ్యవహరించేటప్పుడు ఈ గుణపాఠం మనకు ఉపయోగ పడుతుంది. రాజకీయంగా కాంగ్రెస్‌తో ఎలాంటి పొత్తు వుండదని మహాసభ స్పష్టం చేసింది. అయితే అదే సమయంలో బిజెపినీ, కాంగ్రెస్‌నూ ఒకే గాట కట్టి చూడ్డం సరికాదు. రాష్ట్రంలో బిజెపి,

(మిగతా 26వ పేజీలో)

అనంతపురం కామ్రేడ్స్‌కు అడుగడుగునా జేజేలు

పెద్ద ప్రజాపోరాటం జరుగుతున్న ప్రాంతంలోనో, తీవ్రమైన నిర్బంధం లేక కరువుకాటకాలు ఎదుర్కొంటున్న ప్రాంతాల్లోనో మహాసభలు జరిగినప్పుడు అక్కడి పరిస్థితులు కూడా మహాసభలపై ప్రభావం వేస్తాయి. తీవ్రమైన కరువును ఎదుర్కొంటున్న అనంతపురం జిల్లా కామ్రేడ్స్ ఆ పరిస్థితుల్లో కూడా మహాసభలకు ఆతిధ్యమివ్వడమే కాకుండా ఎంతో స్ఫూర్తిదాయకంగా మహాసభలు నిర్వహించినందుకు ప్రతినిధులందరి మన్ననలందుకున్నారు. చర్చల్లో పాల్గొన్న ప్రతినిధులంతా తమతమ జిల్లాల తరఫున, ప్రజారంగాల తరఫున అనంతపురం కామ్రేడ్స్‌కు అభినందనలు తెలిపారు. జిల్లాలో ఉద్యమం చిన్నది. నాయకులంతా యువకులు. కరువుపై ప్రభుత్వ నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా మిలిటెంట్ పోరాటాలు నిర్వహిస్తూనే అదే మిలిటెన్సీతో మహాసభ ఏర్పాట్లు కూడా చేశారు. మహాసభ ప్రారంభానికి ముందే పట్టణాన్ని ఎర్ర జెండాలు, తోరణాలతో అరుణార్ణవం చేశారు. పట్టణంలో ఎక్కడ చూసినా పండుగ వాతావరణం నెలకొంది. 10వ తేదీ ప్రదర్శనకు ప్రధానంగా జిల్లానుండి ప్రజలు వేల సంఖ్యలో తరలివచ్చి పార్టీ ప్రజాపలుకుబడిని చాటిచెప్పారు. సాయంకాలం పార్టీ అనంతపురం జిల్లా కార్యదర్శి ఓబులకొండా రెడ్డి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో సూర్జిత్, మాణిక్ సర్కార్, సీతారాం ఏచూరితో పాటు పార్టీ రాష్ట్ర నాయకులు కొరటాల సత్యనారాయణ, బివి రాఘవులు, మల్లు స్వరాజ్యం, ఎంఎ గఫూర్, జిల్లా నాయకులు విశ్వేశ్వర రెడ్డి తదితరులు ప్రసంగించారు. సభకు వేలాదిగా హాజరైన ప్రజలు చివరి వరకు నాయకుల ప్రసంగాలను ఆసక్తితో విన్నారు. చంద్రబాబు విధానాలకు వ్యతిరేకంగా నాయకులు మాట్లాడుతున్నప్పుడు సభికులనుండి వచ్చిన ప్రతిస్పందన వారిలో రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై గూడుకట్టుకున్న వ్యతిరేకతను వెల్లడించింది. సభకు ముందు పట్టణంలో బ్రహ్మాండమైన ర్యాలీ జరిగింది. కోలాటాలు, పులివేషాలు వంటి కళారూపాలతోనూ, దిక్కులు పిక్కటిల్లే నినాదాలతోనూ సాగిన ప్రదర్శన పట్టణ వాసులను ఎంతగానో ఆకట్టుకుంది. విలయ తాండవం చేస్తున్న కరువు, ప్రతి రోజూ రైతుల ఆత్మహత్యలు చేసుకుంటున్న పరిస్థితుల్లో కూడా మహాసభను నిర్వహించడమే కాకుండా ప్రతినిధులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లుచేసిన కార్యకర్తల కృషి అందరి అభినందనలు అందుకున్నది. ఏర్పాట్లకు పార్టీ సభ్యులే కాకుండా పట్టణంలోని అనేక మంది సానుభూతి పరులు సహకరించడం విశేషం. పార్టీ కార్యదర్శి బివి రాఘవులు ముగింపు సందర్భంగా వారందరినీ పేరుపేరునా ప్రతినిధులకు పరిచయం చేసి కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజాధనం ప్రైవేట్ లూటీ

ప్రబీర్ పుర్కాయస్థ

ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల కొన్ని ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలతో ఒప్పందాలు(ఎంఓఎలు)ను కుదుర్చుకుంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఓ అరడజను స్వతంత్ర విద్యుత్ ఉత్పత్తి దారుల(ఐపిపి) ప్రాజెక్టులకు ప్రాధమికంగా పవర్ ఫైనాన్స్ కమిషన్ (పిఎఫ్‌సి), ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఐడిబిఐ) వంటి ఈ ఫైనాన్స్ సంస్థలు రుణ సాయాన్ని అందించనున్నాయి. వీటినే ఓ గొప్ప వినూత్న చర్యగా ఇటు ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం, అటు కేంద్ర ప్రభుత్వమూ చెప్పుకుంటున్నాయి.

ఈ ఒప్పందంలోని ముఖ్యమైన అంశాల విషయాల్లోకి మనం వెళ్లే ముందు ఆ ఒప్పందాలు అవసరమేంటి? అన్న విషయం తెలుసుకోవాల్సిన అవసరముంది. ఐపిపిల ప్రాధమిక లక్ష్యాలు నెరవేరాలంటే పబ్లిక్ ఫైనాన్స్‌లపై భారాన్ని తగ్గించేందుకు అదనపు పెట్టుబడి తేవాలి. అది జరిగేది కాదు. ఎందుకంటే విద్యుత్ ప్రాజెక్టుల్లో ప్రభుత్వ పెట్టుబడుల కొరత వుందన్న నెపంతోనే విద్యుత్ రంగంలో ప్రైవేట్ పెట్టుబడులను అనుమతించే ఈ ప్రతిపాదన తెచ్చారు. భారత ప్రభుత్వం 1991లో తెచ్చిన గెజిట్‌లో ఇలా పేర్కొన్నారు." విద్యుత్ రంగంలో అదనపు సామర్థ్యం సాధించే లక్ష్యంతో ప్రైవేట్ యాజమాన్యంలోని సంస్థల భాగస్వామ్యాన్ని మరింతగా ప్రోత్సహించే విధానాన్ని ప్రభుత్వం రూపొందించింది. ఇది విద్యుత్ ఉత్పత్తి, సరఫరా, పంపిణీ రంగాలన్నిటికీ వర్తిస్తుంది". అయినా ఈ ఐపీపీలు తెచ్చిన పెట్టుబడులు చాలా స్వల్పం. అవి పబ్లిక్ ఫండ్స్ నుంచి తీసుకునే రుణాలపైనే పూర్తిగా ఆధారపడ్డాయి. చివరికి అవి తమ ప్రాజెక్టుల మూలధన వ్యయానికి , కూడా ఈ రుణాలపైనే ఆధార పడుతున్నాయి.

నిలకడలేని ఐపిపిలు

ఉదాహరణకు దభోల్ ప్రాజెక్టునే చూద్దాం. ఎన్రాన్ సంస్థ భారతీయ ఫైనాన్స్ సంస్థలనుండి 120కోట్ల డాలర్ల "రుణాన్ని" తీసుకోవడమే గాక విదేశీ రుణదాతలనుండి 70 కోట్ల డాలర్ల మేర అప్పు తెచ్చుకునేందుకు కూడా హామీ పొందింది. ఎస్ కె కుమార్‌కు చెందిన మహేశ్వర్ ప్రాజెక్టు సేకరించిన నిధుల్లో 90 శాతం దాకా ఈ ఫైనాన్స్ సంస్థల నుంచి, పబ్లిక్ సెక్టార్ నుంచి అలాగే మధ్య ప్రదేశ్ ప్రభుత్వం నుండి సమక్చూర్చుకున్నవే. ప్రజా ధనాన్ని, ఫైనాన్స్ సంస్థలనుంచి రుణాలను ప్రమోటర్స్ ఎలా దండుకున్నదీ, దానిని కాంట్రాక్టర్లకు, రోల్స్‌రాయిసీలకు ఎలా పంచి పెట్టిందీ స్పెక్ట్రమ్ గోదావరి కేసు (బాక్స్‌లో చూడండి) ను చూస్తే అర్ధమవుతుంది. వీటినే అది తన ఈక్విటీలుగా పేర్కొంది. ఈ మోసపూరిత లోపాయికారీ విధానాల ఫలితంగా ఈ బడా కంపెనీల ప్లాంట్ వ్యయం విపరీతంగా పెరిగిపోవడం, వినియోగదారులకు అవి అందించే విద్యుత్ అత్యంత ఖరీదుతో కూడుకోవడం జరుగుతోంది. భారీగా పెరుగుతున్న ప్లాంట్ వ్యయం మూలంగా ఐపిపిలు అంతకంతకూ అస్థిరంగా తయారవుతున్నాయి. ఫైనాన్స్ సంస్థలు ఇచ్చిన రుణాలు తిరిగి రాక అవి నిరర్ధక ఆస్తులు(ఎన్‌పిఏలు)గా మారుతున్నాయి. దభోల్ కేసునే గనుక చూస్తే ఒక్క ఐపిపి నుంచే రు. 9వేలనుండి రు. 12వేల కోట్ల దాకా ఈ ఎన్‌పిఏలు బకాయి పడి వున్నట్లు తేలింది. ఈ నేపథ్యంలో ప్రస్తుతం చేపడుతున్న, భవిష్యత్‌లో చేపట్టనున్న ఐపిపి ప్రాజెక్టులను మనం వీక్షించాలి. దభోల్ ఉదంతం జరిగాక కూడా ఫైనాన్స్ సంస్థలుగానీ, ప్రభుత్వం గానీ దీనినుంచి ఏమీ గుణపాఠం నేర్చుకున్నట్లు కనిపించడంలేదు. ఆంధ్రప్రదేశ్‌లో ఒక వైపు విద్యుత్ ఛార్జీల పెంపునకు తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతున్నా, ఈ దివాళాకోరు ఐపిపి తరహా విద్యుత్ అభివృద్ధికి అవి ఇంకా ప్రయత్నించడమే ఇందుకు కారణం. అవి ఇప్పటికీ ఐపిపిల ప్రాజెక్టులకు అవసరమైన రుణాలు ఇప్పించేందుకు హామీ ఇస్తున్నాయి. ఈ విధంగా అవి తగినన్ని నిధులను రుణం ద్వారా సమకూర్చుకున్నాక స్పెక్ట్రమ్, దభోల్ లో మాదిరిగా ఆ నిధులను తమ కాంట్రాక్టర్లకు పునఃపంపిణీ చేయడం ద్వారా తమ ఈక్విటీతోబాటు లాభాలను జేబులో వేసుకుంటాయి. ఆ తరువాత అవి ఈ ప్లాంట్లను తమ "సొంతం" చేసుకుంటాయి. ఒక కిలోవాట్ కూడా ఉత్పత్తి చేయకముందే గిజగిజలాడుతుంటాయి. ఒకవేళ ఉత్పత్తి చేసినా దానిని అంత ధర చెల్లించి కొనే నాధుడు వుండరు. అప్పుడు దభోల్ ప్రాజెక్టు మాదిరిగా ఈ ప్రాజెక్టు ఖాయిలా పడితే ఫైనాన్స్ సంస్థలు తమ సంచులు చంకనబెట్టుకుపోతాయి. ఇందులో పోయేది చివరికి ప్రజల సొమ్మే . ఒక వేళ ఈ ఐపిపి విద్యుత్‌ను అధిక ధరకు కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం, రెగ్యులేటరీ కమిషన్ అంగీకరిస్తే వాటికి ఇక ఢోకాయే వుండదు. ఒక్క పైసా కూడా ఈక్విటీ పెట్టకుండా లాభాలను చక్కగా జుర్రుకుంటాయి.

ఇక్కడ ఒక ముఖ్యమైన విషయమేమిటంటే ఈ ప్రాజెక్టుల రుణచెల్లింపు సామర్ధ్యం. ఈ ప్రాజెక్టుల "యజమానులెవరూ" రుణం కోసం తమ ఆస్తులను కుదువబెట్టడానికి ఇష్టపడరు. ఈ ప్రాజెక్టుకు సంబంధించిన "రిస్క్" (నష్టదాయకమైన)లన్నిటినీ ఎపి ట్రాన్స్‌కోయే భరించాలని, రుణ దాతలకు తగిన గ్యారంటీలు కూడా అదే ఇవ్వాలని ఐపిపి ప్రాజెక్టు యజమానులు చెబుతున్నారు. ఫైనాన్స్ సంస్థలు, ఎపి ట్రాన్స్‌కో, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మధ్య సంతకాలు జరిగిన పైన పేర్కొన్న ఎంఓఏల సారాంశం ఇదే.

ట్రాన్స్‌కోయే రిస్కులను భరించాలి

హామీలిచ్చిన ఈ మెరుగుపూత చర్యలగొడవ అలా వుంచి మరో ముఖ్యమైన విషయానికొద్దాం అదేంటంటే నూటికి నూరు శాతం మీటరింగ్, ఇంధన తనిఖీ, సరఫరా, పంపిణీలో నష్టాల తగ్గింపు తదితర చర్యలను అది ఐపిపి పాలసీ కానీ , మరొకటి కానీ తప్పనిసరిగా చేపట్టాల్సిన అవసరముంది. ఆ విధంగా చూసినప్పుడు ఐపిపి పాలసీలకు సంబంధించిన ఈ ఒప్పందాల అమలు భాగానికి చాలా ప్రాధాన్యత వుంది. ఫైనాన్స్ సంస్థల నుండి రుణాలు తీసుకునేది ఐపిపిలే అయినా ఆ రుణాలకు కుదువ పెట్టేది ఎపి ట్రాన్స్‌కో ఆస్తులే. ఒక వేళ ఆ ఆస్తులు చాలకపోతే తనకు ప్రస్తుతం వస్తున్న, భవిష్యత్‌లో వచ్చే రాబడి అంతటిపై అప్పులవారికి అధికారమిస్తూ "ఎస్క్రో" అకౌంట్ తెరిచి వుంచుతానని హామీ కూడా ఇచ్చింది. ఈ "ఎస్క్రో " అకౌంట్‌ను తెరవడమంటే ట్రాన్స్‌కో ఆదాయంపై మొదటి హక్కుదారుగా ఐపిపిని చేయడమే అవుతుంది. మరో మాటలో చెప్పాలంటే ఐపిపి ప్రాజెక్టుకి సంబంధించిన రిస్కులన్నిటికీ రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని ఎపి ట్రాన్స్‌కో పూర్తి గ్యారంటీ ఇవ్వడమే.

పూర్వపు ఆంధ్రప్రదేశ్ విద్యుచ్ఛక్తి సంస్థ (ఎపిఎస్ఇబి)ని మూడు ముక్కలు చేసిన తరువాత తామర తంపరగా అనేక మంది పంపిణీదారులు అకస్మాత్తుగా పుట్టుకొచ్చారు. ప్రైవేటీకరణకు రంగం సిద్ధమవుతుండడంతో వీరి సంఖ్య మరింత పెరుగుతోంది. ప్రభుత్వ అధీనంలోని ట్రాన్స్‌కో మాత్రం విద్యుత్ ఉత్పత్తి దారులనుంచి విద్యుత్‌ను కొని పంపిణీదారులకు సరఫరా చేస్తుంది. విద్యుదుత్పత్తి రంగంలోని ప్రైవేట్ ఉత్పత్తిదారులు తమ విద్యుత్‌ను ట్రాన్స్‌కోకు తప్ప నేరుగా పంపిణీదారులకు అమ్మలేరు. ఇక్కడే వుంది అసలు మతలబు. దీనిని అర్థం చేసుకోవడం చాలా సులభం. ఎపి ట్రాన్స్‌కో ఇచ్చిన గ్యారంటీల ఆధారంగా ఫైనాన్స్ సంస్థలు ఐపిపి ప్రాజెక్టులకు రుణసహాయాన్ని సమకూరుస్తాయి. అటువంటప్పుడు ఐపిపిలు ప్రాజెక్టులను స్వయంగా చేపట్టాల్సిన అవసరమెందుకు వస్తుంది? "పెట్టుబడిదారులు తమ నష్టాలకు తామే బాధ్యత వహించాల్సి వుంటుంది కాబట్టి వారు కష్టపడి లాభాలు సంపాదిస్తారు" అని పెట్టుబడిదారీ గ్రంథం మనకు నూరిపోస్తుంది. ఇది భారతీయ పెట్టుబడిదారుల విషయంలో అందులోనూ విద్యుత్ రంగంలో పచ్చి అబద్ధమని తేటతెల్లమవుతోంది. ఐపిపిలు అదనపు వనరులను సేకరిస్తుంటాయన్న వాదనలో కూడా పసలేదని తేలిపోయింది.

ప్రజల సొమ్ము ప్రైవేట్ భోజ్యం

విద్యుత్ రంగంలో సంస్కరణల పేరుతో జరుగుతున్నదేమిటో ఇప్పుడు స్పష్టమైంది. ఈ సంస్కరణల ఉద్దేశం ప్రజల పెట్టుబడిని ప్రైవేట్ రంగం లూటీ చేయడం తప్ప మరొకటి కాదు. ఫైనాన్స్ సంస్థలు ప్రైవేట్ పెట్టుబడికి ఎలా దాసోహమైనదీ యుటిఐ కుంభకోణమే నిదర్శనం. తారాపూర్ కమిటీ నివేదికలో ఇది మరింత స్పష్టమైంది. విద్యుత్ రంగంలో ఈ పద్ధతి ఇంకా ఇలాగే కొనసాగుతోంది. పిఎఫ్‌సి, ఐడిబిఐ, ఐఎఫ్‌సిఐ వంటి ఫైనాన్స్ సంస్థల్లోని సొమ్ము అంతా ప్రైవేట్ పెట్టుబడిదారుల భోషాణాలలోకి వెళుతోంది.

స్పెక్ట్రమ్ విద్యుదుత్పత్తి కుంభకోణం

కాకినాడ వద్ద 200 మెగావాట్ల గోదావరి గ్యాస్ ఆధారిత కంబైన్డు సైకిల్ విద్యుత్ ప్లాంట్‌ను నెలకొల్పాలని ఎన్‌టిపిసి మొదట నిర్ణయించింది. అందుకవసరమైన గ్యాస్ కేటాయింపులు పొందింది. 600 హెక్టార్లభూమిని కూడా సేకరించింది. ఇందుకు సంబంధించిన ఇతర అనుమతులన్నీ పొందింది. 1991లో విద్యుత్ విధానాల్లో వచ్చిన నూతన మలుపుతో అంటే ఐపిపి విధానాలతో ఇదంతా ఒక్కసారిగా తారుమారైంది. ఆ ప్రాజెక్టును ఎవి మోహనరావు అనే ఓ ప్రవాస భారతీయుని ఆధ్వర్యంలోని స్పెక్ట్రమ్ టెక్నాలజీ లిమిటెడ్ అనే సంస్థకు అప్పగించాలని ఎన్‌టిపిసికి ఆదేశాలు జారీ అయ్యాయి. మోహనరావు తరువాత ఈ ప్రాజెక్టులోకి తన సంబంధీకుడైన కృష్ణారావు ఆధ్వర్యంలోని జయా ఫుడ్స్ అనే మరో కంపెనీని చేర్చుకున్నారు. ఎన్‌టిపిసికి కూడా ఒక చిన్న వాటా(పది శాతం ఈక్విటీ మాత్రమే) కల్పించారు. ఇది కూడా అభివృద్ధి వ్యయానికి సంబంధించినదే. ఈ విధంగా ఏర్పడిన స్పెక్ట్రమ్ పవర్‌జనరేషన్ లిమిటెడ్(ఎస్‌పిజిఎల్) లో మోహనరావు, కృష్ణారావు 90 శాతం దాకా వాటా కలిగివున్నారు.

ప్రారంభంనుండే ఈకంపెనీపైకృష్ణారావు తన ఆధిపత్యం చలాయిస్తూ మోహనరావు, ఎన్‌టిపిసిలతో కుదుర్చుకున్న ప్రమోటర్స్ అగ్రిమెంట్‌ను ఏకపక్షంగా రద్దు చేయాలని నిర్ణయించారు. వారికి ఇందులో షేర్లు(వాటాలు)ఇచ్చేందుకు నిరాకరించారు. దీనిపై కృష్ణారావుకు వ్యతిరేకంగా మోహనరావు , ఎన్‌టిపిసి ఢిల్లీ హైకోర్టులో పిటిషన్ వేశారు.

ఈ లిటిగేషన్ల ఫలితంగా ఇందుకు సంబంధించిన అనేక పత్రాలను కోర్టు రాబట్టింది. ఆ పత్రాల్లోని విషయాలు ఈ ఐపిపి ప్రాజెక్టుల నగ్న స్వరూపాన్ని బయటపెట్టాయి. కృష్ణారావుకు వ్యతిరేకంగా ప్రధానంగా రెండు ఆరోపణలు మోపబడ్డాయి. ఇందులో ఒకటి ఇపిసి కాంట్రాక్ట్‌కు సంబంధించినది. ఈ కాంట్రాక్టు బ్రిటన్‌కు చెందిన రోల్స్ రాయిసీకి మంజూరు చేశారు. ఈ ప్రాజెక్టుకు రాయిసీయే ప్రధాన కాంట్రాక్టర్‌గా వ్యవహరిస్తోంది. రాయిసీ ప్లాంట్‌ను, సామగ్రిని సరఫరాచేయడమేగాక ఈ ప్లాంట్ మొత్తం నిర్మాణాన్ని పూర్తిచేసి పనిచేసే స్థితిలో స్పెక్ట్రమ్‌కు అప్పగించాలి. మోహనరావు సమర్పించిన పత్రాల్లో సమాచారాన్నిబట్టి ఇప్పుడు తేలిందేమిటంటే రోల్స్ రాయిసీకి "కమిషన్" రూపేణా కోటి 93 లక్షల డాలర్లు ముట్టజెప్పారు. ఇది కాకుండా బ్రిటిష్ విర్జిన్స్‌లాండ్స్‌లో కృష్ణారావు నెలకొల్పిన తవానాడ సర్వీసెస్ అనే ఓ బోగస్ కంపెనీకి 13 లక్షల పౌండ్లు చెల్లించారు. అంతేకాదు 30కోట్ల రూపాయల విలువైన నకిలీ కాంట్రాక్టులను కూడా కృష్ణారావు ఇతర కంపెనీలకు అప్పగించారు. ఈ కంపెనీలు అతను, అతని కుమారులు, ఇతర సంబంధీకులే నడుపుతున్నారు. ఈ కాంట్రాక్టులన్నిటినీ చివరికి ఇపిసి కాంట్రాక్టు పరిధిలోకి తెచ్చారు. ఇదే కాలంలో స్వచ్ఛంద ఆదాయ వెల్లడి పథకం(విడిఐఎస్) కింద ఆయన ప్రకటించిన వివరాల్లో జయ ఫుడ్స్ మొత్తం టర్నోవర్ రు. 35కోట్లు, వెర్మిసెల్లీ కంపెనీ వార్షిక టర్నోవర్ 2 కోట్లు వున్నట్లు పేర్కొన్నారు. కృష్ణారావు ఈ ప్రాజెక్టు లో పెట్టిన ఈక్విటీ అంతా కాంట్రాక్టర్ల ముడుపులు, ప్రాజెక్టు నిధుల దారి మళ్లింపు ద్వారా ఆయన సంపాదించినవే. ఇది కోర్టుకు సమర్పించిన లిఖితపూర్వక సాక్ష్యాధారాలలోను, ఈ ప్రాజెక్టుకు రుణాన్ని సమకూర్చిన రుణదాతల్లో ఒకటైన ఐడిబిఐ నిర్వహించిన ఆడిట్స్‌లోను, ఆదాయపుపన్ను అధికారుల ఆడిట్స్‌లోను స్పష్టంగా వెల్లడైన విషయమేమిటంటే పైన మనం పేర్కొన్నట్లు ఈ ప్రాజెక్టు సమస్తం అవకతవకల మయం అని నిరూపితమైంది.

ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రు. 400కోట్లుగా ఎన్‌టిపిసి మొదట పేర్కొంది. తరువాత ఇది ప్రైవేట్ రంగం చేతుల్లోకి వచ్చేసరికి ఈ అంచనా వ్యయం అమాంతంగా ఒక్కసారి 1100కోట్లకు చేరుకుంది. చట్టాన్ని నేరపూరితంగా ఉల్లంఘనకు పాల్పడిన ఫలితమే ఇది. ఇవన్నీ ఫెరా , కంపెనీల చట్టానికి సంబంధించిన నేరపూరిత ఉల్లంఘనలే. అలాగే ఐడిబిఐ(స్పెక్ట్రమ్ కు రుణాన్ని ఇచ్చిన ఫైనాన్స్ సంస్థల్లో ప్రధానమైనది)ని కూడా అది దారుణంగా వంచించింది. అయినా దీనిపై అటు ఐడిబిఐ కానీ, ఇటు ప్రభుత్వం కానీ ఇంతవరకు ఎటువంటి తదుపరి చర్య తీసుకోకపోవడం గమనార్హం. కృష్ణారావు పెట్టినట్లు చెప్పుకుంటున్న ఈక్విటీ మొత్తం ఐడిబిఐ నుండి రుణంగా తెచ్చినదే. ఆవిధంగా సమకూర్చుకున్న మొత్తాన్నే రోల్స్‌రాయిసీ వంటి కాంట్రాక్టర్లకు స్పెక్ట్రమ్ చెల్లించింది. వీటన్నిటినీ కూడితే అక్రమాల ద్వారా అది సంపాదించింది 180 కోట్లు అని తేలింది. ఇది కేవలం బయటకు కనిపించేది మాత్రమే. ఇంకా అట్టడుగున పడి కనిపించని అక్రమాలెన్నో!

స్పెక్ట్రమ్ ప్రాజెక్టుకు సంబంధించిన మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే అక్రమాల గనిలా పేరొందిన ఈ ప్రాజెక్టు వ్యయం ఇంచుమించు ఇదే రకమైన ఇతర ప్రైవేట్ ప్రాజెక్టుల వ్యయానికి పెద్దగా తేడా లేకపోవడమే. జేగురుపాడు-1 ప్రాజెక్టు మూలధన వ్యయం ఎంత అధికమంటే ఇది ఇంచుమించు ఎన్రాన్ దభోల్ ప్రాజెక్టు వ్యయంతో సమంగా వుంది. ఐపిపి విద్యుత్ ఎందుకు ఇంత అధికంగా వుంటుందో, ఐపిపి పాలసీలంటే ఏమిటో స్పెక్ట్రమ్ బాగోతం స్పష్టం చేస్తోంది.

ఈ ఒప్పందాల వల్ల ఇప్పటికే చాలా అనర్థం జరిగింది. ఐపిపిల రిస్కులన్నిటిని ఎపి ట్రాన్స్‌కో నిర్బంధంగా మోయాల్సి వస్తోంది. ప్రతిపాదించేటప్పుడు ప్రాజెక్టులన్నీ దృఢంగానే వుంటాయి. అమలులోకి వచ్చేటప్పుడే వాటి అసలు రూపం తేలుతుంది. ఈ ప్రాజెక్టులు దివాళా తీస్తే ఆనష్టాలను భరించాల్సింది ట్రాన్స్‌కో లేదా ఫైనాన్స్ సంస్థలే. అనివార్య కారణాల వల్ల ప్రాజెక్టు వ్యయం పెరిగినా, పెరగకపోయినా మునిగిపోయే అవకాశమున్న ఆరు ఐపిపి ప్రాజెక్టుల వివరాలను (ఈ దిగువ పట్టికలో) గమనించవచ్చు.

ప్రతిపాదిత ఆరు ఐపిపి ప్రాజెక్టుల వివరాలు

1. రామగుండం ఎక్స్‌టెన్షన్(బిపిఎల్ గ్రూపు)	520 మెగావాట్లు
2. కోనసీమ ఓక్ వెల్ పవర్ లిమిటెడ్	445 మె.వా.
3. వేమగిరి సిసిజిటి(ఇస్పాట్ లిమిటెడ్)	370 మె.వా.
4. ఎన్‌సిసి - గౌతమి కన్సార్టియం	464 మె.వా.
5. బిఎస్ఇఎస్ ఆంధ్ర పవర్ లిమిటెడ్	220 మె.వా.
6. జేగురుపాడు 2 (జివికె ఇండస్ట్రీస్)	220 మె.వా.
<u>మొత్తం</u>	<u>2,239 మె.వా.</u>

పైన పేర్కొన్న 2,239 మెగావాట్ల సామర్థ్యం గల ఐపిపిలలో 520 మెగావాట్ల రామగుండం ప్లాంట్ ఒక్కటే బొగ్గు ఆధారంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. మిగతా 1719 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి గ్యాస్ ఆధారంగా జరగాల్సిందే. ఈ ప్రాజెక్టులకు సరిపడా గ్యాస్ లేదు. ఇప్పటికే కొన్ని గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులు అమలులో వున్నాయి. అవి విజ్జేశ్వరం, జేగురుపాడు-1, లాంకో కొండపల్లి, స్పెక్ట్రమ్ గోదావరి ప్రాజెక్టులు. గ్యాస్ అందుబాటులో లేనట్టైతే అప్పుడు ఇవి ద్రవ ఇంధనంపై ఆధారపడాల్సి వస్తుంది.

ఇది మరో సమస్యను ముందుకుతెస్తుంది. గ్యాస్ సరిపడినంతగా అందుబాటులో లేనప్పుడు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం హైడ్రోకార్బన్ ఇంధన మార్గాన్ని ఎందుకు ఎంచుకోవడంలేదు? గ్యాస్ చాలినంతగా లేదని తెలిసి కూడా ఈ కొత్త గ్యాస్ ఆధారిత ప్రాజెక్టులకు ఆమోదం తెలపడంలో అర్థమేమిటి? ఇది ఐపిపి ప్రాజెక్టుల వాస్తవిక వ్యయాన్ని మరింత పెంచడం కాదా! ఈ వాస్తవాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం దాచిపెట్టి ఈ ప్రాజెక్టులన్నిటికి సరిపడా గ్యాస్ వుందని చెబుతోంది. నిజంగా గ్యాస్ ఏదైనా వుందనుకుంటే అది చంద్రబాబు నాయుడుగారి మాటల్లోనే వుండాలి. అంతే తప్ప ఈ గ్యాస్ మండించడానికి గానీ, విద్యుత్ ఉత్పత్తికి గానీ ఏమాత్రం పనికిరాదు.

ఐపిపి విధానమే ఓ పెద్ద కుంభకోణం

ఐపిపి విధానం, ప్రైవేట్ కంపెనీలతో కుదుర్చుకున్న ఒప్పందాలు(ఎంఓఏలు), ఇతర సదుపాయకల్పనా ఒప్పందాలు ఇవన్నీ మరో పెద్ద కుంభకోణమని స్పష్టమవుతోంది. ఆంధ్ర ప్రదేశ్‌లో ఇప్పటికే ఉనికిలోకి వచ్చిన ఐపిపి ప్రాజెక్టులు తమ విద్యుత్ రేట్లను విపరీతంగా పెంచాయి. ఇప్పుడు నూతన ప్రాజెక్టులకు ఇంధనంగా నాఫ్తా వాడనున్నారు. దీంతో ఆంధ్ర ప్రదేశ్ విద్యుత్ రంగం యావత్తూ ఖాయిలా పడే ప్రమాదముంది. ఈ ఒప్పందాలు కుదుర్చుకున్నవారికి, ఐపిపి ప్రమోటర్లకు ఇదేమీ పట్టదు. వారు ఎంతసేపూ తమ ప్రాజెక్టుల మంజూరు గురించి, రుణాలు సంపాదించడం గురించే ఆలోచిస్తుంటారు. ప్రాజెక్టులను విజయవంతంగా నెలకొల్పడం ఎలా అనేదానికన్నా రుణాలు ఎలా కొట్టేయాలి అనేదానిపైనే వారి దృష్టి అంతా వుంటుంది. ప్రమోటర్లు తమ డబ్బును రాష్ట్రంలో అధికారం వెలగబెడుతున్న వారి జేబులు తడిపేందుకు ఎక్కువగా వినియోగిస్తుంటారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రజలు ఈ ఏలికలను చెత్తబుట్టలోకి విసిరేసేవరకు ఈ లోపాయికారీ ఒప్పందాలు జరుగుతూనే వుంటాయి. భారత ప్రజలు పొదుపుచేసుకున్న డబ్బును ఫైనాన్స్ సంస్థలు ఐపిపిలకు కానుకలుగా సమర్పించినట్లే, ఆంధ్ర ప్రదేశ్ ప్రజల సొమ్మును కుదువబెట్టి రాష్ట్ర విద్యుత్ రంగాన్ని దివాళా తీయిస్తోంది చంద్రబాబు ప్రభుత్వం. ప్రభుత్వ అక్రమాలకు ప్రజలు భారీ మూల్యం చెల్లించాల్సిన దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడబోతోంది.

ఆశయబలంతోనే సమరశీలత



బి.వి.రాఘవులు

ఏ కమ్యూనిస్టు కార్యకర్త అయినా ప్రయోజనకరంగా, సమర్ధవంతంగా పనిచేయాలంటే అతనికి ఉండాల్సిన లక్షణాలలో ముఖ్యమైనది సమరశీలత. ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకున్నప్పుడు నాయకులకూ, కార్యకర్తలకూ ఉండాల్సిన లక్షణం సమరశీలత. మనం మొదట సమరశీలత అంటే ఏమిటో సరైన అర్ధం తెలుసుకోవాలి. ఎందుకంటే నక్సలైట్లు కూడా మిలిటెన్సీ అంటుంటారు. ప్రభుత్వం కూడా మిలిటెంట్లను పట్టుకున్నాం, మిలిటెంట్ చర్యలు దేశభద్రతకు ప్రమాదకరం అంటుంటుంది. కాశ్మీర్ మిలిటెన్సీ అంటూ పత్రికలు రాస్తున్నాయి. మిలిటెన్సీ అంటే కొట్టడం, నరకడం, చంపడం అని అనుకుంటే పొరపాటు. అరాచకత్వంతో వ్యవహరించటం, గందరగోళంగానూ, హింసాత్మకంగానూ వ్యవహరించటమే మిలిటెన్సీ అనుకుంటే అది పొరపాటు అవగాహన. ఒక ఉద్యమంలో కార్యకర్తలు, నాయకులు మిలిటెన్సీ ప్రదర్శిస్తే దెబ్బలు తగలవచ్చు. దాడులకు గురికావచ్చు. జైల్లోపడవచ్చు. ఇవన్నీ జరగవచ్చు. కానీ మనం గొడవలు సృష్టించటానికి, రక్తపాతం సృష్టించటానికి, అల్లర్లు, కొట్లాటలు సృష్టించటానికి చేసే కార్యక్రమమే మిలిటెన్సీ అని అనుకుంటే పొరపాటు. మరి మిలిటెన్సీ అంటే ఏమిటి?

మనం ఒక నినాదం, డిమాండ్ ముందుకుతెచ్చాక దాన్ని సాధించేందుకు ఏపోరాట రూపాన్ని తీసుకొంటామో ఆ పోరాట రూపాన్ని తుదికంటా అమలు చేయటం, అలా అమలు చేసేందుకు కృషిచేయటమే సమరశీలత. మిలిటెన్సీ అంటే రెండవ అంశం. మనం నిర్ణయించుకొన్న కర్తవ్యాన్ని సాధించేంతవరకూ పనిచేయాలనేపట్టుదల ఉండాలి. ఉదాహరణకు ఆరుగంటల పాటు నిరసన వ్యక్తం చేయాలని నిర్ణయించుకొన్నప్పుడు పోలీసులు అరెస్టుచేసినా కొట్టినా లాగినా మనం ఆరుగంటలవరకూ నిరసన వ్యక్తం చేయాలనే పట్టుదలతో కార్యక్రమం చేయటమే మిలిటెన్సీ. ఆ సమయంలో పోలీసులు రావచ్చు. రాకపోవచ్చు. వచ్చి కార్యక్రమం ఉపసంహరించుకోమని చెప్పవచ్చు. లేదంటే సమయం కుదించుకోమని అడగవచ్చు. లేదా అరెస్టుచేయవచ్చు. భయపెట్టేందుకు లాగవచ్చు. లాఠీఛార్జి చేయవచ్చు. మనం నిర్దేశించుకొన్న లక్ష్యాన్ని బట్టి కార్యక్రమం ఉండాలి. మిలిటెన్సీలో ఒక ముఖ్యమైన భాగం ఏమంటే హింసగానీ, దాడికానీ, కొట్లాటగానీ ఉద్యమకారులవైపు నుండి రాకూడదు. మనం సహనంతో పట్టుదలతో మన లక్ష్యానికి కట్టుబడి ఉన్నప్పటికీ మన ప్రత్యర్ధులనుండే అది రావచ్చు. మనమే అద్దాలు పగలగొట్టడం, రాళ్లేయటం వంటి చర్యలకు పాల్పడితే ప్రత్యర్ధులు (ప్రభుత్వం) మనలను, మనవెనుక ఉన్న వారిని తేలికగా బెదిరించగలుగుతారు. కానీ మన కార్యక్రమం ఉద్దేశ్యం అదికాదు. మనం జనాన్ని సమీకరించి శాంతియుతంగా కార్యక్రమం చేస్తే ప్రజలకు మన వాణి చేరుతుంది. ఈ లోపు పోలీసులు రావచ్చు. మనలను బెదిరించి బస్ తీసుకెళ్లవచ్చు. ఈ చర్యలను కూడా మనం ప్రశాంతంగానే అడ్డుకునే ప్రయత్నం చేయటం మన మిలిటెన్సీ. ఈ విధంగా కార్యక్రమం నిర్వహించినప్పుడు లక్ష్యంపై విశ్వాసం, కార్యక్రమంపై పట్టుదల మనకున్నాయని భావించవచ్చు.

వ్యక్తిగత హీరోయిజం కాదు

మిలిటెన్సీ అంటే వ్యక్తులు హీరోయిజం ప్రదర్శించటం అనే భావనకూడా ఉన్నది. నిజానికి అది తప్పు. పికెటింగ్‌లోనో, రాస్తారోకోలోనో పోలీసులు రెచ్చగొడితే మనం రాళ్లు వేస్తే తమ నిర్బంధాన్ని ఆసాకుతో సమర్ధించుకోజూస్తారు. ఒకసారి ఈ విధమైన వ్యవహారం నడిస్తే మనతోపాటు ఆందోళనకు వచ్చిన సాధారణ ప్రజలు, సానుభూతిపరులు వెనక్కు వెళ్లే అవకాశముంది. పత్రికలు, ప్రభుత్వం కూడా మనలను దోషులుగా ప్రజలముందు నిలిపేందుకు ప్రయత్నిస్తుంది. ఈ చర్యల ద్వారా అటువంటి ప్రయత్నాలకు సహకరించినవాళ్లమే అవుతాము. దీనిమూలంగా ప్రజలకు దూరం అయ్యేందుకు కూడా అవకాశాలున్నాయి. మనం మిలిటెన్సీని ప్రజలందరికీ అలవర్చినట్లైతే ప్రజలందరికీ ధైర్యం కల్గించేందుకు, ప్రజలందరిలోనూ పట్టుదల పెంచేందుకు ఉపయోగపడుతుంది. మనం చేసే ప్రధాన ఉద్యమాలు ముఖ్యంగా కూలి, భూమి, సామాజిక సమస్యలు, ప్రపంచబ్యాంకు తదితర అంశాలకు సంబంధించినవి ఉంటాయి. వీటి సాధనకై మన ఉద్యమం సుదీర్ఘకాలం నడవాలి. వివిధ రూపాల్లో ఉండాలి. ఈ కాలమంతటా, రూపాలన్నింటిలోనూ ప్రజలనుండి మనం వేరుపడిపోకుండా మన చర్యలు, మిలిటెన్సీ ఉండాలి. ఈ సమస్యలు తక్షణం ఒకపార్టీని అధికారం నుండి దించి మరోపార్టీని అధికారానికి తెచ్చే సమస్యలు కాదు. ఇటువంటి నిర్దిష్టసమస్యలపై మన రాజకీయ అవగాహనలతో నిమిత్తం లేకుండా పనిచేయాలి. ఈ విధంగా నిరంతరం మనం ప్రజల్లో పనిచేయాలి. అప్పుడు మాత్రమే ప్రజలు మనలను విశ్వసించి మనవెంటవచ్చేందుకు అవకాశముంది. ఈ సమస్యలపై జరిగే ఆందోళనల్లో మనం మిలిటెన్సీని ప్రదర్శిస్తే ప్రజలకు మరింత దగ్గర కాగలుగుతాము. ప్రజల మనుషులుగా గుర్తింపు పొందుతాము.

ప్రభుత్వ వ్యతిరేక శక్తులను ఒక చోటికి సమీకరించేందుకు, వారికి నాయకత్వం వహించేందుకు కూడా మనకు మిలిటెన్సీ లక్షణం ఉండటం అవసరం. ప్రజల సమస్యలు పరిష్కారం అయ్యేవరకూ ప్రజల తరపున ఏ త్యాగానికైనా సిద్ధమై, ధైర్యంగా నిలబడే పార్టీగా మనం ప్రజల ముందుకు రావాలి. అప్పుడు మాత్రమే ఈ ప్రభుత్వాన్ని వ్యతిరేకించే శక్తులు మనవైపుకు వస్తాయి. ఈ శక్తులందరికీ నాయకత్వం వహించగలిగే పార్టీగా, శక్తిగా మనం ఉండాలని కోరుకొంటున్నాము. ఎప్పుడైతే మనం ధైర్యంగా నిలబడి, ఏ కష్టాన్నైనా ఎదుర్కొనేందుకు సిద్ధమై, వాదనలను ఎదిరిస్తూ, ప్రజల తరపున ఏ త్యాగానికైనా సిద్ధమవుతారని, లాఠీలు, జైళ్లు ఎదుర్కొనేందుకు సిద్ధమవుతారని ప్రజలకు మనపై నమ్మకం కలగాలి. ప్రజలను నట్టేట ముంచరని, ప్రజలను ముందుకు నెట్టి వాళ్లు వెనక్కు తగ్గరని, చేయి అందించి తర్వాత జారవిడవరని వారికి మనపై విశ్వాసం కలిగేలా మన కార్యాచరణ ఉండాలి. ఆ విధంగా ప్రజల విశ్వాసాన్ని పొందుతూ వారికి దగ్గరవుతున్నప్పుడే ప్రభుత్వాన్ని వ్యతిరేకించే శక్తులన్నీ మన వెనుక చేరగలవు. మనం మిలిటెన్సీ ప్రదర్శిస్తేనే వారికి మనం నాయకత్వం వహించగలము.

ఆచరణలో నిరూపించాలి

మనం ఈ అవగాహనతో గత రెండు మూడేళ్లుగా కార్యక్రమాలు నిర్వహిస్తూ సమరశీలంగా జనాన్ని కదిలిస్తున్నాము కనుకనే మన పిలుపుల్లో ప్రజల భాగస్వామ్యం పెరుగుతోంది. మనం నిర్వహించే కార్యక్రమాలలో మిలిటెన్సీని ప్రదర్శించటంతో పాటు మనం ముందుకు తెచ్చే సమస్యలకు కూడా ప్రత్యామ్నాయం చూపగలగాలి. ప్రత్యామ్నాయాలన్నింటినీ అమలు జరిపే శక్తి మనకు లేకపోయినా వాటి అమలుకు మనం శక్తివంచన లేకుండా కృషి చేయాలి. అప్పుడే ప్రజలు మనకు, ఇతరులకు మధ్య తేడా చూడగలుగుతారు. అంబలికేంద్రాల నిర్వహణ ఇందుకు ఒక ఉదాహరణ. కరువు పీడిత ప్రాంతాలలో సహాయకచర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని పదేపదే డిమాండ్ చేశాము. ప్రభుత్వం స్పందించలేదు. ప్రకృతి పరమైన సమస్యలకు పరిష్కారం ఎలా దొరుకుతుందని సందేహంగా అడిగినవారూ లేకపోలేదు. ప్రకృతిపరమైన సమస్యలకు పరిష్కారం చూపటం ఒక్కరోజుతో అయ్యేదికాదు. కొన్నింటిని

పరిష్కరించలేము కూడా. కానీ ఉన్న అవకాశాల మేరకు మానవప్రయత్నం ద్వారా నష్టాన్ని తగ్గించుకునేందుకు కృషిచేయవచ్చు. దీనికిప్రభుత్వాల స్థాయిలో అవకాశాలు మెండుగా ఉంటాయి. మనలాంటి వారికి అవకాశాలు పరిమితం. గతంలో ఇటువంటి పరిస్థితులెదురయి నప్పుడు కమ్యూనిస్టు పార్టీ అంబలికేంద్రాలు నడిపింది. ఇప్పుడూ అదే చేశాము. అంబలికేంద్రాల ద్వారా ప్రజల ఆకలిచావులు నివారించవచ్చని, వలసలు పోకుండా చేయవచ్చని మనం ఒక ప్రత్యామ్నాయాన్ని ముందుకు తెచ్చాము. మనకంటే పెద్దపార్టీ, కోట్లు వెచ్చించగల పార్టీలు కాంగ్రెస్, తెలుగుదేశం ఉన్నా ఇటువంటి సహాయక చర్యలకు అవి ముందుకు రాలేదు. ప్రభుత్వం అసలే కదలలేదు. ఈ పరిస్థితుల్లోమనంచేసిన ఈ ప్రయత్నం చిన్నదే అయినా మంచి ఆదరణకు నోచుకున్నది. పార్టీ ప్రజలకు దగ్గరయ్యేందుకు ఏ అవకాశాన్నీ వదులుకోరాదు. ప్రజలు తీవ్రమైన ఇబ్బందులు, కష్టాలు ఎదుర్కొంటున్న సందర్భంలో మనం ఏ చిన్నసాయం చేసినా వారిని ప్రభావితం చేయగలుగు తాము. అందువల్లే అప్పట్లో ఒక వ్యాఖ్యాత ఈ విషయాన్ని పత్రికలో " కాంగ్రెస్ తిరుపతి ఎఐసిసి సభలకు కోట్లరూపాయలు ఖర్చుపెట్టింది. కానీ ఒక్కఅంబలి కేంద్రం కూడా నిర్వహించలేదు. ఈ పార్టీ రాష్ట్రాన్ని ఎలా పాలించగలదు" అంటూ రాశారు. కమ్యూనిస్టు పార్టీ పేదల పార్టీ కాబట్టి ఈ విధంగా ప్రజలను ఆదుకున్నదని ఆయన వ్యాఖ్యానించారు. మరో వ్యాసకర్త కమ్యూనిస్టుల విమర్శ నిర్మాణాత్మకంగా ఉంటుందని రాశారు. మనం ప్రతిపాదించే ఆచరణ సాధ్యమైన ప్రత్యామ్నాయాలు, మన మిలిటెన్సీలే మనకు ఈ విధమైన ప్రత్యేకతను తెచ్చిపెట్టాయి.

మన నాయకులు, ప్రజలు మిలిటెంట్‌గా ఉంటే దాని ప్రభావం ప్రజలపై ఎలా ఉంటుందో వివరించేందుకు ఒక్క ఉదాహరణ. శ్రీకాకుళంలో బంద్ సందర్భంగా మన నాయకులను పోలీసులు కొట్టారు. దౌర్జన్యం చేశామని కేసుపెట్టారు. ఈ విధంగా నిర్బంధం ద్వారా మనలను లొంగదీసుకునే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో మనతో పాటు పాల్గొన్న ప్రజలకు దెబ్బలు తగిలాయి. వాళ్లు తమ దెబ్బలు గురించి భాధపడకుండా మన నాయకులను పరామర్శించటానికి వచ్చారు. అంటే మనం ధైర్యంగా ఉన్నచోట ప్రజలు తమకు కష్టం వచ్చినా, నష్టం వచ్చినా దెబ్బలు తగిలినా మనపట్ల ఎంతో అభిమానం పెంచుకుంటారని ఈ ఘటన, ఇంకా ఇటువంటి అనేక ఘటనలు రుజువు చేస్తున్నాయి. సమరశీల ఉద్యమాల వలన ప్రజలు భయపడి మరోసారి మనవెంట రారు అని కొందరు వాదిస్తుంటారు. అది శుద్ధ తప్పు. అటువంటి వారికి పట్టుదలలో, చిత్తశుద్ధో, కార్యక్రమం పట్ల నిబద్ధత, ప్రజల పట్ల నిజాయితీ లోపించిన వాళ్లే ఇటువంటి వాదనలు ముందుకు తెస్తారు. ఒక్కోసారి తాము ఇలా చేయలేకపోవటం కూడా ఇటువంటి వాదనలు ముందుకు తెచ్చేందుకు, తద్వారా మొక్కుబడి కార్యక్రమాలకు దారితీస్తారు.

ఆశయబలమే మిలిటెన్సీకి పునాది

ఉద్యమం సందర్భంగా మనం ప్రదర్శించే మిలిటెన్సీ మొక్కుబడిగానో, తెచ్చిపెట్టుకున్నట్లుగానో ఉండకూడదు. మిలిటెన్సీ మన ఉద్యమ నిర్వహణా క్రమంలోసహజసిద్ధమైనపనివిధానంగామారిపోవాలి. నాయకులు, కార్యకర్తలకు ఇది జీవితంలో ఇమిడిపోవాలి. అంతర్భాగం, కావాలి. ఎటువంటి ఇబ్బందులు , నిర్బంధాన్నైనా ఎదుర్కొని ప్రజలకంటే మనమే ముందుంటాము, ప్రజల తరఫున, ప్రజలకోసం నిలబడతాము అనే భావన ప్రజలకు కలగాలంటే అది మిలిటెన్సీతో కూడిన ఆచరణ ద్వారానే సాధ్యం. దీనికి మరో ప్రత్యామ్నాయం లేదు.

సమరశీలత ఎవ్వరికీ పుట్టుకతో రాదు. ధైర్యం కూడా అంతే. ఇదేదో బ్రహ్మపదార్థం కాదు. పాములు పట్టేవాళ్లు పాములను చూస్తే బెదిరిపోరు. అలా బెదిరిపోతే వాళ్లు ఆ వృత్తికే పనికిరారు. అలా అని వాళ్లే పోలీసుల లారీ చూస్తే బెదరవచ్చు. విప్లవ కార్యకలాపాలకు తమ జీవితాన్ని అంకితం చేయాలనుకున్నవాళ్లు పోలీసులను చూస్తేనో, లారీలను చూస్తేనో ఒక రోజు జైల్లో పడితేనో బెదిరిపోతే వారికి లక్ష్యం పట్ల, కార్యక్రమం పట్ల నిబద్ధతలేదని అర్థం. ధైర్యం అందరికీ ఒకేలాగా ఉండదు. అది అనుభవాన్ని బట్టి, వారికుండే సైద్ధాంతిక పునాది, అవగాహనను బట్టి ఉంటుంది. ఒక ఆశయంతో ప్రభావితం అయి లక్ష్యం నెరవేర్చేందుకు కట్టుబడి ఉన్నామనే నిబద్ధత ఉంటే ధైర్యంగాఉంటాము. మనం మార్క్సిస్టు ఆశయంతో ప్రజలకోసం నిలబడుతున్నాము. కనుక మనకు ఆశయమే ధైర్యాన్నిస్తుంది. గతంలో అనుభవం లేకపోతే ఆచరణలో అవే తెలుస్తాయి. ఆశయానికి కట్టుబడిఉన్నవాళ్లతే రెట్టించిన ఉత్సాహంతో ముందుకు పోతారు. మనపై పెరిగే నిర్బంధం మన వర్గ శత్రువుపై కసిని పెంచాలి. లక్ష్యంపై అంకితభావాన్ని పెంచాలి. ఆశయంపై అంకింతభావం, లక్ష్యానికి కట్టుబడి ఉండని వారికి తొలి దెబ్బతోనే కాళ్లు వెనక్కు లాగుతాయి. మనం పార్టీ కోసం, ప్రజలకోసం, ఉన్నత ఆశయాలకోసం పని చేస్తున్నామని అనుకున్నప్పుడు ధైర్యంగా ఉండగలుగుతాము. ఈ విధంగా అధ్యయనం, ప్రజల పట్ల నిజాయితీ, ఆశయం పట్ల నిబద్ధత పెంచుకోవటం ద్వారా మిలిటెంట్‌గా మారగలుగుతాము. ధైర్యంగా ఉండగలుగుతాము. ధైర్యంగా ఉండాలంటే ఏమిచేయాలో తెలుసుకుంటాము.

ప్రజలు లేకుండా మనం మిలిటెంట్‌గా ఉన్నంతమాత్రాన ప్రయోజనం లేదు. అలాగే మనతోపాటు ఉన్నప్రజలకు మిలిటెన్సీ అలవర్చకుండా మనం ఒక్కళ్లమే మిలిటెంట్‌గా ఉన్నంతమాత్రాన కూడా ఫలితం ఉండదు. ' అధికారులను ప్రశ్నిస్తారు. పోలీసులను ఎదిరిస్తారు. నాయకులు మిలిటెంట్‌గా ఉంటే జనమే పోరాడతారు. ఇటువంటి మిలిటెన్సీని మనం ప్రదర్శించాలి ఈ వ్యవస్థను ప్రతిఘటించి పోరాడాలనుకునే శక్తులన్నీ మనం నిజాయితీగా పోరాడతామనే భావం కలిగిస్తేమనవెంట వచ్చి చేరుతారు. ప్రజలను మోసం చేయరు అనే నమ్మకాన్ని కల్గించటం కూడా ఈ పోరాటాలలో ముఖ్యం. చావైనా రేవైనా ప్రజలతోనే వీళ్లుంటారు అని వారికి నమ్మకం కలిగితే వీరంతా మన పక్షాన చేరేందుకు అవకాశాలు ఉంటాయి. కొన్నిఅంశాలు, సందర్భాలలో మనతో విభేదించే వారిని సైతం చిత్తశుద్ధితో కూడిన మిలిటెన్సీ ద్వారా మనవైపు తెచ్చుకోగలుగుతాము.

కార్మికవర్గ అంతర్జాతీయత

మార్క్సిజం-లెనినిజం మౌలిక సూత్రాల్లో ఒకటి. బూర్జువావర్గ పాలనను కూలదోయడం కోసం, జాతీయ విముక్తి, సామాజిక ప్రగతుల కోసం, సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని నిర్మించడం కోసం సాగే పోరాటంలో కార్మికవర్గం యొక్క సమస్త శ్రామిక ప్రజలయొక్క ప్రయోజనాల ఏకతనూ, వారు ఫలప్రదమైన అంతర్జాతీయ సంఘీభావం నెరపవలసిన ఆవశ్యకతనూ గుర్తించడం. కార్మికవర్గ అంతర్జాతీయత కార్మికోద్యమంలోని ఆయా జాతీయ దళాలూ, కమ్యూనిస్టు పార్టీలూ, సోషలిస్టు దేశాల మధ్య సంబంధాలను శాసిస్తున్నది. సమస్త దేశాల ప్రజల స్వేచ్ఛా సమానతల కోసమూ, వారి స్నేహ, సహకారాల కోసమూ, మానవవంశ వివక్షకూ, జాత్యహంకారానికీ, బూర్జువా జాతీయ వాదానికీ వ్యతిరేకంగానూ సాగే పోరాటంలో వాటి సంఘీభావమూ, సమైక్య కార్యాచరణా ఇందువల్ల అవసరం. "ఒకే ఒక, కేవలం ఒకే ఒక రకం లేదా నిజమైన అంతర్జాతీయత వుంది. అదేమిటంటే తన సొంత దేశంలో విప్లవోద్యమాన్ని, విప్లవ పోరాటాన్ని పెంపొందజేయడానికి త్రికరణశుద్ధితో పాటుపడటం, ఈ పోరాటాన్నీ, ఈ పంథాను మాత్రమే ఎట్టి మినహాయింపులు లేకుండా ప్రతి ఒక్క దేశంలోనూ ప్రచారం, సానుభూతి ప్రదర్శన, పాదార్థిక సహాయం ద్వారా బలపరచడం." (వి.ఐ.లెనిన్, సంపూర్ణ రచనలు సం.24, పుట 75)

కార్మికవర్గ చారిత్రక కర్తవ్యం

ప్రపంచ చరిత్రలో కార్మికవర్గ ప్రత్యేక పాత్ర. పెట్టుబడిదారీ విధానానికి వ్యతిరేకంగా అన్నిటికన్నా నిలకడతో పోరాడే శక్తి అయినందువల్ల కార్మికవర్గం సమస్త శ్రామిక ప్రజల విప్లవ పోరాటానికి నాయకత్వం వహిస్తుంది. వాటితో బాంధవ్యం నెరపి, సోషలిస్టు విప్లవాన్ని నిర్వహిస్తుంది. తన అధికారాన్ని స్థాపిస్తుంది. సోషలిజాన్ని, కమ్యూనిజాన్ని నిర్మించే దశలో అగ్రేసర సామాజిక శక్తిగా వుంటుంది.

సామ్రాజ్యవాదంపై అధ్యయనానికి మార్గదర్శి

ఈనాడు ప్రపంచ ప్రజల ప్రథమ శత్రువుగా సామ్రాజ్య వాదం వుందనేది ప్రగతిశీల శాంతికాముక శక్తులన్నీ అంగీకరిస్తున్న విషయం. ఆర్థికంగా రాజకీయంగా దేశాల స్వాతంత్ర్యాన్ని, సంపదలను హరించి ఆ ప్రజలను దివాళా తీయిస్తున్న సామ్రాజ్యవాద స్వభావం గురించి, ప్రభావం గురించి వుండాల్సినంత అవగాహన లేదు. విద్యాధికులు కూడా అంతర్జాతీయ దృష్టితో ఆలోచించడం తక్కువగానే వుంది. ఇందుకు ప్రధాన కారణం విషయాలు తెలియజేయడంలో, అభిప్రాయాలు తీర్చిదిద్దడంలో ప్రధాన పాత్ర వహించే మీడియా కూడా సామ్రాజ్యవాదుల చేతుల్లో వుండటమే. ప్రతి పరిణామాన్ని అమెరికా కూటమికి అనుకూలంగా ఇవ్వడం ఈ మీడియా ప్రధాన లక్షణం. లెక్కకు మిక్కుటంగా విస్తరించిన టీవీ ఛానళ్లలో దేన్ని చూసినా ఆ క్షణంలో అమెరికా ఎటువైపు వుందనే దాన్ని బట్టి ప్రచారం లభిస్తుంటుంది. పాలస్తీనా, బోస్నియా, ఇరాక్, ఆఫ్ఘనిస్తాన్ ఏ దేశం విషయమైనా బిన్‌లాడెన్, సద్దాం హుస్సేన్ వంటి వ్యక్తుల విషయంలోనూ అదే జరుగుతుంది. ఇక ఈ నాటి గ్లోబలైజేషన్ అనంతరం సామ్రాజ్యవాదుల ఆర్థిక రాజకీయ చొరబాటు మరింత పెరిగింది.

గ్లోబలైజేషన్‌కు వ్యతిరేకంగా ప్రజా పోరాటా లు పెరుగుతున్నా దాన్ని ప్రత్యక్షంగా సమర్థించే వారు, పరోక్షంగా దానికి దోహదపడే వాదనలు చేసే వారు కనిపిస్తుంటారు. ప్రపంచ పరిస్థితులు మారి పోయాయి గనుక పాత అభిప్రాయాలు పనికి రావని వారంటారు. అసలు సామ్రాజ్య వాదం ఉనికినే నిరాకరించేవారిని అటుంచి, రాజకీయంగా ఆ ప్రమాదాన్ని అర్థం చేసుకోగలిగిన వారిలో కూడా కొందరు ఇటీవల పరిస్థితులు మారాయనే పేరిట దానికి వ్యతిరేకంగా పోరాడవలసిన అవసరాన్ని విస్మరించడం లేదా అది అసాధ్యమని పెదవి విరవడం చూస్తున్నాం.

ఈ పొరబాటు అభిప్రాయాలకు మూలకారణం సామ్రాజ్య వాదం పుట్టుక విస్తరణ గురించి స్పష్టత లేకపోవడమే. లెనిన్ రాసిన సామ్రాజ్యవాదం-పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అనే గ్రంధం ఆ ప్రాథమిక అవగాహనకు ఎంతగానో తోడ్పడుతుంది.

వామపక్ష మేధావుల భాగస్వామ్యంతో సమీకాలీన సమస్యలపై ప్రామాణిక గ్రంధాలను ప్రచురించేందుకు, మార్క్సిస్టు క్లాసిక్స్‌గా పేరు పొందిన పుస్తకాలను పునర్ముద్రించుతూనే నూతన పరిణామాల నేపథ్యంలో వాటిని పునరంచనా వేసేందుకు ప్రారంభమైన లెఫ్ట్‌వర్డ్ సంస్థ లెనిన్ గ్రంధాన్ని సవ్యాఖ్యానంగా పునర్ముద్రించింది. "జయించేందుకో ప్రపంచం వుంది" లెఫ్ట్‌వర్డ్ తొలి ప్రచురణ. కమ్యూనిస్టు ప్రణాళికను సరికొత్త విశ్లేషణతో సహా పునర్ముద్రించిన గ్రంధం. సామ్రాజ్య వాదం పెట్టుబడి దారీ విధానపు అత్యున్నత దశ అనే లెనిన్ గ్రంధం కూడా ఆ తరహాలోనే పునర్ముద్రణ పొందింది. ప్రసిద్ధ ఆర్థిక వేత్త ప్రభాత్ పట్నాయక్ దీనికి ముందుమాట రాశారు. ఈ రెండు గ్రంధాలను ప్రజాశక్తి బుక్‌హౌస్ తెలుగులో కూడా ముద్రించింది.



వెల : రు : 40
పుస్తకాలు దొరుకు చోటు:
ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు

మార్క్స్ ఎంగెల్సులు పెట్టుబడిదారీ వ్యవస్థను సమూలంగా అధ్యయనం చేసి వర్గపోరాట సిద్ధాంతాన్ని రూపొందించారు. అయితే ఆ సిద్ధాంతం జడాత్మకమైనదిగా వుండకూడదని, పరిస్థితులను ఎప్పటికప్పుడు అధ్యయనం చేస్తూ గతి తార్కిక దృష్టితో కర్తవ్యాలు నిర్ణయించుకోవాలని మార్క్సిజంలో ప్రాథమిక సూత్రం. ఆ మహోపాధ్యాయులు నజీవులుగా వున్నంత కాలం అదే పని చేశారు. ఎప్పటికప్పుడు నూతన సమాచారంతో తమ అవగాహనను పదును పెట్టుకుంటూ పొరబాటు భావాలను నిశితంగా ఖండించుతూ శ్రామిక వర్గ సిద్ధాంతాన్ని తీర్చి దిద్దారు. అయితే ఎంత మహా మేధావులైనా ఒక పరిధికి మించి భవిష్యత్తును ఊహించడం సాధ్యమయ్యేది కాదు గనక పెట్టుబడిదారీ వ్యవస్థ పరిణామం, వర్గ పోరాట విజయం అనేక సందర్భాలలో వారు అనుకున్న దాని కంటే భిన్నంగా జరిగింది. అయితే మౌలికంగా వారు చెప్పిన పరిధిలోనే. ఈ పరిణామానికి ఆధ్వర్యం వహించిన ప్రతిభాశాలి లెనిన్. ఆయన మార్క్సిజాన్ని మారిన పరిస్థితులకు అన్వయించి నూతన గుణపాఠాలు తీశారు. సిద్ధాంతానికి వక్రభాష్యాలు చెప్పడాన్ని అడ్డుకున్నారు. ఆ విధంగా మార్క్సిజానికి లెనినిజం అనే పదం తోడైంది.

లెనిన్ సూత్రీకరణలలో అతి ప్రధానమైనది గుత్త పెట్టుబడిదారీ విధానం సామ్రాజ్య వాదంగా తయారయ్యే క్రమానికి సంబంధించినది. దేశాలను ఆక్రమించడం ద్వారానూ ఫైనాన్స్ పెట్టుబడిని ఎగుమతి చేయడం ద్వారానూ సామ్రాజ్య వాదం ప్రపంచాన్ని కొల్లగొడుతుందని అందుకోసమే యుద్ధాలు రగిలిస్తుందని లెనిన్ సోదాహరణంగా నిరూపించారు. ఇందుకోసం ఆయన అనేక మంది మేధావుల రచనల నుంచి అపారమైన సమాచారం సేకరించి తన సూత్రీకరణల కోసం ఉపయోగించారు. దేశాల స్వేచ్ఛ అనే భావనతో నిమిత్తం లేకుండా మొత్తం ప్రపంచం మీద ఆధిపత్యం చలాయించే ఆర్థిక గుత్తపెట్టుబడిదారీ శకమే సామ్రాజ్యవాదం అని ఆయన నిర్వచించారు.

విప్లవోద్యమ పురోగమనానికి సమరశీలతతో పాటు సైద్ధాంతిక స్పష్టత కూడా చాలా కీలకం. చరిత్రలో ఎదురయ్యే కొత్త సవాళ్లు కొత్త సమస్యలను తెచ్చి పెడుతుంటాయి. వాటి ఆధారంగా గందరగోళం సృష్టించడానికి బాహ్య శత్రువులే గాక అంతరంగిక శక్తులు కూడా ప్రయత్నం చేయడం కద్దు. వర్గపోరాట కఠోర సూత్రాలను తట్టుకోలేక కొందరు దాని సారాంశం గ్రహించలేక కొందరు ఏవో అరకొర సూత్రీకరణలు అవకాశవాద సిద్ధాంతాలు ముందుకు తెస్తుంటారు. సాపేక్షంగా పరిస్థితి ప్రశాంతంగా వున్నప్పుడు లేదా శ్రామిక వర్గం ఎదురు దెబ్బ తిన్నప్పుడు లక్ష్య సాధన జాప్యం అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నపుడు ఈ ముప్పు మరింత పెరుగుతుంది.

మొదటి ప్రపంచ యుద్ధానంతరం యూరప్‌లో అలాంటి స్థితే వచ్చింది. కమ్యూనిస్టు ఉద్యమంలో అగ్రనాయకులెందరో మితవాద బాట పట్టారు. దోపిడీ వర్గంతో పోరాడటం గాక ఏదో రూపంలో రాజీ పడటం అనే ప్రతిపాదనలు ముందుకు తెచ్చారు. అంతకు మించి దేశాల మధ్య యుద్ధాలను వ్యతిరేకించడం పోయి జాతీయ దురభిమానానికి గురైతమ దేశాలలోని పెట్టుబడిదారీ ప్రభుత్వాలకు వంత పాడే వైఖరి తీసుకున్నారు. శ్రామిక వర్గ విప్లవం అనే భావనకు కాలం చెల్లిందన్నట్టు మాట్లాడసాగారు. ఆ సమయంలో లెనిన్ సిద్ధాంత శూన్యతను గుర్తించి దాన్ని భర్తీ చేయడం కోసం ఈ రచన తల పెట్టారు. ఈ క్రమంలో ఆయన కొన్ని మౌలిక సూత్రీకరణలు చేశారు. గుత్త పెట్టుబడిదారీ దశలోనూ సంక్షోభాలకు అతీతంగా వుండటమనే ప్రసక్తి వుండదని పెట్టుబడిదారీ చలన

(మిగతా 25వ పేజీలో)

పెట్టుబడిదారీ కవలలు
అభివృద్ధి, పేదరికం

వి.శ్రీనివాసరావు

దక్షిణాసియాలో సంస్కరణల ప్రభావంపై పాకిస్తాన్‌కు చెందిన మహబూబ్ ఉల్ హక్ మానవాభివృద్ధి సంస్థ ఒక నివేదిక విడుదల చేసింది. మహబూబ్ ఉల్ హక్ ఇటీవల చనిపోయేవరకు ఐక్యరాజ్యసమితి అభివృద్ధి వార్షిక నివేదికల తయారీకి నాయకత్వం వహించేవారు. ఆ నివేదికలన్నీ ప్రామాణికంగా వుండేవంటే అందుకు కారణం హక్ కృషి అని చెప్పవచ్చు. అటువంటి వ్యక్తి పేరు పై ఏర్పడిన సంస్థ చేసిన అధ్యయనం మనకు తప్పకుండా తోడ్పడుతుంది. దక్షిణాసియాపై సంస్కరణల ప్రభావం పాకిస్థాన్‌పై తప్ప మిగతా అన్ని దేశాలపై సానుకూలంగా వుందని నివేదిక అంచనా వేసింది. ఒక్క పాకిస్థాన్‌పై మాత్రమే అది ప్రతికూలంగా వుంది. సంస్కరణలకు పూర్వం వున్న అభివృద్ధి రేటులో మూడింట రెండువంతులకు పడిపోయింది. కాని ఆశ్చర్యకరంగా ఈ అన్ని దేశాలలోనూ పేదరికం పెరిగింది. అందుకు ప్రధాన కారణం ఆదాయ వ్యత్యాసాలేనని నివేదిక ఎత్తి చూపింది. ఇది అత్యంత కీలకమైన అంశం. సంస్కరణల వల్ల అభివృద్ధి జరగలేదని ఎవరూ అనడం లేదు. కాని ఆ ఫలాలు ఎవరికి దక్కుతున్నాయనేదే ముఖ్యమైన ప్రశ్న. ప్రపంచీకరణ బాట తిరుగులేనిదని, అనివార్యమని అందరూ అంటున్నారు. దీన్ని వెనక్కి తిప్పడం సాధ్యం కాదని కూడా చెపుతున్నారు. కాని దీనితో పాటే అసమానతలు కూడా పెరుగుతున్నాయి. వాటి ఫలితంగా సంక్షోభాలు పుట్టుకొస్తున్నాయి. అమెరికాతో సహా అనేక దేశాలు నేడు ఆదిశలోనే వున్నాయి. పెట్టుబడిదారీ వ్యవస్థలో అభివృద్ధి, అసమానతలు రెండూ కవలలే. ఒకదాన్ని వదిలిపెట్టి రెండోది వుండలేదు. ఒక్కమాటలో చెప్పాలంటే పెట్టుబడిదారీ అభివృద్ధిలో నుండే అసమానతలు పుట్టుకొస్తున్నాయి. ఈ రెంటిని విడదీసి పరిశీలించడం తప్పు. సమాజంలో వర్గపోరాటాలకు మూలం ఈ పరిణామమే. మార్క్స్ చెప్పిందీ, ఈ నివేదిక చెప్పిందీ ఒక్కటే. మార్క్సిజానికి కాలం చెల్లిందనేవారు ఈ వాస్తవాలను చూసైనా కళ్లు తెరవాలి.

ఈ అభివృద్ధి ఎలా సాధ్యమైంది?

పెట్టుబడిదారీ వ్యవస్థ పతనమవుతుందని నమ్మేవాళ్లు దానిపై ద్వేషంతో కాక దాని అంతర్గత నియమాల వల్లే అది కుప్పకూలిపోతుందని శాస్త్రీయంగా విశ్లేషించారు. అయితే రెండో ప్రపంచ యుద్ధం తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థ రెండో సాధారణ సంక్షోభాన్ని దాటి మూడో దశలో ప్రవేశించిందని, ఇక అది పూర్తిగా నాశనమవడం తప్ప పురోగమించడం వుండదని జోస్యం చెప్పారు. ఆ వూహలకు భిన్నంగా పెట్టుబడిదారీ వ్యవస్థ చాలా కాలం మనగలిగింది. మనగలగడమే కాదు నూతన శాస్త్ర సాంకేతిక అభివృద్ధిని ఉపయోగించుకొని ఉత్పత్తి శక్తులను అభివృద్ధి చేయగలిగింది. పాత ఉత్పత్తి

సంబంధాలలోనే కొత్త ఉత్పత్తి శక్తులు అభివృద్ధి కాగలగడం విశేషమే. కాని దీన్ని బట్టే మార్క్సిజం విఫలమైందని ఎవరైనా భావిస్తే అంతకన్నా తప్పిదం ఇంకొకటుండదు. నిజానికి ఈ అభివృద్ధి మార్క్సిస్టు మూలసూత్రాలను మరింత గట్టిగా బలపరుస్తుంది. అసలు చిక్కంతా దాన్ని అర్థం చేసుకోవడంలోనే వుంది. మార్క్స్, ఎంగెల్స్‌లు కమ్యూనిస్టు ప్రణాళికలో పెట్టుబడిదారులు ఎల్లవేళలా శాస్త్ర, సాంకేతిక ప్రగతిని ఉపయోగించుకొని పురోగమిస్తుంటారని నొక్కి చెప్పారు. "ఉత్పత్తి సాధనాలను నిరంతరం విప్లవాత్మకంగా మార్చుకోకుండా, తద్వారా ఉత్పత్తి సంబంధాలు దానితో మొత్తంగా సామాజిక సంబంధాలను మార్పు చేయకుండా బూర్జువావర్గం మనజాలదు." వారికా శక్తి ఇంకా వుందని పరిణామాలు రుజువుచేస్తున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత వారికా శక్తి సన్నగిల్లిందని భావించడమే పొరపాటు తప్ప సిద్ధాంతంలో పొరపాటు లేదు. మారిన పరిస్థితులను అంచనా వేయడంలో జరిగిన తప్పిదం ఇది. సిపియం 14వ మహాసభలో ఆమోదించబడిన కొన్ని సిద్ధాంత సమస్యలపై తీర్మానంలో ఇలా పేర్కొంది. "శాస్త్ర, సాంకేతిక విప్లవం ద్వారానే గాక ప్రధానంగా వర్ధమాన దేశాలను దోపిడీ చేయడం ద్వారానే పెట్టుబడిదారీ విధానం పెరుగుదల ఆధారపడి వుందన్న విషయాన్ని గుర్తించవలసి వుంటుంది..... అదే సమయంలో పెట్టుబడిదారీ విధానం మారిన పరిస్థితులకు అనుగుణంగా సర్దుబాట్లకు సిద్ధమైంది. ....అయితే ఈ పరిణామదశలో త్వరలోనే పెట్టుబడిదారీ వ్యవస్థ కూలిపోయి ప్రపంచవ్యాపితంగా సోషలిజం విజయం పొందుతుందని తేలికైన అవగాహన సరిదిద్దుకోవాల్సిన అవసరం వుంది.". నూతనంగా అభివృద్ధి అయిన ఉత్పత్తి శక్తుల పర్యవసానమే ప్రపంచీకరణ భావం. ఇది అనివార్యంగా జరిగే పరిణామమే. దీనితో పాటే వివిధ దేశాల మధ్య, ప్రజల మధ్య, ప్రాంతాల మధ్య కూడా అసమానతలు పెరగడం అంతే అనివార్యం. ఈ అసమానతలే అభివృద్ధికి ఆటంకంగా మారతాయి. ఆ అసమానతల నుండే వర్గపోరాటాలు పుట్టుకొస్తాయన్న మార్క్స్ సూత్రం కూడా అంతే సత్యం. రెండు సంవత్సరాల క్రితం సియాటెల్‌లో ప్రారంభమైన ప్రతిఘటన నేటికీ తీవ్రరూపంలో కొనసాగడానికి ఇదే కారణం. ప్రపంచ కార్మికులారా! ఏకం కండి! అన్న మార్క్స్, ఎంగెల్సుల పిలుపు నేటికీ సజీవంగా వుంది. సజీవంగా వుండటమే కాదు మరింత సమయోచితంగా వుంది. ఆ నినాదం కొనసాగింపే "ప్రపంచీకరణకు వ్యతిరేకంగా ప్రపంచవ్యాపిత పోరాటాలు" అన్న పిలుపు. మార్క్స్ కన్న కలలు చెదిరిపోలేదు. వాస్తవానికి దగ్గరగా వున్నాయి. ప్రపంచ కార్మిక వర్గం మునుపటి కన్నా భౌతికంగా ఇంకా దగ్గరయింది. సామాజిక పరిణామం సాగాల్సిన దిశగానే సాగుతున్నది.

భారత దేశంలో అభివృద్ధి క్రమం

ఇతర దక్షిణాసియా దేశాలతో పోల్చుకుంటే

దక్షిణాసియా నివేదికలో ప్రపంచీకరణ ఫలితంగా లాభనష్టాలు పొందిన విధానం ఒక టేబుల్ రూపంలో ఇచ్చారు. దాన్ని చూడండి.

లాభం	నష్టం
ఉత్పత్తి	ఉపాధి
ఆస్తిపరులు	నిరాస్తిపరులు
లాభాలు	జీతాలు
అత్యంత నిష్ణాతులు	నైపుణ్యంలేని కార్మికులు
విద్యావంతులు	నిరక్షరాస్యులు
వృత్తి,యాజమాన్య,సాంకేతిక నైపుణ్యం వున్నవారు	కార్మికులు
పెట్టుబడి	శ్రమ
రుణదాతలు	బాకీదార్లు
ప్రభుత్వ సేవలు అవసరం లేనివారు	ప్రభుత్వసేవలు అవసరమైనవారు
పెద్ద సంస్థలు	చిన్న సంస్థలు
బలవంతులు	బలహీనులు
రిస్కుతీసుకునేవారు	మానవ భద్రత
అంతర్జాతీయ మార్కెట్లు	స్థానిక మార్కెట్లు
అత్యంత ఆధునిక సరుకులు అమ్మేవారు	ప్రాథమిక, స్థిరమైన ఉత్పత్తులు అమ్మేవారు
ప్రపంచీకరణ సంస్కృతి	స్థానిక సంస్కృతులు
ప్రపంచంలోకెల్లా ఆరితేరినవారు	ప్రపంచ పేదలు
మార్కెట్ అందుబాటులో వున్నకంపెనీలు,, బ్రాండింగు	మార్కెట్ లేని కంపెనీలు, బ్రాండింగు లేనివారు

భారతదేశం కొంతవరకు స్థిరంగానే అభివృద్ధి సాధించిందని చెప్పుకోవచ్చు. మొదటి పాతిక సంవత్సరాలు పెద్ద ఒడిదుడుకులు లేకుండానే సాగింది. మొదటిసారి 1966-67లో ఆర్థిక సంక్షోభాన్ని చవిచూశాం. ప్రభుత్వరంగం పాత్ర, సోవియట్ తదితర సోషలిస్టు దేశాల సహకారం, పరిమితంగానైనా వ్యవసాయ సంస్కరణలు అభివృద్ధికి దోహదపడ్డాయి. అదేసమయంలో పేదరికం, అవిద్య, అనారోగ్యం వంటి సమస్యలు కూడా పెరిగాయి. మొదటే చెప్పుకున్నట్లు ఈరెంటికీ వున్న బంధమే అది. దాని ఫలితమే 1991 ఆర్థిక సంక్షోభం. దాన్నుండి బయటపడటానికే ఐయంఎఫ్ ను ఆశ్రయించారు. వారి ఆదేశాల మేరకే నూతన ఆర్థిక విధానాలు చేపట్టారు.

ఈ దశాబ్దంలో దేశం ప్రగతిపథంలో నడిచిందని అయినా సంస్కరణలు ఇంకా నత్తనడక నడుస్తున్నాయని, వేగాన్ని పెంచడానికి రెండోదశ సంస్కరణలు అవసరమని ప్రపంచబ్యాంకు ఒత్తిడిపెడుతోంది. ఈదశలో వ్యవసాయరంగాన్ని సరళీకరించాలని ప్రధానంగా నొక్కిచెపుతున్నారు. దక్షిణాసియా అభివృద్ధినివేదిక పరిశీలిస్తే పాలకులు చెప్పేవన్నీ కోతలని తేలుతుంది. 1980 దశకంలో వ్యవసాయాభివృద్ధి పెరుగుదల రేటు సంవత్సరానికి సగటున 2.5 శాతం వుండగా అది 1990 దశకంలో 1.2 శాతానికి పడిపోయింది. అంటే జనాభా పెరుగుదల (1.9)రేటుకన్నా బహుతక్కువన్నమాట. అందుకు కారణాలు మనం పరిశీలించాలి. దానికి నివేదికలో పేర్కొన్న అంకెలే మనకు సాక్ష్యం. వ్యవసాయాభివృద్ధికి తోడ్పడే సబ్సిడీలు, ప్రభుత్వ పెట్టుబడి బాగా తగ్గిపోయాయి. 1990-91 నాటికి మనదేశ స్థూల జాతీయోత్పత్తిలో (జిడిపి) సబ్సిడీలు 2.3 శాతం వుండగా అది 96-97కి 1.3 శాతానికి తగ్గింది. పెట్టుబడి 5.9 శాతం నుండి 3.7 శాతానికి పడిపోయింది. ప్రభుత్వపెట్టుబడి తగ్గినందున వ్యవసాయంలో ప్రైవేటు పెట్టుబడి కూడా తగ్గింది. ప్రపంచబ్యాంకు నివేదిక (ఆసియా డెవలప్‌మెంట్ అవుట్‌లుక్2001) ఇలా పేర్కొంది. "వ్యవసాయంలో ప్రత్యేకించి ఇరిగేషన్‌కు ప్రభుత్వ పెట్టుబడి తగ్గిపోవడం వల్ల ఉత్పత్తి, ఉత్పాదకత కూడా తగ్గిపోయింది. వ్యవసాయంలో పెట్టుబడి సమీకరణ 1970లు80లలో 21 శాతం వుండగా అది 90లకు 9.2 శాతానికి తగ్గిపోయింది. భారతదేశం లాంటి అభివృద్ధిచెందుతున్న పెట్టుబడిదారీ దేశాల్లో ప్రభుత్వపెట్టుబడి పెరక్కుండా ప్రైవేటుపెట్టుబడి పెరగదు. ప్రపంచబ్యాంకు నివేదిక కూడా దాన్నిధృవీకరించింది. కొంతమేరకైనా ప్రైవేటు పెట్టుబడులు ప్రవేశించాయంటే అది సాంప్రదాయేతర వాణిజ్యపంటల్లో తప్ప ఆహార పంటలకు పెట్టుబడులే పెరగలేదు. ఇదే కాలంలో ఖజానాకు పన్నుల ద్వారా వచ్చే ఆదాయం కూడా తగ్గింది. ధనవంతులపై పన్నులభారం తగ్గిస్తే నిజాయితీగా చెల్లిస్తారని, అందువల్ల ఆదాయం పెరుగుతుందని చెప్పిన ఆర్థికవేత్తలు ఏకంగా నోబెల్ బహుమతినే గెలుచుకున్నారు. కాని ఆసూత్రం ఆచరణలో ఎందుకూ కొరకాకుండా పోయింది. మన అనుభవమే పరిశీలిస్తే సంస్కరణలకు ముందు జిడిపిలో 11శాతంగా వున్న పన్ను ఆదాయం ఇప్పటికి 9శాతానికి దిగింది. విదేశీ సరుకులపై వచ్చే కస్టమ్స్ డ్యూటీని బాగా తగ్గించారు. అమెరికా ఒత్తిడితో 7117 సరుకుల దిగుమతులపై ఆంక్షలు ఎత్తివేయడంతో స్వేచ్ఛగా వాటిని దిగుమతి చేసుకుంటున్నారు. అటు ప్రభుత్వానికి ఇటు రైతాంగానికీ ఆదాయం పడిపోయింది. ఇది వ్యవసాయ సంక్షోభానికి దారితీసింది. ఆత్మహత్యలు దాని పుణ్యమే.

ఇదే కాలంలో పారిశ్రామిక రంగంలోకూడా ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులు కూడా పడిపోయాయి. విద్యుత్ రంగంలో రాష్ట్రప్రభుత్వాలు కొత్తగా పెట్టుబడులు పెట్టలేకపోయినందున అనుకున్న లక్ష్యంలో సగంకూడా చేరుకోలేదని ప్రపంచబ్యాంకు నివేదిక విమర్శించింది. ప్రభుత్వ పెట్టుబడుల ఆవశ్యకతను వీరు కూడా అంగీకరించినట్లే. అసమానతలు పెంచిన ప్రభుత్వవిధానాలు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న పన్ను, ద్రవ్య విధానాలు కూడా అసమానతలను మరింత పెంచుతున్నాయి. ధనవంతులకు రాయితీలు, పేదవారికి భారాలు పంచడం ద్వారా అసమానతలు మరింత పెరుగుతున్నాయి. గత కేంద్రబడ్జెట్‌లో గుత్తపారిశ్రామిక కుటుంబాలకు 15వేల కోట్ల పన్నురాయితీలనిచ్చారు. ఇదికాక పారుబకాయిల పేరుతో లక్షకోట్ల రూపాయల బ్యాంకు రుణాలను మాఫీ చేశారు. మరో 65వేలకోట్ల రూపాయల పన్నుబకాయిలు వసూలు చేయకుండా వదిలేశారు. ఇదే కాలంలో సామాన్యులపై 20 వేలకోట్ల రూపాయల అదనపు భారం మోపారు. ఆదాయాలు తగ్గిపోతుండగా అధికధరల భారం పెరుగుతున్నది. గత సంవత్సరం 3.3 శాతంగా వున్న ద్రవ్యోల్బణం 7శాతానికి పెరిగింది. ఫలితంగా ఆహారధాన్యాలు కూడా కొనుగోలు చేయలేనిస్థితి వచ్చింది. ఎఫ్‌సిఐ గోడౌన్లలో 6కోట్ల టన్నుల ఆహారధాన్యాలు ముక్కిపోతున్నాయి. మన రాష్ట్రంలో కిలో 3.50పై. లకిచ్చే రేషన్ బియ్యాన్ని సైతం కొనలేకపోతున్నారు. ప్రతినెలా బియ్యం 50వేల టన్నులు తగ్గుతున్నది. ఆ పేరుతో క్రమంగా చౌకదుకాణాలను మామూలు కిరాణాషాపుల కింద మార్చేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. అందులో భాగంగానే 'సర్వప్రియ' పేరుతో కొత్తస్కీము ప్రవేశపెట్టింది. ఇలా ప్రజాపంపిణీ వ్యవస్థను దెబ్బకొట్టడం ద్వారా పేదవారికి ఆహారభద్రత లేకుండా చేసింది. గత కొంత కాలంగా ఒరిస్సా, ఆంధ్రప్రదేశ్‌లలో ఆకలిచావులు సంభవించడం ఈవిధానాల పర్యవసానమే.

ఈ విధానాలు మన స్వీయ అవసరాలనుండి రూపొందించుకున్నవి కావు. బయటవారి ఒత్తిడితో చేపట్టినవి. గత పదేళ్లలో ప్రజలనుండి తీవ్రమైన ప్రతిఘటన వచ్చింది. ప్రపంచబ్యాంకు కూడా దాన్ని గుర్తించక తప్పలేదు. నూతన ఆర్థిక విధానాలను వ్యతిరేకించడమంటే సామ్రాజ్యవాదాన్ని ప్రతిఘటించడమే. రానున్న కాలంలో ప్రజలు సామ్రాజ్యవాదాన్ని, దాని కొమ్ముకాస్తున్న భారత పాలకవర్గాలను ఎదుర్కోవలసి వుంటుంది.

పరివార్ కబంధహస్తాల్లో మతసామరస్యం

తీస్తా సెతాల్‌వాడ్

అది గుజరాత్‌ను తమ సహోదరులైన పాలక భారతీయ జనతాపార్టీ (బిజెపి) సాయంతో మార్చజూస్తున్న విశ్వహిందూ పరిషత్ (వి.హెచ్.పి) బజరంగ దళ్ కావచ్చు లేదా మహారాష్ట్ర గ్రామీణ ప్రాంతాలను ఇదే విధంగా మార్చ చూస్తున్న పాలక కాంగ్రెస్, ఎన్‌సిపిల కూటమి మద్దతు గల శివసేన కావచ్చు.

గత రెండు నెలల కాలంలో, ముస్లింలు, వారి గృహాలు, వ్యాపారాలు, ప్రార్థనా మందిరాలు మొదలైన వాటన్నింటి పైన వరుస దాడులు జరుగుతున్నాయి. ఈ దాడుల పరంపర మహారాష్ట్ర, గుజరాత్, మధ్యప్రదేశ్, ఒరిస్సాలలో కొనసాగుతోంది. అలాగే క్రైస్తవ సన్యాసినులు, మత గురువులపై కూడా దాడులు కొనసాగుతున్నాయి. ఈ దాడుల నుండి వారికి శాంతి భద్రతల యంత్రాంగం నామ మాత్రపు రక్షణనే కల్పిస్తోంది.

2002వ సంవత్సరం మార్చి 12వ తేదీన (మహాశివరాత్రి దినాన) విశ్వహిందూ పరిషత్ రామమందిర నిర్మాణాన్ని ఆరంభించతలపెట్టింది. ఈ అంశం చుట్టూ స్థానిక ప్రజలను ఒక ప్రణాళిక ప్రకారం మత ప్రాతిపదికన సమీకరించేందుకు గాను విశ్వహిందూ పరిషత్‌కు చెందిన మహారాష్ట్ర శాఖ మారుమూల గ్రామాలు, జిల్లాల్లో తన సాహిత్యాన్ని పంచుతోంది. అంతే కాకుండా, ఈ సందర్భానికై కార్యకర్తలను సమీకరించేందుకు గాను సన్నాహకంగా వరస క్రమంలో జలాభిషేకాలు, ఇతర పాక్షిక - మత వేడుకలను కూడా నిర్వహించతలపెట్టింది. మరో పక్క అమెరికాపై టెర్రరిస్టు దాడులు జరిగిన నేపథ్యంలో ముస్లిం మైనారిటీ వర్గాల వారు (ముస్లింలంతా జిహాదిలు కారు అయితే జిహాదీలంతా ముస్లింలే" యం జి వైద్య, ఆర్ ఎస్ ఎస్ ప్రతినిధి) నిర్వహించిన అపరిపక్వ మనస్తత్వ ప్రదర్శన, అలాగే సిమిపై నిషేధం కూడా.

అక్టోబర్ 9వ తేదీ రాత్రి సంఘ్లీ జిల్లా (పశ్చిమ మహారాష్ట్ర ప్రాంతంలోని), షిరేల్ తాలుకాలోని మంగ్లే గ్రామంలో ఒక మూక ముస్లింలకు చెందిన 10 ఇళ్లను, 2 కలప అడితీలను, ఒక రంపపు మిల్లును తగుల బెట్టింది. ఈ క్రమంలో జైనుద్దీన్ మొహమ్మద్ సత్తార్ అనే 80 సంవత్సరాల ముదుసలి సజీవ దహనమయ్యాడు.

దీనిని రెచ్చగొట్టింది ఏమిటి ?

అంతకు మునుపు ఒక నెల క్రితం, తమ సాటి గ్రామీణులే తమను వేధిస్తున్నారనీ, అవమానిస్తున్నారని, బెదిరిస్తున్నారని, పేర్కొంటూ ముస్లిం మైనార్టీ వర్గానికి చెందినవారు, మహారాష్ట్ర మైనార్టీల సంఘానికి ఫిర్యాదు చేసేందుకు సాహసించారు.

నేపథ్యం ఏమిటి?

గణేష్ విగ్రహాన్ని అపవిత్రం చేసారనే ఆరోపణపై ఆగస్టు 8వ తేదీన మంగ్లే గ్రామానికి చెందిన నలుగురు మల్లయుద్ధ యోధులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వీరిలో, యూనస్ మూసా షెయికే, సంతాజీ ఖంబేకార్, గోపీఖంబార్, సంజయ్ పారిల్, మరో ఇద్దరు వున్నారు. తరువాత పోలీసుల జోక్యంతో దాదా పారిల్, ప్రహ్లాద్, అంకుష్, సతీష్‌నీల్‌కాంత్, విలాస్ అమ్మస్కే మొదలైన వారితో ఒక శాంతి సంఘం ఏర్పడింది.

వింత గొల్పే విధంగా తమ గ్రామంలోని ముస్లింల మతాచారాలను తీవ్రంగా అదుపు చేస్తూ ఈ శాంతి సంఘమే సెప్టెంబర్ 7వ తేదీన ఒక ఫత్వాను జారీ చేసింది. వెయ్యి ఇళ్ళకు పైగా వున్న గ్రామంలోని 35 ముస్లిం కుటుంబాలకు చెందిన పెద్దలందరూ తమ గడ్డాలను తీసివెయ్యాలని, ముస్లిం రూపాన్ని తెలియజెప్పే దుస్తులను ధరించరాదని, నమాజ్ సమయంలో తలపై ధరించే టోపి ధరించకూడదని, రోజుకు ఐదు సార్లు కాక ఒక్క సారి నమాజు తోనే సరిపెట్టుకోవాలని, మైకులలో అజాన్ వినపడరాదని, చివరగా యూనస్ షెయిక్ (పోలీసులు అదుపులోకి తీసుకున్న కుటుంబం మొత్తాన్ని ఆయన ముగ్గురు సమీప బంధువులతో సహా గ్రామం నుంచి బహిష్కరించే 'హుకుంనామా') నూ గ్రామంలోని ముస్లింలందరూ రాత పూర్వకంగా ఆమోదించాలనేవి ఈ ఫత్వాలోని అంశాలు.

తరువాత రోజు ఉదయం అంటే సెప్టెంబర్ 8వ తేదీన మహదేవ్ దేవాలయ ప్రాంగణంలో గ్రామసభ జరిగింది. ఈ సభలో 1500 మంది గ్రామస్తులు పాల్గొన్నారు. ఈ సభలో గ్రామంలోని ముస్లింలను అసభ్యకరంగా తిట్టడం, వారి మతాన్ని అవమానించడం జరిగింది. అంతకు మునుపటి రోజు ఫత్వాతో తీవ్ర భయాందోళనకు లోనైన ముస్లింలు గ్రామసభకు హాజరు అయ్యే ముందు తమ గడ్డాలను తొలగించుకున్నారు.

బాధితులు రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డిజిపి) సుభాష్ మల్‌హోత్రాను, అలాగే మహారాష్ట్ర రాష్ట్ర మైనారిటీల సంఘాన్ని కలిసేంతవరకూ ఉద్రిక్తతలు అట్టుడికాయి. అయితే, ఈ మధ్య మరో దఫా జరిగిన దహనాలు, హత్యలతో గ్రామంలోని పరిస్థితి అల్లకల్లోలంగా మారింది.

గ్రామంలో ఉద్రిక్తతలను అధిగమించేందుకు గాను, బాధిత ముస్లింలు 'తాము గడ్డాలను స్వచ్ఛందంగా తొలగించున్నామని' సంతకాలతో కూడిన ప్రకటన చేసేలా స్థానిక పరిపాలనా యంత్రాంగం, పోలీసులు ఒప్పించారు. రాష్ట్ర మైనారిటీల సంఘానికి చెందిన బృందం గ్రామాన్ని సందర్శించింది. అనంతరం ఈ బృందంలోని సభ్యుడైన మూనఫ్ హకీం, 'కమ్యూనలిజం కంబాట్' పత్రిక వారికి ఇలా చెప్పారు. "ఇతర రాష్ట్రాలలో లాగానే ముఖ్యంగా గుజరాత్‌లో ముస్లింలు తక్కువ సభ్యులు ఉన్న ప్రాంతాలలో వారిని భయకంపితులను చేసేందుకు క్రమబద్ధమైన ప్రణాళిక అమలు జరుగుతోంది. ముస్లింల ఇళ్ళపై, వ్యాపార సంస్థలపై దాడులు జరుగుతున్నాయి. అంతిమంగా, వారి జీవన భృతి కైంకర్యం చేసే పరిస్థితి వుంది. ఇది మొగ్గలోనే తుంచి వేయవలసిన ప్రమాదకర ధోరణి".

దహనకాండ, హత్య జరిగిన తరువాత, అక్టోబరు 9వ తేదీన రాష్ట్ర పోలీసు యంత్రాంగం గ్రామంలో కర్ఫ్యూ విధించింది. దహనకాండకు బాధ్యులైన 56 మందిని అదుపులోకి తీసుకొని అక్టోబరు 18వ తేదీ వరకు నిర్బంధించింది. "గణేష్ ఉత్సవాల సందర్భంగా విగ్రహాన్ని అపవిత్రం చేసినందుకు గ్రామంలోని ఒక వర్గంలో కోపోద్రిక్తత వున్నది," అని జిల్లా సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రితీష్‌కుమార్ 'కమ్యూనలిజం కంబాట్', పత్రిక వారితో చెప్పారు.

"అయితే పరిస్థితి ఇప్పుడు అదుపులోనే ఉన్నది. ఇది హిందూ తీవ్రవాద శక్తుల పనికాదు. దీనిలో భిన్నపక్షాల సభ్యుల ప్రమేయం ఉన్నది," అని ఆయనే వివరించారు. ఈ వార్తను 'కమ్యూనలిజం కంబాట్' పత్రిక ప్రచురిస్తున్న సమయంలోనే నేర ప్రవర్తన, దహనకాండ, హత్యకు కారకులైన వారిని విడుదల చేయవల్సిందిగా స్థానిక పోలీసులపై తీవ్రంగా ఒత్తిడి వస్తోందని సమాచారం అందుతోంది.

ఇదిలా వుండగా ఈ మొత్తం ఘటనకు సంబంధించి మతం రంగు పులిమి వక్రభాష్యం చెబుతూ శివసేనకు చెందిన 'సామ్‌నా' పత్రిక ప్రచారం ఆరంభించింది. ఈ పత్రిక కథనం ప్రకారం ఒక హిందూ బాలికను ముస్లిం యువకుడు వేధించటం, ఆ యువకుని బంధువుల గృహాలు, వ్యాపార సం స్థలపై గ్రామస్థుల దాడికి దారితీసింది. ఈ రకమైన కథనాన్ని అటు బాధితులు లేదా ఇటు ఘటనను విచారించిన పోలీసులు కూడా పేర్కొనలేదు.

మరో ఘటనలో, పూనాకు కేవలం 40 కిలో మీటర్ల దూరంలో వున్న సశ్వాతీవ్ గ్రామంలో హింసాకాండ చెలరేగింది. ఈ హింసాకాండ 90వ దశకపు నాటి <u>రామ్ శిలా పూజా</u> కార్యక్రమాలను, 1990-1992 సంవత్సరాలలో లాల్ కృష్ణ అద్వానీ నాయకత్వంలో జరిగిన <u>రథయాత్ర</u> ను తలపింపజేసింది. అక్టోబరు 7వ తేదీన గ్రామంలో జరిగిన <u>జలాభిషేక</u> కార్యక్రమం తరువాత ఈ హింసాకాండ జరిగింది. ఈ <u>జలాభిషేక</u> కార్యక్రమాన్ని విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్‌లు నిర్వహించాయి. మత సంబంధిత కార్యక్రమం పేరిట ఒక చోట చేరిన గుంపు ఎటువంటి రెచ్చగొట్టడం లేకుండానే, ఒక దర్గా పైన, ఒక శ్మశాన వాటికలోని షెడ్‌లపైన దాడి చేసింది. తరువాత పథకం ప్రకారం జరిగిన విధ్వంసంలో భాగంగా, ముస్లింల యాజమాన్యంలోని బేకరీలు; దుకాణాలు, వారి గృహాలపై దాడి చేసి ధ్వంసం చేసారు. ఈ ఘటనకు ముందు, పశ్వాన్ గ్రామ చరిత్రలో మత ఉద్రిక్తతలు లేవు.

విధ్వంసకర గుంపు ముస్లింలను కించపరిచే విధంగా నినాదాలు ఇచ్చిందనే ఆరోపణ వచ్చింది. దీనికి సంబంధించి పోలీసులు 30 మందిని అరెస్టు చేశారు. "ఈ దాడికి రెచ్చగొట్టింది బజరంగ్ దళ్, విశ్వహిందూ పరిషత్ వంటి తీవ్రవాద శక్తులేననేది సుస్పష్టం", అని రాష్ట్ర డి.జి.పి., మల్‌హోత్రా 'కమ్యూనలిజం కంబాట్' పత్రికకు చెప్పారు.

కాగా, వాస్తవాలను కప్పిపెట్టేందుకు, మహారాష్ట్రలోని మిగతా ప్రాంతాలలో తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేసేందుకు 'సామ్‌నా' పత్రిక ఇలా రాసింది. "శ్మశాన ప్రాంతంలో దేశ వ్యతిరేక కార్యకలాపాలు" దహన కాండకు, లూరీకి, గృహాలు, దుకాణాల విధ్వంసానికి కారణం.

పూర్తిస్థాయి దాడికి ముందు <u>జలాభిషేక</u> కార్యక్రమంలో రెచ్చగొట్టే విధంగా ముస్లిం వ్యతిరేక నినాదాలు ఇవ్వటాన్ని కప్పిపెట్టిన శివసేన పత్రికపై మహారాష్ట్ర పోలీసులు ఏమైనా చర్య తీసుకున్నారా అనేది గమనించ వలసిన విషయం.

అధికార యంత్రాంగం నుంచి ఏ మాత్రం సమర్ధన లేని 'సామ్‌నా' పత్రిక రిపోర్టు ఈ విధంగా చెప్పుకుంది. 'శ్మశాన వాటికలోని ఈ అనుమతిలేని షెడ్డులో సిమి (SIMI) కార్యకర్తలు సమావేశం కావటం స్థానికుల మనోభావాలను రెచ్చగొట్టింది". అందుచేత వారు ఆ షెడ్డను కూలద్రోశారు. గృహాలను, దుకాణాలను, వ్యాపార సంస్థలను తగుల బెట్టారు.

మరో ప్రక్క ఆగస్టు 6వ తేదీన దాన్‌లోని సెయింట్ జాన్స్ బాప్టిస్టు చర్చికి చెందిన మత గురువైన ఆస్కార్ మెండోన్‌కాను మహారాష్ట్ర బజరంగ్ దళ్‌కు చెందిన వారు నిర్దాక్షిణ్యంగా చితకగొట్టారు అనే విషయాన్ని గుర్తు చేసుకోవచ్చు. దీని కారణంగా మహారాష్ట్రలోని క్రైస్తవ పాఠశాలలన్నీ రాష్ట్ర వ్యాపిత నిరసనను పాటించాయి. ఈ దాడికి సంబంధించి పోలీసులు తక్షణమే స్పందించి అరెస్టులు చేశారు. అయితే, దాడి చేసిన వారికి వ్యతిరేకంగా విచారణ కూడా తగిన రీతిలోనే జరుగుతుందా అనేది వేచి చూడవల్సిన విషయం.

" అయోధ్యలో బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత కొద్దిరోజులకే ముస్లిం స్త్రీలను మూకుమ్మడిగా మానభంగం చేయటం, రామ జన్మభూమి ఉద్యమపు వాస్తవిక రూపానికి భయానకతార్కాణం. అసలు ఉద్దేశ్యం పవిత్రమైన భగవంతునికి దేవాలయాన్ని నిర్మించటం కాదు. దేవుని, విశ్వాసం పేరును దుర్వినియోగపరిచి వేధింపులను, భయోత్పాతాన్నివ్యాపింపచేయటమే."

ఆగస్టు 26వ తేదీన, ధానేలోని స్థానిక శివసేన కార్యకర్తలు సృష్టించిన విధ్వంసకాండలో ఒక ఆసుపత్రి ధ్వంసం అయ్యింది. శివసేన నాయకుడైన ఆనంద్ దిగే ఈ ఆసుపత్రి ఆవరణలో మరణించిన తరువాత ఈ విధ్వంసకాండ జరిగింది. దీనివలన 9 కోట్ల రూపాయల నష్టం జరిగింది. ఈ ఆసుపత్రికి చెందిన వందల మంది ఉద్యోగులు ఉపాధి కోల్పోయారు. ఈ కేసు విచారణలో పోలీసులు చూసీచూడనట్లు పోతున్నారు. కాగా, ఈ ఘటనలో శాంతిభద్రతల పరిస్థితి అదుపు తప్పటాన్ని దహనకాండను మహారాష్ట్ర రాష్ట్ర మానవహక్కుల సంఘం స్వతంత్రంగా విచారిస్తోంది.

ఉత్తర ముంబాయిలోని బోరివిలీ ప్రాంతంలో కరపత్రాలను పంచుతున్న క్రైస్తవ మత ప్రచారకులను అక్టోబరు 6వ తేదీన స్థానిక పోలీసులు చట్టవిరుద్ధంగా నిర్బంధించారు. బజరంగ్‌దళ్ ఇచ్చిన 'ఫిర్యాదు' మేరకే ఈ అరెస్టులు జరిగాయి! మహారాష్ట్ర రాష్ట్ర మైనారిటీల సంఘ సభ్యుడైన అబ్రహం మథాయి జోక్యం చేసుకున్న తరువాత వారిని నిర్బంధంలోకి తీసుకున్న ఐదుగంటల అనంతరం రాత్రి ఒంటి గంటకు విడుదల చేశారు.

ప్రక్కన వున్న గుజరాత్‌లోని పరిణామాలను 'కమ్యూనలిజం కంబాట్' పత్రిక గత 3 సంవత్సరాలుగా దగ్గరగా గమనిస్తున్నది. అక్కడ ఒక క్రమ పద్ధతిలో ఘటనలు జరుగుతున్నాయి. ఇవి క్రియాశీల రూపంలో <u>హిందుత్వ</u> చర్యలు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు నెలల్లో జరిగిన పలు ఘటనలు ఆ రాష్ట్రంలో మైనారిటీల జీవితానికి, మత స్వేచ్ఛకు భద్రత లేని వాతావరణాన్ని వెల్లడిస్తున్నాయి. ఆ రాష్ట్రంలో ఈ మధ్య జరిగిన రాజకీయ పరిణామాల క్రమంలో ఆర్.ఎస్.ఎస్. <u>ప్రచారక్</u> అయిన నరేంద్ర మోడి ముఖ్యమంత్రి స్థానంలోకి వచ్చారు. ఇటువంటి ఘటన స్వతంత్ర భారతదేశ చరిత్రలో మొట్టమొదటి సారిగా జరిగింది. కరుడు గట్టిన భావాలు గల నరేంద్ర మోడి నాయకత్వంలో రాష్ట్రంలో మత సామరస్య పరిస్థితి మరింత దిగజారుతుందని రాజకీయ పరిశీలకుల అభిప్రాయం.

ఆగస్టు నెల చివరిలో అహ్మాదాబాద్‌లో జరిగిన గణేష్ ఉత్సవాల సందర్భంలో బజ్‌రంగ్‌దళ్ కార్యకర్తలు బీభత్సం సృష్టించారు. గణేష్ ఉత్సవాల నిర్వహణకు ముస్లిం మతానికి చెందిన వారు కొందరు చందాను ఇచ్చేందుకు నిరాకరించడంతో బజ్‌రంగ్‌దళ్ కార్యకర్తలు ఒక ముస్లిం యువకుడిని చంపివేశారు. (ఏషియన్ ఏజ్ ఆగస్టు 26) తరువాత మూడు రోజుల పాటు జరిగిన హింసాకాండను పోలీసు యంత్రాంగం స్తబ్దుగా చూస్తూ వుండి పోయింది. దాడికి గురి అవుతున్న వారిని రక్షించవల్సిన తన కర్తవ్యంలో విఫలం అయ్యింది. భజరంగ్ దళ్‌కు <u>హఫ్తా</u> (రౌడీమామూలు) ఇచ్చేందుకు నిరాకరించిన ముగ్గురు చిన్న వ్యాపారులు కత్తిపోట్లకు గురి అయ్యారు. వీరిలో ఇరువురు మరణించారు. బజరంగ్‌దళ్ కార్యకర్తలపై ఫిర్యాదులను నమోదు చేసుకోవాలన్న డిమాండుకు సరైన ప్రతిస్పందన లేదు. ఈ సంస్థకు రాజకీయ అండ వుండటమే దీనికి కారణం.

ఈ మధ్యే జరిగిన మరింత గగుర్పాటు కలిగించే మరో ఘటనలో గుజరాత్‌లోని పతన్ జిల్లాకు చెందిన చిన్న పట్టణమయిన ఛనాస్మ నుంచి 550 మంది ముస్లిం పురుషులు, స్త్రీలు, పిల్లలు పతన్ ప్రాంతానికి బలవంతాన తరిమివేయబడ్డారు. సమస్తమూ కోల్పోయిన వారికి అంబరమే పై కప్పుగా మిగిలింది. "ముస్లింల శవాలు త్రవ్వి తీసారు. శ్మశాన భూమిని చదును చేసారు. ఆ ప్రాంతంలో కాషాయ జెండాలను నాటారు" అని, ఈ సంవత్సరం సెప్టెంబరు నెలలో ఛన్మాసలో జరిగిన అత్యాచారాల గురించి, ఒక విచారణ సంఘం నివేదికను ఇచ్చింది.

ఇందూకుమార్ జనీ (నయా మార్గ్ పత్రిక ఎడిటర్), వల్జీబాయ్ పరేమార్ (సామాజిక న్యాయసమితి కార్యదర్శి), రాజు సోలంకీలు (పాత్రికేయుడు-కార్యకర్త) సమర్పించిన ఈ నివేదిక, ఈ విధంగా పేర్కొంది ఛనాస్మ పట్టణంలో చిరకాలంగా ముస్లింల యాజమాన్యంలో వున్న నౌగాజాఫీర్ అని పిలువబడే దర్గా భూమిని, ప్రస్తుతం లారీలు చేబూనిన స్థానిక బజరంగ్‌దళ్ కాషాయ మురా బలవంతంగా స్వాధీన పరుచుకున్నది. నౌగాజాఫీర్ దర్గాలో నేలపై పరిచివున్న ఆకుపచ్చ తివాచీని తొలగించి, తెల్లతివాచీని వేశారు, సమాధి ఆకారంలో వున్న లైట్ హౌస్‌ను తొలగించి హిందూ దేవాలయాన్ని నిర్మించారు. దానికి కాషాయరంగు వేశారు. దానిపై తెల్లజెండాను ఎగురవేశారు. అలాగే బజరంగ్‌దళ్ గుర్తు అయిన త్రిశూలాన్ని కూడా పైన నిలిపారు. ఒక ఇనుప చబుతరాను నిర్మించి, దానిపై కాషాయజెండాను ఎగురవేశారు. దర్గా చుట్టూ 'భారత్ మాతా కీజై' అనే

నినాదాన్ని వ్రాసారు. వక్ఫ్ బోర్డుకు చెందిన ఈ భూమిని ఆక్రమించుకొనేందుకుగాను కొత్తగా ఒక ఇటుకల గోడను నిర్మించారు".

అన్ని మతాలను కలుపుకుపోయే మన సాంప్రదాయానికి ప్రతిబింబమైన దైవ పీఠంపై ఈ దాడితోనే మైనారిటీలపై వేధింపు ఆగిపోలేదు. నిజ నిర్ధారణ నివేదికల ప్రకారంగా, కత్తులు చేబూనిన కొందరు బజరంగ్‌దళ్ వాలంటీర్లు ఇందిరా నగర్‌లోని ముస్లింల ఇళ్లను చుట్టుముట్టి, ముస్లిం స్త్రీలను భయంగొల్పే రీతిలో బెదిరించారు. "స్థానిక దళితులు కనుక వారిని రక్షించి ఆ రాత్రి ఆశ్రయం ఇవ్వకుంటే అక్కడ 1992వ సంవత్సరం డిసెంబరు నెలలో సూరత్‌లో జరిగిన భయానక ఘటనలు మరలా పునరావృతమయ్యేవి'.

(అయోధ్యలో బాబ్రీ మసీదు విధ్వంసం తరువాత కొద్దిరోజులకే ముస్లిం స్త్రీలను మూకుమ్మడిగా అత్యాచారం చేయటం, <u>రామజన్మభూమి</u> ఉద్యమపు వాస్తవిక రూపానికి భయానక తార్కాణం. అసలు ఉద్దేశం పవిత్రమైన భగవంతునికి దేవాలయాన్ని నిర్మించటం కాదు. దేవుని, విశ్వాసం పేరును దుర్వినియోగపరిచి వేధింపులను, భయోత్పాతాన్ని వ్యాపింపచేయటమే. వీటి వాస్తవ రూపమే అత్యాచారాలు, హత్యలు)

<u>హిందుత్వ</u> సేన పథకాలు ఎలా విజయవంతమయ్యాయో పతన్ ప్రాంతంలో ప్రస్తుతం నివసిస్తున్న ముస్లిం కుటుంబాలవారు నిజనిర్ధారణ బృందం సభ్యుల ముందు వెల్లడించారు. "మేమిక ఛనస్మాకు వెళ్లేందుకు సిద్ధంగా లేము. మా తల్లులు, అక్కలు, చెల్లెళ్లు, ఆడపిల్లలకు అక్కడ రక్షణలేదు".

పటేళ్ల జనాభా (80 శాతం మంది ఈ కులం వారే) ఎక్కువగా ఉన్న ఛనస్మా ప్రాంతంలో ఈ ఉద్రిక్తత తాలూకు చరిత్ర రెండు సంవత్సరాల కాలానిది. 1999వ సంవత్సరం చివరిలో ఛనస్మా బస్టాండు వద్ద వడావలీ గ్రామానికి చెందిన ఒక ముస్లింపై ఉద్దేశ్యపూర్వకంగా దాడి జరిగింది. స్థానిక ముస్లిం వక్ఫ్ దర్గాకు చెందిన భూమి గురించి స్థానిక మునిసిపాలిటీ 1999వ సంవత్సరం డిసెంబరు 12వ తేదీన ఒక తీర్మానం ద్వారా ఛనస్మాకు చెందిన హిందువుల లోక కళ్యాణ్ ట్రస్ట్‌కు ధారాదత్తంచేసింది. "స్థానిక పరిపాలనా సంస్థే చట్టవ్యతిరేకమైన వేధింపు చర్యకు పాల్పడితే మైనారిటీ ప్రజల పరిస్థితి ఎలా వుంటుందో ఎవరైనా తేలికగా ఊహించవచ్చు,' ' అని నిజ నిర్ధారణ కమిటీ నివేదిక పేర్కొంది. మరోమారు పరిపాలనా యంత్రాంగపు ప్రతిస్పందన కొరవడింది. చట్టవిరుద్ధ చర్యకు వ్యతిరేకంగా స్థానిక ముస్లింలు ఆగస్టు 17వ తేదీన పతాన్ జిల్లా కలెక్టరుకు ఒక పిటిషన్ సమర్పించారు. అయితే, కలెక్టరు ఈ విషయంలో నిర్లిప్తంగా వుండిపోయారు. మైనారిటీ మతస్థులను రక్షించేందుకు ఏ చర్య తీసుకోలేదు. చివరకు, తమ భూమి, ప్రాణాలకు రక్షణ కల్పించవల్సిందిగా కోరుతూ ముస్లిం కుటుంబాలు గుజరాత్ హైకోర్టులో రిట్‌పిటిషన్ దాఖలు చేయవల్సి వచ్చింది!

మరోవంక రాష్ట్రంలోని క్రైస్తవ మైనారిటీల పరిస్థితి కూడా దుర్భరంగానే వుంది. అఖిల భారత క్రైస్తవ సమితి చేసిన ఫిర్యాదుల ప్రకారం సెప్టెంబరు, అక్టోబరు నెలలో గుజరాత్‌లోని భిన్న ప్రాంతాల నుంచి వచ్చిన సమాచారం ప్రకారంగా, పలు చోట్ల క్రైస్తవ మతస్థులు, చర్చిల పై దాడులు జరిగాయి. అలాగే, బైబిల్‌ను అపవిత్రం చేయడం వంటి ఘటనలుకూడా జరిగాయి.

క్రీస్తుపై నిర్మించిన ఒక చలన చిత్రాన్ని గ్రామంలోని క్రైస్తవులను చూడనీయకుండా, శక్తివంతులైన పటేళ్లు, సర్పంచ్‌లు బలవంతంగా నిరోధించారు. ఈ ఘటన దక్షిణ గుజరాత్‌లోని దహోడ్ జిల్లాలో, సెప్టెంబరు 19వ తేదీన జరిగింది. మరుసటి రోజు బాధితులు తమ ఫిర్యాదును నమోదు చేసేందుకుగాను లింఖేడా పోలీస్టేషన్‌కు వెళ్లారు. అక్కడ వారికి పూర్తిగా ప్రతికూలమైన పరిస్థితి ఎదురయ్యింది. "ఈ చిత్రాన్ని బహిరంగంగా ప్రదర్శించేందుకు మీరు మా అనుమతిని ఎందుకు తీసుకోలేదు? అనుమతి లేకుండా చిత్రాన్ని ప్రదర్శించచూసినందున మీరు నేరస్థులు!' ' అనేది బాధితులకు పోలీసుల నుంచి వచ్చిన జవాబు. వాస్తవానికి చిత్ర ప్రదర్శన ఒక ఇంటిలో ఏర్పరచారు. దీనికి గాను ఎటువంటి మైకులను ఉపయోగించలేదు.

దీనికి ముందుగా, ఆగస్టు 25 వ తేదీన మధ్యప్రదేశ్‌లోని జోబాత్ గ్రామానికి చెందిన ఒక క్రైస్తవ అనాథాశ్రమ మహిళా అధికారులు, పిల్లలు దాహోడ్‌లో కాళీ డామ్ వద్దకు పిక్‌నిక్‌కు వెళుతుండగా బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్ వారితో కలిసి పోలీసులు కూడా వారిపై దాడి చేశారు. ఒక చేతి పంపు వద్ద పిల్లలు ముఖాలు కడుక్కుంటుండగా బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్‌కు చెందిన కార్యకర్తలు వారిని చుట్టుముట్టారు. వారి జీపుల తాళాలను లాక్కున్నారు. స్త్రీలను కర్రలతో కొట్టారనే ఆరోపణ కూడా వున్నది. దిక్కులేని పరిస్థితిలలో అనాథాశ్రమ అధికారులు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లారు. కాగా, అక్కడ పోలీసులు ఫిర్యాదును నమోదు చేసేందుకు బదులుగా స్త్రీలను కొట్టారు. దహోడ్‌ను తక్షణం వదిలి వెళ్లవలసిందిగా ఆజ్ఞాపించారు అనేది ఆరోపణ. దహోడ్ పోలీసులు ఫిర్యాదును నమోదు చేసేందుకు నిరాకరించటం వలన, అనాథాశ్రమ పరిధిలోకి జోబాట్ పోలీస్ స్టేషన్‌లో బాధితులు ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేశారు. ఈ రకమైన ఉద్రిక్త ఘటనలు గత కొద్ది నెలలుగా ఒరిస్సా, రాజస్థాన్‌లలో కూడా జరుగుతున్నాయి. హిందూత్వ శక్తుల చేతిలో బందీలైన మనదేశము, ప్రజలు ఈ దుర్భర పరిస్థితిని మరలా మరలా ఎదుర్కొనవలసినదేనా అన్నదే నేడు మన ముందువున్న ప్రశ్న.

సైద్ధాంతిక గ్రంథాలు

1.	కమ్యూనిస్టు పార్టీ ప్రణాళిక	మార్క్స్, ఎంగెల్స్	22.00
2.	నిత్య నూతన కర్తవ్య దీపిక కమ్యూనిస్టు ప్రణాళిక	సుకోమల్‌సేన్	10.00
3.	గోథా కార్యక్రమ విమర్శ	కార్ల్‌మార్క్స్	6.00
4.	కుటుంబం స్వంత ఆస్తి రాజ్యముల ఆవిర్భావం	ఫ్రెడరిక్ ఎంగెల్స్	26.00
5.	సోషలిజం: శాస్త్రీయం-ఊహాజనితం	ఎంగెల్స్	10.00
6.	ప్రాథమిక ఆర్థిక సూత్రాలు	మార్క్స్, ఎంగెల్స్	15.00
7.	ఏం చేయాలి?	లెనిన్	20.00
8.	లెనిన్ రచించిన ఏంచేయాలి గురించి	వి పి. ఫిలటోవ్	10.00
9.	భారత కమ్యూనిస్టుపార్టీ(మార్క్సిస్టు) కార్యక్రమము		8.00
10.	పార్టీ కార్యక్రమంపై వివరణ వ్యాసాలు	సూర్జిత్, ప్రకాష్, ఏచూరి	10.00
11.	మార్క్సిజం-సమాజం	క్యూబా రచయితల వ్యాసాలు	15.00
12.	లెనినిజం-పునాదులు	స్టాలిన్	15.00
13.	పార్టీ పనివిధానం చక్కదిద్దుకుందాం	మావో	8.00
14.	కమ్యూనిస్టు నిపుణుడు	మావో	4.00
15.	కార్యకర్తలను నాయకులను ఎలా తయారు చేసుకోవాలి	స్టాలిన్, డిమిట్రోవ్ మావో, లీషావ్‌చీ, చౌఎన్‌లై	9.00
16	మంచి కమ్యూనిస్టు ఎలా ఉండాలి	లీషావ్‌చీ (పార్టీ అంతరంగికపోరాటం)	15.00
17.	మార్క్సిజం అంటే ఏమిటి?	ఎమిలి బరన్స్	10.00
18	సోషలిజం ఓనమాలు	లియో హ్యూబర్‌బన్	5.00
19.	మార్క్సిస్టు సిద్ధాంత సులభ పరిచయం	శివవర్మ	12.00
20.	మార్క్సిస్టు మూలగ్రంథాల సులభ పరిచయం	మారిస్‌కార్న్‌ఫోర్త్	15.00
21.	శాఖా కార్యదర్శుల పని విధానం		3.00
22.	భారత కమ్యూనిస్టు పార్టీ(మార్క్సిస్టు) నిబంధనావళి		3.00
23.	పార్టీ ఫ్రాక్షన్లు, ప్రజాసంఘాలు		4.00
24.	ఆందోళన-ప్రచారం-నిర్మాణం	సి.పి.ఐ(ఎం) రాష్ట్ర కమిటీ	15.00
25.	పార్టీ నిర్మాణం-ప్రజాసంఘాలు	లావుబాలగంగాధరరావు	10.00
26	పార్టీ నిర్మాణావలోకనం	తెలకపల్లి రవి	7.00
27.	మార్క్సిజం అంటే ఏమిటి? (మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ తాత్విక రచనల నుండి)	సం॥ హోవర్డ్ సెల్సం, హారీ మార్టెల్	8.00
28.	భౌతికవాదం-భావవాదం (మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ తాత్విక రచనల నుండి)	॥	12.00
29.	గతితర్కం, గతి తార్కికపద్ధతి	॥	12.00
30.	చారిత్రక భౌతికవాదం	మార్క్స్, ఎంగెల్స్	15.00
31.	గతితార్కిక చారిత్రక భౌతికవాదం	స్టాలిన్	5.00
32	గతి తార్కిక భౌతికవాదం	నందూరి ప్రసాదరావు	12.00

అర్జెంటీనాలో నిరుద్యోగ కార్మికోద్యమం

జేమ్స్ పెట్రాస్

గత 25 సంవత్సరాలలో లాటిన్ అమెరికాలో మూడు ప్రధాన ఉద్యమ స్రవంతులు తలెత్తాయి. ఇవి పరస్పరం సంబంధం కలిగినవే. మొదటి ఉద్యమ స్రవంతి కుడిఎడంగా 1970లలో మొదలై 80 దశకం మధ్యభాగం వరకూ సాగింది. ఇది ప్రధానంగా నూతన సామాజిక ఉద్యమంగా చెప్పవచ్చు. ఇందులో మానవహక్కులు, పర్యావరణం, స్త్రీవాద, జాతీయతా సమస్యలపై జరిగిన ఉద్యమాలతోపాటు ప్రభుత్వేతర సంస్థలు నిర్వహించిన ఉద్యమాలు కూడా ఉన్నాయి. దిగువ మధ్యతరగతికి చెందిన వారు ఈ ఉద్యమానికి నాయకత్వం వహించారు. సైనిక నియంతృత్వ, పౌర నిరంకుశ ప్రభుత్వాల పాలన పట్ల వ్యతిరేకత ఈ ఉద్యమాలలో ముఖ్యమైన విధానంగా ఉన్నది.

80వ దశకం మధ్యభాగంలో మొదలై నేటివరకూ కొనసాగుతున్న ద్వితీయ ఉద్యమ స్రవంతి ప్రధానమైన రాజకీయశక్తిగా ఆవిర్భవించింది. ఈ ఉద్యమంలో కీలక పాత్రధారులు రైతాంగం, కార్మికులు ప్రజాసంఘాలు. వీరు ప్రాతినిధ్యం వహించే వర్గాల ఆర్థిక ప్రయోజనాలు పరిరక్షించటమే ఈ ఉద్యమాల ప్రధాన కర్తవ్యంగా ఉన్నది. ఈ తరహా ఉద్యమాలలో చెప్పుకోదగ్గవి మెక్సికోలోని జపటిస్టా ఉద్యమం, బ్రెజిల్‌లోని భూమిలేని గ్రామీణ పేదల ఉద్యమం, బొలీవియాలో రైతు కూలీ ఉద్యమం, పెరుగ్వేలోని జాతీయ రైతాంగ సమాఖ్య, కొలంబియా సాయుధ దళాల ఉద్యమం, ఈక్వెడార్‌లోని ఇండియన్ జాతుల రైతాంగ సంఘటనల ఉద్యమం. ఈ ఉద్యమాల డిమాండ్లు, ఎత్తుగడలు వేరైనప్పటికీ సామ్రాజ్యవాదం, నయాఉదారవాద విధానాలను, ఆయా దేశాలలోని ఉదారవాద ఆర్థికశక్తులను, స్వదేశీ, విదేశీ కులీన వర్గాల చేతుల్లో సంపద కేంద్రీకరణను వ్యతిరేకించడంలో వీరందరూ ఐక్యమయ్యారు. ముఖ్యంగా భూమి పున:పంపిణీకోసం, ఇండీస్ జాతుల స్వయంప్రతిపత్తి కోసం, కోకో నిర్మూలన పేరుతో జరుగుతున్న అమెరికా జోక్యాన్ని వ్యతిరేకిస్తూ, సైనిక స్థావరాలు ఏర్పాటు చేయటం ద్వారా తమ దేశాలపై తిరిగి వలస పెత్తనాన్ని రుద్దేందుకు వ్యతిరేకంగా, జాతీయ ప్రభుత్వాల విధానాలలో జోక్యం, సైనిక జోక్యం, కొలంబియా పథకం, ఆండియన్ చొరవ పేర్లతో సామాజిక ఘర్షణల్లో సాయుధ జోక్యం వంటి విధానాలకు వ్యతిరేకంగా ఈ ఉద్యమాలు తలెత్తాయి. ఇక ఈ క్రమంలో తలెత్తిన మూడవ ఉద్యమ స్రవంతి పట్టణ ప్రాంతాలలో కేంద్రీకృతమైనది. ఇందులో విస్తృత ప్రాతిపదికన జరిగిన అర్జెంటీనా నిరుద్యోగ కార్మికుల వీరోచిత పోరాటం, ' డొమినికన్ రిపబ్లిక్‌లో జరిగిన నిరుద్యోగులు పేదల పోరాటం, హ్యూగోచావెజ్‌కు స్వాగతం పలికిన వెనిజులా మురికివాడల ప్రజల పోరాటం వంటి కొన్ని. ఈ తరహా పట్టణ ప్రాంత ప్రజల ఉద్యమాలతోపాటు బహుముఖ ప్రజా పోరాటాలు నడిపిన కొలంబియా, మెక్సికో, బ్రెజిల్, పెరుగ్వేలలో పేదరైతులు వ్యవసాయక్షేత్రాల కార్మికుల పోరాటాలు మరికొన్ని ఉన్నాయి.

చెదిరిపోయిన ఉదార భ్రమలు

ద్వితీయ, తృతీయ తరహా ప్రధాన ఉద్యమ స్రవంతుల స్వభావం, రాజకీయ కార్యాచరణ తీరు సాంప్రదాయ ఉదారవాద సిద్ధాంతవేత్తల వాదనలు, మార్క్స్ అనంతరం ముందుకొచ్చిన పిడివాద పద్ధతులను సవాలు చేసినట్లుగా ఉంటాయి. ఉదాహరణకు నూతన సామాజిక ఉద్యమాల రచయితలు వర్గ రాజకీయాలు అంతమయ్యాయని, లైంగిక సమానత్వం, ప్రజాస్వామ్యం, గుర్తింపు రాజకీయాలు (ఐడెంటిటీ పాలిటిక్స్) వంటి సమస్యల ప్రాతిపదికన సాంస్కృతిక ఉద్యమాలు పౌరులను లక్ష్యంగా చేసుకొనే ఉద్యమాలు ముందుకు వస్తాయని ప్రకటించారు. వర్తమాన రాజకీయ పోరాటంలో రైతాంగం పాత్రను పూర్తిగా

❀ అర్జెంటీనా విముక్తి చెందిన తర్వాత గత 45 ఏళ్లలో 18 సార్లు దేశ ఆర్థికవ్యవస్థ పతనావస్థకు చేరింది. అన్నిసార్లూ ఐఎంఎఫ్ రుణం ఇచ్చి ఆదుకొన్నది. ప్రతిసారీ ఐఎంఎఫ్ ఒక ప్యాకేజీ ప్రకటించటం. తన విధానాలు విజయవంతం అయ్యాయని చెప్పుకోవటం తర్వాత కొద్దికాలానికే ఆర్థికవ్యవస్థ పతనం కావటం జరుగుతూ ఉన్నది.

❀ అప్పు ఇచ్చిన అన్ని సందర్భాలలోనూ ఐఎంఎఫ్ ప్రభుత్వానికి ప్రత్యక్షంగా రుణం మంజూరు చేసినా ఆచరణలో ప్రభుత్వం బాకీపడిన విదేశీబ్యాంకులకు ఈ నిధులు జమ అయ్యేవి.

❀ అర్జెంటీనాలో వెలుగుచూస్తున్న సంక్షోభం బహుళజాతిసంస్థలు వాటి ప్రయోజనాలకోసం దేశాల ఆర్థిక వ్యవస్థలలో ఎలా జోక్యం చేసుకొంటాయి, వాటి ఫలితాలు ఎంత దారుణంగా ఉంటాయి, పరిష్కరించలేని సంక్షోభం తలెత్తినప్పుడు ఆయాసంస్థలు వాటి, నిర్ణేతలు ఆదేశాలను గాలికొదిలేస్తాయో తెలుసుకొనేందుకు చక్కని ఉదాహరణ.

తిరస్కరిస్తూ ఎరిక్ హాబ్స్‌బాం వంటి సిద్ధాంతవేత్తలు " భౌగోళిక" వాదనలను ముందుకు తెచ్చారు. మిగిలినవారు కూడా పట్టణప్రాంత పేదల్లో ప్రధానభాగం పాక్షిక ఉపాధిని మాత్రమే కలిగి ఉన్నారని, ప్రధాన ఉత్పత్తి సాధనాలనుండి వేరుపర్చబడ్డారని, ఆధిపత్య రాజకీయాలను సవాల్ చేయలేరని వాదించారు.

లాటిన్ అమెరికా అంతటా భూమి, రాజకీయాధికారం లక్ష్యాలుగా తదనంతర కాలంలో విస్ఫోటనంలా ఎగసిన ప్రజా పోరాటాలు ఈ పిడివాద భావాలను తిప్పి కొట్టాయి. ఈక్వెడార్ సంఘటన, జపాటిస్టా, కొలంబియా సాయుధ దళాల ఉద్యమం తదితర పోరాటాల వల్ల ఆర్థిక రాజకీయ ఉదారవాదం ద్వారా సామూహిక సైద్ధాంతిక పోరాటాలకు కాలం చెల్లిందనే వాదనలను పటాపంచలు చేశాయి. దశాబ్దాల తరబడి కొనసాగుతున్న అవినీతి, మితవాద, దుందుడుకు, పాలనలకు ఈ ఉద్యమాలు బహిరంగ సవాలుగా మారాయి. ఈ క్రమంలో సరికొత్త ప్రాతినిధ్య ప్రజాస్వామ్యాన్ని ఈ పోరాటాలు ముందుకు తెచ్చాయి. ఈ పోరాటాలన్నింటిలోనూ ప్రత్యక్ష కార్యాచరణ ప్రధానంగా పెట్టుబడిదారీ దోపిడీ పైనా, నయాఉదారవాద విధానాలు వ్యవస్థల ఉత్పత్తి పునరుత్పత్తులపై తీవ్రమైన దెబ్బతీశాయి. 2000లో జరిగిన ఈక్వెడార్ ఎన్నికల్లో పార్లమెంట్‌లో ఇండీస్ జాతులు మెజారిటీ సాధించటం, కొలంబియాలోని దాదాపు సగం మున్సిపల్ పట్టణాలలో కొలంబియా సాయుధ దళాలు ప్రభావం చూపగల శక్తులుగా ఎదగటం, బ్రెజిల్‌లో భూమిలేని పేదల సంఘటన 24 రాష్ట్రాలకు గాను 23 రాష్ట్రాలలో ఆధిపత్యం సంపాదించటం వంటి పరిణామాలు హాబ్స్‌బాం " భౌగోళికత" సిద్ధాంతాన్ని తిరస్కరించాయి.

అర్జెంటీనాలో నిరుద్యోగులు

పిడివాద మార్క్సిస్టులు చెప్పేదాని ప్రకారం ఉత్పత్తిలో కీలకస్థానంలో ఉంటారు కనుక ఏ సామాజిక పరిణామంలోనైనా పారిశ్రామిక కార్మికులు కీలక పాత్ర పోషిస్తారు. ఈ వాదన ప్రకారం పారిశ్రామిక కార్మికవర్గం క్రమంగా తగ్గిపోవటం, పాక్షిక ఉద్యోగులు, నిరుద్యోగులు, అసంఘటిత రంగ కార్మికులు అనూహ్యంగా పెరిగిపోవటం వంటి పరిణామాల నేపథ్యంలో ఎటువంటి విప్లవాత్మక మార్పులకు అవకాశాలు లేవు. వీరి అభిప్రాయంలో ఈతరహా పాక్షిక అసంఘటిత ఉద్యోగులు, పట్టణప్రాంత పేదలు ఉత్పత్తి క్రమం నుండి, ప్రధాన ఆర్థిక స్రవంతి నుండీ సాపేక్షంగా దూరం కావటంతో సంపద పోగుపడే క్రమాన్ని అడ్డుకోవటంలో వారి సామర్థ్యం తగ్గిపోతుంది. అంతేకాక పట్టణ ప్రాంత ప్రజలు నామమాత్రపు వేతనాలకు పని చేసేందుకు సిద్ధం కావటంతో కార్మికోద్యమ డిమాండ్లపై పరోక్షంగా పరిమితులు విధించటం ద్వారా పెట్టుబడిదారీ విధానానికే మేలు చేస్తున్నారు. ఆశ్చర్యం ఏమంటే ప్రధాన స్రవంతికి చెందిన సామాజిక శాస్త్రవేత్తలు, ప్రభుత్వేతర సంస్థల నేతలు ఉపాధికల్పనలో వచ్చిన మార్పులు ప్రయోజనకరమైనవనీ, పట్టణ ప్రాంత ప్రజలకు ప్రాథమిక స్థాయిలో ఏదో ఒక వ్యాపకం కల్పించటం ద్వారా, మధ్యస్థ ఆర్థిక కార్యకలాపాలు, పరస్పరం ఆధారపడటం ద్వారా వారి స్వతంత్రతకు దోహదం చేస్తున్నదని మనలను నమ్మమంటున్నారు. అర్జెంటీనాలో స్థిరమైన ఉపాధి లేకపోవటం, జీవన ప్రమాణాలు పడిపోవటం, సామాజిక అశాంతి తలెత్తడం, పెరుగుతున్న హింసాత్మక చర్యలు, చీకటి మార్కెట్ ఆర్థిక కార్యకలాపాల విస్తరణ తదితర పరిణామాలన్నింటికీ ఈ మేధావులు స్వయం ఉపాధి (సెల్ఫ్ హెల్ప్) అని నామకరణం చేశారు. అయితే సమర్థవంతమైన నాయకత్వంలో పట్టణప్రాంత పేదలను జాగ్రత్తగా సమీకరించటం ద్వారా పిడివాద మార్క్సిస్టులను సవాలు చేశారు. సంఘటితులైన

నిరుద్యోగులను దేశవ్యాపితంగా సమీకరించి అగస్టు 2001లో ఉద్యమించటం ద్వారా ఒకేరోజు అర్జెంటీనాలో మూడువందల రహదారులను దిగ్బంధనం చేశారు. ఆర్థిక వ్యవస్థను పాక్షికంగా స్తంభింపచేశారు. ద్రవ్య వ్యవహారాలతో సహా అన్ని ఆర్థిక కార్యకలాపాలు స్తంభించి పోయాయి. గడిచిన వారాలు, నెలల్లో పోలీసులు ఐదుగురు ఆందోళనకారులను చంపారు. దేశవ్యాప్తంగా విస్తరించిన హింసాత్మక ప్రతిఘటనలో మూడువేలమందిని అరెస్టు చేశారు. అదేసమయంలో సంఘటితులైన నిరుద్యోగులు వేలాదిమందికి కనీసవేతనాలతో కూడిన తాత్కాలిక ఉపాధి పొందటంలోనూ, ఆహార సబ్సిడీని, ప్రభుత్వం నుండి ఇతర రాయితీలు పొందటంలో విజయవంతం అయ్యారు. దీంతోపాటు వారి సంఘటిత శక్తిని కాపాడుకోగలిగారు. 2001 సెప్టెంబరు నాటికి నిరుద్యోగులు రాజధాని బ్యూనస్ ఎయిర్స్ అంతటా భారీ రాస్తారోకోలు, కార్మిక సంఘాలతో కలిసి సాధారణ సమ్మెలు, ప్రభుత్వ కార్యకలాపాలు అడ్డగించటం, అన్ని ప్రధాన ప్రైవేటు పరిశ్రమల్లో ఉత్పత్తిని అడ్డుకోవటం వంటి ఉద్యమాలు చేయగలిగారు. హర్షించదగిన పరిణామమేమిటంటే వివిధ సామాజిక తరగతులకు చెందిన ప్రజలు, రాష్ట్రప్రభుత్వాల, మున్సిపల్ స్థాయి ఉద్యోగులు, పింఛన్‌దారులు, ఆరోగ్యకార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు, మానవహక్కుల సంఘాలలో ప్రధానమైన మేదర్స్ డి ప్లాజా డి మాయో వంటి సంఘాలు ఈ పోరాటాలను బలపర్చటమే కాక అడపాదడపా ప్రత్యక్షంగా కూడా పాల్గొన్నాయి.

ఓపిగ్గా సమీకరించాలి

ప్రస్తుతం మనం చర్చించుకొంటున్న ఈ ఘన విజయాల వెనుక సంవత్సరాల తరబడి ఓపిగ్గా వారిని సమీకరించిన శ్రమ దాగి ఉన్నది. ఈ సమీకరణలను విచ్ఛిన్నం చేయటానికి అప్పుడప్పుడూ ప్రయత్నాలు జరగకపోలేదు. నిరుద్యోగులు మున్సిపల్ రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలకు అర్జీలు పంపారు. శాంతియుతంగా నిరసనవ్యక్తంచేశారు. ఈ ఎత్తుగడలు ఫలితాలనివ్వక పోవటంతో నిరుద్యోగులు మరింత ప్రత్యక్షకార్యాచరణకు పూనుకున్నారు. ఇందులో కేంద్ర రాష్ట్ర స్థానిక ప్రభుత్వ కార్యాలయాలు ఆక్రమించటం మొదలు అప్పుడప్పుడూ వాటిని అగ్నికి ఆహుతి చేయటం వంటివున్నాయి. కట్రోల్ కో, ప్లాజా హునికాల్ రెండు మారుమూల పట్టణాలలో రాస్తారోకో, పికెటింగ్ కార్యక్రమాలు తొలిసారిగా 1996 జూన్‌లోనూ, 1997 ఏప్రిల్‌లోనూ చోటుచేసుకున్నాయి. పరిశ్రమల మూసివేత, ఉద్యోగాల కోతకు వ్యతిరేకంగా వేలాదిమంది ఈ ఆందోళనల్లో పాల్గొన్నారు. 90దశకం చివర్లో బ్యూనస్‌ఎయిర్స్ కార్మికవాడల్లో ప్రైవేటు విద్యుత్ కంపెనీలు విద్యుత్‌చార్జీల పెంపుదలకు, బిల్లు చెల్లించలేని నిరుద్యోగుల ఇళ్లకు కరెంటు కోత విధించటం వంటి చర్యలకు వ్యతిరేకంగా భారీ స్థాయిలో రాస్తారోకోలు జరిగాయి. 2000సంవత్సరం నాటికి గతంలో చమురు ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్న నకీన్, జనరల్ మస్కోని వంటి నగరాలలో సామూహిక నిరసన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. ప్రైవేటీకరణతో పారిశ్రామికవాడలు మూతపడి నిరుద్యోగం పెరిగిపోయింది. నిరుద్యోగులకు ఆర్థిక సహాయం అన్న ప్రభుత్వం తన వాగ్దానాలు నిలుపుకోలేకపోయింది. ఐఎంఎఫ్‌ఆదేశాలమేరకు ద్రవ్య సంస్కరణల్లో భాగంగా బడ్జెట్ కేటాయింపుల్లో కోతకోయటమే దీనికి కారణం.

ఈ ఉద్యమాలకు మూలకారణం

అర్జెంటీనాలోని నిరుద్యోగుల పోరాటాన్ని వివరించేటప్పుడు అందుకు దారితీసిన నయాఉదారవాద విధానాలు, దానివలన లాటిన్‌అమెరికాలో చితికిపోయిన ప్రజల కార్మికుల జీవితాల గురించి తెలుసుకోవటం అవసరం. మార్కెట్ సిద్ధాంతవేత్తల ఆదేశాలను అర్జెంటీనా ప్రభుత్వం అనుసరించటంతో దీని దుష్పరిణామాలు ఇలా ఉన్నాయి. 1. ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకంతో కొత్త యజమానులు వేలాదిమంది కార్మికులకు ఉద్వాసన పలికారు. 2. ఖనిజవనరుల వెలికితీతతోసహా పలు ఉత్పాదకచర్యలు లాభదాయకం కాకపోవటంతో వాటిని మూసివేశారు. దీనివల్ల

> ❀ అర్జెంటీనా సంక్షోభంలో కొసమెరుపు ఏమంటే సంక్షోభం యావత్‌దేశాన్నీ అతలాకుతలం చేసినా పెట్టుబడులు పెట్టిన విదేశీబ్యాంకులు మాత్రం లబ్ధి పొందాయి. ప్రభుత్వరంగ సంస్థల్లో 48శాతం విదేశీ పెట్టుబడులకు అవకాశమివ్వటంతో ఈ లాభాలు మరింతగా పెరుగుతాయని భావిస్తున్నారు.
>
> ❀ అర్జెంటీనా ఆర్థిక వ్యవహారాల నిర్వహణపై పెత్తనం ఆదేశ ప్రభుత్వానికి లేదు. ఆర్థికరంగంలో అది తీసుకొన్న నిర్ణయాలు విదేశీకంపెనీలకే ప్రయోజనకరంగా ఉన్నాయి తప్ప దేశీయ కంపెనీలకు, స్థానిక ప్రజలకుగానీ మేలు చేకూర్చలేదు. ఉత్తరాదినుండి వచ్చిన విదేశీబ్యాంకులే ఈ నిర్ణయాలవలన లబ్ధి పొందాయి.
>
> ❀ అర్జెంటీనా అప్పుపై న్యాయవిచారణ నివేదిక – కార్లోస్ మెనన్ హయాంలో కీలకమైన ఆర్థిక నిర్వహణ. ప్రభుత్వవిభాగాలనుఅడ్డూ అదుపూ లేకుండా ప్రైవేటీకరించారు. ప్రభుత్వ శాఖల రద్దు, సిబ్బంది కుదింపు ద్వారా పొదుపు శాతం దారుణంగా పడిపోయేలా చేశారు. ఈ అన్ని చర్యలకూ మెనన్ ప్రభుత్వంలో ఆర్థిక వ్యవహారాలు చూసిన ఐఎంఎఫ్ ఏజెంట్ డొమింగో కావల్లో నిర్ణయాలే కారణం.

అన్నిరంగాలు పతనమయ్యాయి. 3. కార్మికుల స్థితిగతులు వేతనాలు దిగజారాయి. వేలాదిమంది ప్రభుత్వరంగ ఉద్యోగులకు నెలలతరబడి జీతాలు ఇవ్వలేదు. 4. కార్మికసంఘాలపైనా, కార్మికనేతలపైనా దాడులు జరిగాయి. 5. ప్రైవేటు విద్య, వైద్యం భరించలేని వారితో సహా సామాజిక సేవలకు నిధులకోత అన్ని వర్గాలవారిపైనా పింఛనుదారులపైనా ప్రభావం చూపింది. కుప్పలుతెప్పలుగా వచ్చిన విదేశీ నిధులు మార్కెట్‌లో ఊహాజనిత కార్యకలాపాలకు తెరతీశాయి. ప్రభుత్వ అప్పుతో సమానమైన 13కోట్ల డాలర్ల మేర అర్జెంటీనా బూర్జువాలు దేశం బయట కార్యకలాపాలు నిర్వహించేందుకు ఇది దోహదపడింది. 1997లో ప్రారంభమైన స్తబ్ధత 2001నాటికి పూర్తిస్థాయి సంక్షోభ స్థితికి దేశ ఆర్థిక వ్యవస్థను నెట్టేసింది. ఆయా ప్రాంతాలనుబట్టి 30-80శాతం కార్మికులు ఉపాధి కోల్పోయారు. లేదా పాక్షిక ఉపాధికి పరిమితమయ్యారు. గ్రేటర్ బ్యూనస్‌ఎయిర్స్ రాష్ట్రంలో అధికారిక లెక్కల ప్రకారమే నిరుద్యోగం 16-18శాతం ఉన్నది. అనతికాలంలోనే ఇది రెట్టింపయ్యింది. మెజారిటీ కార్మికులు నామమాత్రపు వేతనాలతో రోజులు వెళ్లదీస్తున్నారు. ప్రధాన కార్మికవాడలలో నిరుద్యోగం 30-50శాతానికి చేరింది. అన్ని చోట్లా ప్రజల్లో అత్యధికభాగం దారిద్ర్యరేఖకు దిగువన వున్నారు. రాజకీయ పరిస్థితుల కారణంగా ఆర్థిక పరిస్థితులు మరింత విషమించాయి. ఈమధ్యకాలం వరకూ పాలించిన ముగ్గురు అధ్యక్షులు దేశ ఆర్థిక వ్యవస్థకు కీలకమైన రత్నాలవంటి సంస్థలను విదేశీ పెట్టుబడిదారులకు కారుచౌకగా కుదువపెట్టారు. సామాజిక చట్టాలు తిరగదోడారు. 30వేలమంది ప్రజలను ఊచకోతకోసిన సైనికాధికారులను క్షమించి వదిలేశారు. రెండు ప్రధాన పార్టీలు రాడికల్స్, పర్సనిస్టులు పేదల ఆగ్రహానికి అడ్డుకట్ట వేసేందుకు తమ అనుచరులకు అడపాదడపా ఆహార పొట్లాలు సరఫరా చేయటం తప్ప మరేమీ చేయలేకపోయారు. ఇది ఏమాత్రం ప్రజావసరాలను తీర్చలేకపోయింది. ఆర్థికసామాజికరాజకీయపరిస్థితులు కలిసి ప్రజాసంఘాలు తమ కార్యకలాపాలు ఉధృతం చేసేందుకు దోహదం చేశాయి. తక్షణం ఉద్యమించటానికి దారితీసే పరిస్థితులు, సంఘాల ఎత్తుగడల ద్వారా ముందుకు వచ్చే ఉద్యమాల మధ్య తేడాను మనం గుర్తించవచ్చు. ఉద్యమానికి దోహదం చేసిన వస్తుగత పరిస్థితులను ఈక్రిందివిధంగా క్రోడీకరించవచ్చు. 1. భారీస్థాయిలో నిరుద్యోగులైన పారిశ్రామిక కార్మికులు, ఉపాధి ఎర్పగని యువత, కుటుంబనియంత్రణల మధ్య నలుగుతున్న మహిళలు, పరిమితమైన దిగువ మధ్యతరగతి ప్రభావం 2. గణనీయమైనసంఖ్యలో ఉద్వాసనకు గురైనపారిశ్రామిక కార్మికులకు ఉమ్మడి పోరాటాల్లో, ప్రజా ఉద్యమాల్లో అనుభవం ఉండటం 3. గతంలో ఎటువంటి ఉద్యమానుభవం లేకపోయినా లోతుగా పాతుకుపోయిన సంక్షోభంతో విసిగి వేసారిన గృహస్తులు, భవిష్యత్తు అగమ్యగోచరంగా మారిన వయోజనులు ఉండటం 4. వీరంతా పారిశ్రామిక ఆర్థికవస్తుసేవలు రవాణా అయ్యేదేశం నలుమూలలను కలిపే ప్రధాన రహదారులకు సమీపంలో కేంద్రీకృతమై ఉండటం నూతనతరహా నిరుద్యోగ కార్మికుల పోరాటం విజయవంతం కావటానికి ప్రధాన కారణం. వారంతా తమంతటతాము రంగంలోకి వచ్చినవారు కావటం, ఆందోళన ప్రత్యక్షకార్యాచరణ కావటంగా చెప్పుకోవచ్చు.

ఉద్యమనిర్మాణం

నిరుద్యోగకార్మికోద్యమం(ఎంటిడి) గ్రామాలు, మున్సిపాల్టీలు, కార్మికవాడలు పునాదిగా ప్రారంభమై ఎదిగిన ఉద్యమం. వికేంద్రీకరించబడినవారిని సమీకరించటమే ఈ ఉద్యమ ప్రత్యేకత. ప్రతి మున్సిపాలిటీలోనూ దాని పరిధిలో ఉన్న కార్మికవాడ కేంద్రంగా ఒకసంఘం ఉంటుంది. కార్మికవాడల్లో దాని విస్తృతినిబట్టి ప్రాంతాలవారీ నాయకులు ఉండేవారు. ప్రతి మున్సిపాల్టీలోనూ క్రియాశీలకంగా ఉండే సభ్యులందరూ పాల్గొనేలా ఒకజనరల్‌అసెంబ్లీ ఉంటుంది. ఉద్యమానికిసంబంధించిన విధాన నిర్ణయం ఈ జనరల్ అసెంబ్లీద్వారానే జరిగేది. దీంట్లో సభ్యులందరూ పాల్గొనేవారు. ఉద్యమ డిమాండ్లు, స్వరూపం, రాస్తారోకోలు అన్నీ ఉమ్మడిగా నిర్ణయం అవుతాయి. ఉద్యమ కేంద్రంగా ఫలానా ప్రాంతం అని నిర్ణయం అయినాక దానికి మద్దతుగా తమతమ ప్రాంతాలలో కార్యక్రమాలు ప్రారంభం అవుతాయి. ప్రత్యక్షకార్యాచరణలో వందలు వేల మహిళలు, పిల్లలు, పురుషులు పాల్గొంటారు. దేరాలు వేసి అక్కడే వంటవార్పు మొదలెడతారు. పోలీసులు బెదిరిస్తే సమీపంలోని మురికివాడలనుండి

వందలాదిమంది ఈ శిబిరాల్లోకి వచ్చి చేరతారు. చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధమైతే పికెటింగ్‌లో పాల్గొనేవారందరికీ చర్చల్లో భాగస్వాములయ్యే అవకాశం వుండాలని డిమాండ్ చేస్తారు. ఉద్యమ నిర్వహణకు సంబంధించిన అన్ని నిర్ణయాలు కార్యాచరణ కేంద్రం వద్దే అందరి సమక్షంలో తీసుకొంటారు. ఒక పికెటర్ చెప్పిన మాటల్లో " ఒంటరిగా చర్చలకు వెళ్లినవారికి తృణమో ఫణమో లేదా ఉద్యోగమో ఆశ చూపించి లోబర్చుకోవటంతో" నిరసనకారులు నిరాశకు గురయ్యేవారు. ఈ అనుభవం నుండి ఒంటరి చర్చలకు వీరు సిద్ధం కావటం లేదు. ఈ విధమైన చర్చలద్వారా వచ్చిన ప్రయోజనాలు, ఉపాధి అవకాశాలు ఉమ్మడి నిర్ణయాల ద్వారా కుటుంబ అవసరాల ప్రాతిదికన, ఉద్యమంలో క్రియాశీలక పాత్ర ఆధారంగా పంపిణీ అయ్యేవి. ఉద్యమంలో పాల్గొన్న నిరుద్యోగులకంటే తక్కువ ఉద్యోగాలకు అవకాశాలు వస్తే వంతులవారీగా పంపకం ఉంటుంది. ఇక్కడకూడా నాయకులు, వ్యక్తులు ఒంటరిగా ఈ ఉద్యమ ఫలాలు పంపిణీ చేస్తే ఇవి ఆయా కుటుంబాల స్వంతం కావటంతోపాటు మొత్తం ఉద్యమాన్ని పక్కదారి పట్టించేందుకు లబ్ధి పొందిన కొద్దిమంది ప్రయత్నిస్తారని ప్రజలు తెలుసుకున్నారు. ఈ ఉద్యమం విజయం సాధించటానికి రవాణాకు అంతరాయం కల్గించే ఎత్తుగడలు కూడా ముఖ్యకారణం. ఆచరణరీత్యా ఈ రూపం ఫ్యాక్టరీలో కార్మికుడు పనిమానేయటంతో సమానం. అంతేకాక ఈవిధమైన ఆటంకం కల్గించటం ద్వారా ఉత్పత్తికి అవసరమైన ముడివనరులు పరిశ్రమకు చేరకుండా అడ్డుకోవటంతో ఉత్పత్తికి ఆటంకం కల్గించవచ్చు. ఉత్పత్తయిన సరుకులు గమ్యస్థానానికి చేరకుండా నియంత్రించవచ్చు. మురికివాడలకు సమీపంలో వాహనాలు నిలిపివేయటం ద్వారా ఈ వాహనాల లైట్లతో ఇళ్లల్లోపనులు చక్కబెట్టుకునే అవకాశం కలిగేది. ఈ ఉద్యమంలో పాల్గొనేకార్యకర్తలు ఉపన్యసించటానికి, డిమాండ్లు చేయటానికి వెనుకాడరు. మిగిలిన వాళ్లుకూడా సామూహిక ఆందోళనలో, సమీపంలో భారీ సమీకరణతో జరిగే ఆందోళనలో భాగస్వాములయ్యేందుకు సిద్ధమయినప్పటికీ మాట్లాడాలంటే వారికిబెరుకుగా ఉండేది. కానీసాధారణ ప్రజలు కొద్దిగా బెరుకుతనం ప్రదర్శించినా ఉద్యమనాయకులను అరెస్టు చేసేటప్పుడు వీరోచితంగా అడ్డుకునేవారు. సామాజిక అశాంతి, పేదరికం, అవకాశవాద వ్యవహారాలను మౌనంగా భరించేవారు శక్తివంతమైన సంఘీభావ ఉద్యమం చెంతకు చేరాక, స్వయంప్రతిపత్తి గలిగి ప్రాథమికస్థాయిలో ఆందోళనలో భాగస్వాములయ్యాక, తమంతటతాము రాజకీయాలకు పరిచయం అయ్యాక మహాశక్తి సంపన్నులవుతారు.

విస్తృతమైన కోర్కెలు

రాష్ట్రప్రభుత్వ నిధులతో స్థానికంగా నిర్వహించే ఉద్యోగాల సాధనతోపాటు ఆహార పదార్థాల పంపిణీ, జైల్లో ఉన్న వందలాదిమంది నిరుద్యోగ ఉద్యమ కార్యకర్తలను విడుదల, నీటిసరఫరా, రోడ్లు, వైద్యరంగంలో ప్రభుత్వ పెట్టుబడులు వంటి డిమాండ్లు ఈ ఉద్యమం ముందున్నాయి. తాత్కాలిక ఉపాధి కల్పనతోపాటు శాశ్వమైన ఉపాధి, కనీసవేతన డిమాండ్లపైకూడా ఉద్యమం సాగిస్తోంది. జనరల్ మస్కోనిలో ఉద్యమ నాయకులు మూడువందల ప్రాజెక్టులకు సంబంధించి ప్రతిపాదనలు తయారు చేశారు. ఇందులో కొన్ని ప్రాజెక్టులు విజయవంతంగా నడవటంతోపాటు ఆహార సరఫరా, ఉపాధి కల్పన వంటి పనులు సాగిస్తున్నారు. ఇందులో బేకరీలు మొదలు తోటలు నిర్వహించటం వరకూ, నీటి శుద్ధి కేంద్రాల మొదలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వరకూ అనేకం ఉన్నాయి. అనధికారికంగా పట్టణాలు నిరుద్యోగ కార్మిక సంఘాల ద్వారా పాలించబడుతున్నాయి. స్థానిక మున్సిపల్ పాలనాయంత్రాంగాన్ని పక్కకు నెట్టారు. కొన్ని కార్మికవాడల్లో ఈ ఉద్యమం పాక్షిక విముక్తి కేంద్రాలు సృష్టించింది. ఇక్కడ సంఘటితమవుతోన్న ప్రజాశక్తి పాలనాయంత్రాంగాన్నిఅదుపులో ఉంచటమో, దానికంటే శక్తివంతంగా తయారుకావటమో జరగటంద్వారా ఆయా సమస్యలపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను సవాలు చేసే సితికి ఎదిగాయి. పరిమితంగానే అయినా సమాంతర

❀ ఈ చర్యలన్నింటిఫలితంగాగతనాలుగు సంవత్సరాలుగా దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రమైన స్తబ్దతకు లోనయ్యింది. ప్రజారోగ్య వ్యవస్థ, ప్రభుత్వ విద్యారంగం ఛిన్నాభిన్నమయ్యాయి. ప్రజాసేవలు కూడా ప్రైవేటీకరించటం వలన అర్జెంటీనా ప్రజల్లో అధికభాగం వారికి ఈ సేవలు అందుబాటులో లేకుండా పోయాయి. పన్నుల ఆదాయం పడిపోయింది. ప్రభుత్వ ఖజానా ఖాళీ అయ్యింది.

❀ పూర్తి స్థాయి సంక్షోభంలో కూరుకుపోయిన తర్వాత ఆదుకునేందుకు ఐఎంఎఫ్ తిరస్కరించటంతో ప్రభుత్వ రోజువారీ కార్యకలాపాలు సైతం గడవని దుస్థితి ఎదురయ్యింది. ఫలితంగా బిల్లులు చెల్లించేందుకు 350 కోట్ల డాలర్ల విలువైన పెన్షన్ నిధులు ప్రభుత్వం స్వాధీనం చేసుకొన్నది.

❀ అర్జెంటీనా సంక్షోభం అంతర్జాతీయ ఆర్థికవ్యవస్థలో పరిణామాలను పునఃపరిశీలించాల్సిన అవసరాన్ని ముందుకు తెస్తోంది. ఐఎంఎఫ్ ప్రపంచబ్యాంకులు ప్రారంభించిన సంస్కరణలన్నింటినీ పునఃసంస్కరించాలి.

ఆర్థికవ్యవస్థలు నడుస్తున్నాయి. ఈ పరిస్థితులు నిరుద్యోగుల జీవితాలు నిలపటమే కాక వాటిల్లో వెలుగులు నింపేందుకు కూడా పలు అవకాశాలను ముందుకు తెస్తోంది.

దేశవ్యాప్త డిమాండ్లు

స్థానిక, తక్షణ డిమాండ్లతోపాటు నిరుద్యోగ కార్మికోద్యమం సంక్షేమచర్యలకోసం డిమాండ్ చేయటంతోపాటు రుణచెల్లింపులురద్దుచేయాలని కూడా పట్టుబడుతోంది. నయాఉదారవాద విధానాలనుండి వెనక్కుమళ్లాలని, ప్రభుత్వజోక్యంతో ఆర్థిక వ్యవస్థలోకి తిరిగి రావాలని డిమాండ్ చేస్తున్నారు. మటాన్జా, లా ప్లాటాలో 2001 సెప్టెంబరు మొదటివారంలో నిరుద్యోగ సంఘాలు రెండు భారీ సమావేశాలు నిర్వహించాయి. కార్మిక, నిరుద్యోగ, విద్యార్థి, సాంస్కృతిక, ప్రభుత్వేతర సంస్థల ప్రతినిధులు రెండువేలమందికి పైగా ఈ సమావేశాలలో పాల్గొన్నారు. ఈ సమావేశాల ముఖ్యోద్దేశం వివిధ ప్రాంతాలలో జరుగుతున్న ఉద్యమాలను సంఘటితపర్చి పరస్పరం అవగాహనకు రావటంతోపాటు దేశవ్యాపిత కార్యాచరణకు పథకం తయారుచేయటం. లా పాటాలో జరిగిన సమావేశంలో ఆరు ప్రధాన డిమాండ్లపై ప్రతినిధులు అంగీకారానికి వచ్చారు. అవి... 1. సంస్థాగత సంస్కరణలను, జీరో లోటు విధానాలను తిరస్కరించటం, నిర్బంధించబడిన కార్యకర్తలపై న్యాయవిచారణకు అవకాశం కల్పించాలి. 2.ప్రభుత్వం ప్రతిపాదించిన పొదుపు బడ్జెట్‌ను ఉపసంహరించుకోవాలి 3. ప్రభుత్వ ఉపాధి పథకాలను ఆహార సరఫరాలను 16 ఏళ్లవయసున్నన్న నిరుద్యోగులందరికీ విస్తరించాలి. నిరుద్యోగ ఉద్యమ సంఘాల నిర్వహణలో ఉండేలా దేశవాప్త నిరుద్యోగుల నమోదు కార్యక్రమం చేపట్టాలి. 4. చిన్న మధ్యతరగతి రైతాంగం సేద్యం చేయటానికి వీలుగా హెక్టారుకు వందపెసోలు ఇవ్వాలి. 5. కాల్పులు విరమించాలి. 6. జనరల్ మస్కోని నుండి సాయుధ దళాలను ఉపసంహరించుకోవాలి. ఈ డిమాండ్ల సాధనకోసం సమావేశం సెప్టెంబరు నెలలోరెండు దేశవ్యాపితదిగ్బంధన కార్యక్రమాలకు పిలుపునిచ్చింది. దీంతోపాటుసమావేశం ఐదు వ్యూహాత్మకలక్ష్యాలను ప్రకటించింది. అ) అక్రమమైన మోసపూరితమైన విదేశీ రుణాన్ని చెల్లించరాదు. ఆ) పెన్షన్ నిధులపై ప్రభుత్వ నియంత్రణ ఉండాలి. ఇ) పేదరైతాంగం రుణాలు రద్దు చేయటంతోపాటు వ్యవసాయోత్పత్తులకు గిట్టుబాటుధర కల్పించాలి. ఈ) దేశ ప్రజలను ఆకలిచావులకు గురిచేస్తున్న పాలకులను గద్దె దించాలి. ఈ సమావేశంలోనే దేశవ్యాపితంగా 36గంటల సాధారణ సమ్మెకు పిలుపునిచ్చారు. అసంతృప్తికి లోనైన కార్మిక సంఘాలతో సహా కలిసివచ్చేవారినందరినీ కలుపుకుని దేశవ్యాపిత ఉద్యమనిర్వహణకై సెంట్రల్ డి ట్రాబాజదోర్స్ అర్జెంటీనియస్ (అర్జెంటీనా ఉద్యమ నిర్వాహక కేంద్ర సమన్వయ కమిటి) ఏర్పాటుకు కూడా పిలుపునిచ్చారు.

శక్తివంతమైన ఉద్యమం

నేడు ఈ ఉద్యమం లాటిన్ అమెరికాలో అర్జెంటీనాకు పర్యాయపదంగా మారింది. సాల్టా, జుయిజీ, మతనాజ్ వంటి నగరాల నుండి పేదరికంతో కునారిల్లుతున్న బ్యూనస్ఎయిర్స్ పరిసరాలకు, పరిశ్రమల మూతతో శ్మశాననైరాశ్యం నెలకొన్న కొర్డొబో, రోసారియా వంటి ప్రాంతాలకు కూడా విస్తరించింది. పైన పేర్కొన్న రెండు మహాసభలమాదిరే పలు స్థానిక సంఘాలు దేశవ్యాపిత సమాఖ్యలను ఏర్పాటు చేసుకొన్నాయి. వేలాదిమంది నిరుద్యోగులను సమీకరించి సంఘటితం చేయటంలోనే వీరి విజయం దాగి ఉన్నది. మహిళలు, వయోజనులు ఉద్యమంలో ముఖ్యపాత్ర పోషిస్తున్నారు. ఉద్యమంలో పాల్గొనేవారిలో 60శాతం వరకూ మహిళలు ఉంటారని అంచనా. ఫలితంగా కొన్ని రాయితీలు సంపాదించటం ఈ ఉద్యమానికి మరింత స్ఫూర్తిగా మారుతోంది. ఈ ఉద్యమ శక్తి నేటికీ స్థానిక సంస్థలు, ఇరుగుపొరుగు కమిటీలు, పరస్పరవిశ్వాసం, నిర్దిష్టడిమాండ్లే పునాదిగా కొనసాగుతోంది. అంతులేని సంస్థాగత సంస్కరణల వలయంలో చిక్కుకుపోయిన సమాజంలో బడ్జెట్ కోతలు, నామమాత్రపు వేతనాలతో ఉపాధి, అవినీతితో చితికిపోయిన వ్యవస్థలో ప్రత్యక్షకార్యాచరణకు పిలుపునివ్వటం ఈ ఉద్యమం ప్రత్యేకతగా ఉన్నది. ఈ విధానాలన్నింటికీ నిరుద్యోగకార్మికులే ప్రధానప్రత్యర్థులు. కనీస డిమాండ్లు నెరవేరేవరకూ నిరంతరాయంగా దిగ్బంధనానికి సిద్ధం కావటమే ఈ ఉద్యమం అనుసరించే ఏకైక ఎత్తుగడ.

టెర్రరిజం- కారణాలు, కోణాలు



తెలకపల్లి రవి

గత ఏడాది సెప్టెంబరు 11న న్యూయార్క్‌లోని డబ్ల్యుటిసి భవనాలపై టెర్రరిస్టుల విమాన దాడి తర్వాత ప్రపంచ వాతావరణం మారిపోయింది. డిసెంబరు 13న ఢిల్లీలో పార్లమెంటుపై దాడి అనంతరం మన దేశంలోనూ టెర్రరిజం గురించిన చర్చ కేంద్రస్థానం ఆక్రమించింది. సెప్టెంబరు 11 దాడికి కారకుడైన బిన్ లాడెన్ ఆఫ్ఘనిస్తాన్‌లో వున్నట్టు చెబుతూ ఆ దేశంపై అమెరికా యుద్ధ విమానాలతో విరుచుకు పడి విధ్వంసం సృష్టించింది. ఆ యుద్ధంలో దానికి సహకరించడానికి వాజ్‌పేయి ప్రభుత్వం ఉబలాటపడినా పాకిస్తాన్‌లో ముషరఫ్ సైనిక ప్రభుత్వ సహకారానికే అమెరికా ప్రాధాన్యత నిచ్చింది. అయితే పార్లమెంటుపై దాడికి ఆ పాకిస్తాన్ ప్రోత్సాహమున్నట్టు స్పష్టం కావడంతో పరిస్థితి మరో మలుపు తిరిగింది. ఇరు దేశాల మధ్య యుద్ధ వాతావరణం ఏర్పడింది. టెర్రరిజం ఎక్కడ వున్నా అణచేయాలని చెప్పిన అమెరికా పాకిస్తాన్ ఇండియా మధ్య దాగుడుమూతలాడుతున్నది.

అదే టెర్రరిజం, అవే దేశాలు. కాని అయిదు మాసాల వ్యవధిలోనే వచ్చిన ఈ మార్పులు ఈ సమస్యతో ముడివడి వున్న వివిధ కోణాలను చూపిస్తున్నాయి.

ఎన్ని రకాలు?

మతం, జాతి, ప్రాంతం, రాజకీయ సిద్ధాంతాలు, మాఫియా శక్తులు- ఇలా అనేకం చూస్తాం. మన దేశంలోనే హిందూ ముస్లిం సిక్కు మతోన్మాదాలు , ఈశాన్యప్రాంతంలో వేర్పాటువాద తీవ్రవాదాలు, బీహార్ వంటి చోట్ల భూస్వామ్య వర్గాల ప్రైవేటు సైన్యాలు, పీపుల్స్‌వార్ తరహా ఉగ్రవాదం, ముంబాయి మాఫియా దాడులు, అస్సాంలో ఉల్ఫా ఉగ్రవాదులు, బోడో తెగకు ఉగ్రవాదులు, త్రిపురలో గిరిజన గిరిజన వ్యతిరేక తీవ్రవాదాలు, ఆనంద మార్గ్ వంటి సంస్థలు అనేకం చూశాము. శ్రీలంకకు చెందిన ఎల్‌టిటిఇ కార్యకలాపాలకూ మన దేశం గురైంది. ఒక ప్రధాని, ఒక మాజీ ప్రధాని, ఒక ముఖ్యమంత్రి ఇంకా అనేక మంది రాజకీయ ప్రముఖులు ఉగ్రవాదానికి బలయ్యారు. పంజాబ్ ఉగ్రవాదం ఇరవై వేలమందిని బలిగొన్నట్టు అంచనా. కాశ్మీర్‌లో గత పదేళ్లలోనే అంత మంది ప్రాణాలు కోల్పోయారు. బాబ్రీ మసీదు కూల్చివేత అనంతరం ముంబాయిలో జరిగిన భయానక ప్రేలుళ్లలో 4000 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. అలాగే 1998లో కోయంబత్తూరు ప్రేలుళ్లు కూడా తీవ్ర సంచలనం కలిగించాయి.

మందుపాతరలు, బాంబు ప్రేలుళ్లు, కిడ్నాపులు, దాడులు, హైజాకింగ్‌లు, ఆత్మాహుతి దాడులు ఇలాటివి నిత్య జీవితంలో భాగమై పోయాయి. కమాండోలు, ప్రత్యేక దళాలు, కర్ఫ్యూలు, నిషేధాజ్ఞలు ఎన్ని వున్నా టెర్రరిజం నిర్మూలించబడకపోగా నానాటి తీవ్రరూపం దాలుస్తున్నది.

ఇటీవలి ఘటనల తర్వాత టెర్రరిజం అంటే ఇస్లామిక్ ఫండమెంటలిజం అనే అభిప్రాయం బాగా

వ్యాపింపచేశారు. ముస్లిములే ఇందుకు కారణమైనట్టు ప్రచారం జరుగుతున్నది. పాకిస్తాన్ గూఢచారి సంస్థ ఐఎస్ఐ మూర్ఖంగా సాగిస్తున్న వ్యూహం వల్ల జరుగుతున్న భారత వ్యతిరేక కార్యకలాపాలు కూడా ఈ అభిప్రాయం బలపడటానికి కారణమవుతున్నాయి. బిన్‌లాడెన్ ఐఎస్ఐ, ఇస్లామిక్ ఫండమెంటలిజం వంటి అంశాల తీవ్రతను గమనంలో వుంచుకుంటూనే టెర్రరిజం వివిధ కోణాలను, అందులో వివిధ శక్తుల పాత్రను అర్థం చేసుకోవాలి. క్లుప్తంగానైనా అలాటి పరిశీలనకు ఒక ప్రయత్నం ఇది.

టెర్రరిజం అంటే బల ప్రయోగంతో, బెదిరింపులతో పనులు జరిపించుకోవడం. కారణమేదైనా కావచ్చు. దాంట్లో సమాజానికి, ప్రజలకు పాత్ర వుండదు. ఒక వ్యక్తి లేదా ఒక బృందం పథకం ప్రకారం హింసాకాండ ,హత్యాకాండ సాగించడం ఇందులో ప్రధానాంశం.

మారిన రూపం

రాజరికాలు ఏర్పడిన తర్వాత ఆ రాజులకు వ్యతిరేకమైన వ్యక్తులు సంస్థలు రహస్యంగా పనిచేస్తూ కుట్రలు జరపడం. ప్రతీకారాలు తీర్చుకోవడం ఎప్పుడూ వుంది. మహాభారతంలో దుర్యోధనుడు తొడలు విరిగి పడడం చూసి సహించలేని అశ్వద్ధామ అందుకు ప్రతీకారంగా పాండవుల కుమారులైన ఉపపాండవులు అయిదుగురిని హతమార్చుతాడు. రాచరిక యుగంలో ఇలాటి ఘటనలే కాక తమ వ్యక్తిగత లేదా తెగ విశ్వాసాన్ని కాపాడు కోవడం కోసం లేదా దారి దోపిడీల కోసం రహస్యంగా పని చేసే సంస్థలు వుండేవి. కాని పెట్టుబడిదారీ విధానం పెరిగిన తర్వాతే టెర్రరిజం ఒకరూపంగా స్థిరపడింది. ఇందుకు రెండు కారణాలు. మొదటిది- ఆ వ్యవస్థ అమానుష స్వభావం పట్ల పెరిగే ఆగ్రహం. రెండు - సమాజంలో కొన్ని తరగతుల ను అది సృష్టించడం. ఇప్పటి పరిస్థితిని బట్టి మరో కారణం కూడా జోడించవచ్చు.

బానిస సమాజం నుంచి దోపిడీ వున్నా పెట్టుబడిదారీ విధానంలో అది అమానుషంగా సాగుతుంది. మనిషి యంత్రంగా మార్చివేయబడతాడు. ఆ వ్యవస్థలో అనివార్యంగా సంభవించే ఆర్థిక సంక్షోభాలు లక్షలాది మందిని వీధుల పాలు చేస్తాయి. నిరుద్యోగం, దారిద్ర్యం వల్ల యువకులు నిస్పృహలో కూరుకుపోతారు. ఏ పనీ లేకుండా అవారాగా తిరిగే అలగాజనం సంఖ్య బాగా పెరుగుతుంది. వీరినే సైద్ధాంతిక పరిభాషలో లంపెన్ అన్నారు. పెట్టుబడిదారీ విధానం డబ్బే సర్వస్వమనే సూత్రంపై ఆధారపడి పని చేస్తుంది గనక తన లాభం కోసం, స్వార్థం కోసం ఎలాటి శక్తులనైనా పెంచుతుంది. తనే సృష్టించిన లంపెన్‌ను తన అనధికార సైన్యంగా అది తయారు చేసుకుంటుంది. ఆధునిక ధనస్వాములు తమ వ్యాపార లావాదేవీల కోసం, కార్మికులను అణచివుంచడం కోసం గూండాలు నేరస్థ సమూహాలను పెంచి పోషించుతారు.

వ్యక్తిగత హింసావాదం

పెట్టుబడిదారీ విధానం గుత్తావతారమెత్తిన తర్వాత దేశాలను ఆక్రమించి సామ్రాజ్యవాదంగా మారింది. దాని క్రౌర్యం మరింత తీవ్రమైంది. అయితే ఇందుకు ప్రతిఘటనా మార్గం చూపే మార్క్సిజం వంటి సమగ్ర శాస్త్రీయ అవగాహనను మానవాళి ఆకళింపు చేసుకోవడానికి సమయం పట్టడం సహజమే. ఈ లోగా పెట్టుబడి దారీ దోపిడీతో, దేశాల ఆక్రమణతో ఆగ్రహించిన యువత పాలకులను, అధికారులను

నిర్మూలించడం అందుకు పరిష్కారమని భావించింది. అదే వ్యక్తిగత హింసావాదం. ప్రథమ సోషలిస్టు దేశమైన సోవియట్ సంస్థాపకుడు లెనిన్ అన్న కూడా జారు చక్రవర్తిని హత్య చేయడానికి ప్రయత్నించి ఉరి కంబమెక్కాడు. ఆ అనుభవం నుంచి లెనిన్ వ్యక్తిగత హింసావాదంలోని పొరబాటును ఎత్తి చూపి ప్రజల పాత్ర లేకుండా విప్లవాలు జయప్రదం కావని వివరించాడు. అయినా తర్వాత కాలంలోనూ అనేక దేశాలలో వలస పాలనను తిప్పికొట్టేందుకు టెర్రరిస్టు పద్ధతులను అనుసరించడం జరిగింది. మన దేశంలో భగత్‌సింగ్, ఆయన హిందూస్తాన్ సోషలిస్టు రిపబ్లికన్ ఆర్మీ ఇందుకు ఉదాహరణలు. అయితే భగత్‌సింగ్ కూడా వ్యక్తిగత హింసావాదంతో సమాజం మారదని గ్రహించారు.

జాతీయ విముక్తి ఉద్యమాలలోనూ ,వామపక్ష ఉద్యమాలలోనూ ఇలాటి ధోరణులు చాలా కన్పిస్తాయి.

సామ్రాజ్య వాద పాత్ర

1917లో రష్యా విప్లవం జయప్రదం కావడం సామ్రాజ్యవాద దేశాలకు చాలా భయం కలిగించింది. దాన్ని ఎలాగైనా కూల దోయాలని వారు అనేక కుట్రలు సాగించారు. ఆ లక్ష్యంతోనే హిట్లర్ ఫాసిజానికి మొదట సహాయపడ్డారు. ఆర్య జాతి గొప్పదనే సిద్ధాంతంతో యూదులను ఊచకోత కోయడం ఫాసిజం మూలసూత్రమైన కమ్యూనిస్టు వ్యతిరేకత దాని రాజకీయ సిద్ధాంతం. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఆస్ట్రియా 15 లక్షల మంది ఆర్మేనియన్లను ఊచకోత కోసినట్టే రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీలు కోటి ఇరవై లక్షల మంది యూదులను చిత్రహింసలు పెట్టి చంపారు. ఈ రెండు నరమేధాలు జాతి పరమైనవే. ఆఫ్రికాలో నల్లజాతివారి పైనా, అమెరికాలో స్థానిక ఇండియన్లు, నల్లజాతి బానిసల పైనా సాగిన అణచివేత కూడా ఈ కోవకు చెందినదే. అదే విధంగా క్రైస్తవ ఇస్లామిక్ మతాల మధ్య కూడా ఉద్రిక్తతలు చోటుచేసుకున్నాయి. అప్పటికే జీహాదులు క్రూసేడులు జరిగిపోయాయి. అరబ్ దేశాలలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటాలు సాగాయి. సోవియట్ యూనియన్ ఈ శక్తులకు చేయూత నిచ్చింది. ఉదాహరణకు ఇండియా నుంచి ఆఫ్ఘనిస్తాన్ వెళ్లి అక్కడ నుంచి రష్యా చేరుకున్న ముస్లిం యువకులు 1920లో భారత కమ్యూనిస్టు పార్టీ స్థాపించారు. మరికొన్ని అరబ్ దేశాలలోనూ సోవియట్ ప్రభావం పడింది.

ఏమైనా రెండవ ప్రపంచ యుద్ధంలో నాజీలపై సోవియట్ విజయం సాధించిన తర్వాత పరిస్థితి మారి పోయింది. ఆ విజయం ఫలితంగా సోషలిస్టులు, జాతీయ విముక్తి శక్తుల బలం పెరిగింది. సామ్రాజ్య వాదులు వలసలు ఖాళీ చేయవలసివచ్చింది. ఆ క్రమంలో నూతన స్వతంత్ర దేశాలకు సోవియట్ స్నేహితుడుగా గట్టిగా నిలబడి ప్రతిష్ట పెంచుకున్నది. ఈ పరిస్థితి సహించలేని అమెరికా సోవియట్ వ్యతిరేకత, కమ్యూనిస్టు వ్యతిరేకత ప్రధాన సూత్రంగా ప్రచ్ఛన్న యుద్ధం(కోల్డ్‌వార్) ప్రారంభించింది. ఈ కాలంలోనే కచ్చితంగా చెప్పాలంటే 1947లో సెంట్రల్ ఇంటలిజెన్స్ ఏజన్సీని ఏర్పరచింది. అమెరికా వ్యూహాన్ని ఇంకా చెప్పాలంటే సోవియట్ వ్యతిరేకతను పెంచడం దీని ప్రధాన లక్ష్యం. సిఐఎ కార్యకలాపాలలో రెండు రకాలు. ఓవర్ట్(బహిరంగ) కోవర్ట్(రహస్య). రెండో తరహాలో భాగంగా అది తనకు నచ్చని ప్రభుత్వాలకు వ్యతిరేకంగా కుట్రలను ప్రోత్సహించింది. కూలదోసింది. హత్యలు చేసింది. హత్యాప్రయత్నాలు సాగించింది. నియంతలకు అండనిచ్చింది. అదో రక్తసిక్త చరిత్ర. ఎందరో సిఐఎ మాజీ అధికారులే వివరాలతో సహా బయట పెట్టారు.

60 ,70 దశకాలు

60 వ దశకంలో ప్రపంచ పటం వేగంగా మారి పోయింది. ప్రతి చోటా సామ్రాజ్య వాదానికి ప్రతికూలత పెరిగింది. సోషలిస్టు శాంతికాముక శక్తుల ప్రభావం విస్తరించింది. అయితే అదే సమయంలో వాటిలో చీలికలూ, సిద్ధాంత విభేదాలూ వచ్చాయి. నూతన స్వతంత్ర దేశాలలో అధిక భాగం పెట్టుబడిదారీ విధానాన్నే అమలుపరచడంతో ప్రజల ఆర్థిక పరిస్థితులు దిగజారిపోయాయి. యువతలో అసంతృప్తి పెరిగింది. మరీ ముఖ్యంగా ఐరోపాలో పెట్టుబడిదారీ సంక్షోభం యువతను అసహనానికి గురి చేసింది. ప్రజలలో ఓపిగ్గా పనిచేసి కదిలించే బదులు ఉగ్రవాద మార్గాల వైపు వారు

కొట్టుకుపోయారు. ఆ విధంగా మన దేశంలో నగ్జలైట్లతో సహా అనేక చోట్ల వామపక్ష దుస్సాహసిక తీవ్రవాదం ప్రబలింది. ఇటలీ, జర్మనీ, జపాన్‌లలోనే గాక ప్రశాంత దేశాలుగా పేరు పొందిన స్కాండినేవియన్ దేశాలలోనూ ఉగ్రవాద సంస్థలు వెలిశాయి. విప్లవ పదజాలం చెప్పే ఈ సంస్థలకు సిఐఎ తోడ్పాటు లభించిందంటే ఆశ్చర్యం కలగవచ్చు.

70 వ దశకంలో పరిస్థితి మరింత మారింది. మన దేశంతో సహా అనేక చోట్ల అస్థిరతా శక్తులకు సామ్రాజ్యవాదం ప్రోద్బలమివ్వడం మొదలెట్టింది. హిందూ ముస్లిం మత కలహాల కాలాన్ని, గాంధీజీ హత్యను పక్కన పెడితే నాగాలాండ్ ఉగ్రవాదులు 1954లో చేసిన దాడులే మన దేశంలో తొలి టెర్రరిస్టు ఘటనలుగా చెబుతుంటారు. సామ్రాజ్యవాదం తొలుత ఆ ప్రాంతంపైనే కన్నువేసింది. ఈశాన్య భారతాన్ని ముక్కలు చేసేందుకు ప్రాజెక్టు బ్రహ్మపుత్ర తయారుచేసింది. పాకిస్తాన్ ఏర్పాటు నుంచి దాన్ని ఉపయోగించుకుంటూ కాశ్మీర్ సమస్యను రాజేస్తున్న అమెరికా 1972 బంగ్లాదేశ్ యుద్ధంలో ఇండియా సోవియట్‌తో స్నేహసంధి చేసుకున్నాక మరింత బాహాటంగా పాకిస్తాన్‌ను తన వ్యూహాత్మక స్థావరంగా చేసుకోవడం ప్రారంభించింది . 1978 ఆఫ్ఘన్ పరిణామాల తర్వాత ఈ ప్రమాదం మరింత పెరిగింది(ఆ వివరాలు మరోచోట చూద్దాం). ఖలిస్తాన్‌వాదులు కూడా కెనడా, బ్రిటన్, అమెరికాలనుంచి కార్యకలాపాలుల నడపడం మొదలు పెట్టారు. పాకిస్తాన్‌లో శిక్షణ పొందిన టెర్రరిస్టులు పంజాబ్, కాశ్మీర్‌లలో జొరబడి కల్లోలం సృష్టించసాగారు. పంజాబ్‌లో స్వర్ణ దేవాలయం భింద్రన్‌వాలే ఉగ్రవాద కేంద్రమైంది. 1984 చివరలో ఖలిస్తానీయుడు ఇందిరాగాంధీని హత్య చేశాడు. 1985 నుంచి సోవియట్ పట్టు తగ్గిపోతున్న కొద్దీ భారతదేశానికి వ్యతిరేకంగా ఉగ్రవాద కుట్రలు తీవ్రం కాసాగాయి. శ్రీలంక తమిళుల సమస్య విషయంలో అవకతవక విధానాలు ఎల్‌టిటిఇకి చోటు కల్పించాయి.

మాఫియాల హస్తం

ఇంకో ప్రధాన పరిణామం ఈ కాలంలో ప్రపంచ మంతటా సంభవించింది. ఉగ్రవాదులకు మాఫియా శక్తులకు మధ్య బ్రహ్మముడి బలపడటమే ఆ పరిణామం. మొదటి నుంచి కూడా స్మగ్లర్లు, ముఖ్యంగా మాదక ద్రవ్య వ్యాపారులతో నేర సామ్రాజ్యంతో ఉగ్రవాద ముఠాలకు సన్నిహిత సంబంధాలుంటాయి. ఉభయులకు ఆయుధాలు కావాలి. ఉభయులు రహస్యంగా పని చేయాలి. డబ్బు బాగా కావాలి. అందుకే మాఫియాలు ఉగ్రవాదులు కలసి పని చేస్తూ వచ్చారు. సిఐఎ ఈ వాస్తవం కూడ పట్టించుకోకుండా వాటికి సహకరించింది. నిజానికి కొన్ని చిన్న చిన్నదేశాలను అచ్చంగా మాదకద్రవ్యాల సాగు పైనే ఆధారపడేలా చేసింది. కాలక్రమంలో సంక్షోభం ఫలితంగా ప్రభుత్వాల పట్టు తగ్గే కొద్దీ మాఫియాల ప్రాబల్యం పెరిగి, చివరకు వాటికి ఉగ్రవాదులకు మధ్య తేడా అదృశ్యమయ్యే స్థితి ఏర్పడింది. ముంబాయి మాఫియా ఇందుకు ఒక ఉదాహరణ. పాశ్చాత్య దేశాలలో ఇది మరింత తీవ్ర స్థాయిన చూడగలం. ఆర్థిక సంక్షోభాలతో పాటే జాతుల మధ్య అశాంతి కూడా పెరిగింది. 70 వ దశకం ద్వితీయార్థంలో యూరోపియన్ దేశాలలో నయా ఫాసిస్టు సంస్థలు తామరతంపరగా విస్తరించాయి. అమెరికాలో నైతే కుక్లక్స్ క్లాన్ వంటి జాత్యహంకార సంస్థలు వెయ్యికి పైగా వున్నట్లు అంచనా. అసలు ఆ దేశాలలో ఆయుధాల అమ్మకం, శిక్షణ బహిరంగ కార్యక్రమాలు. కెనడాలో నైతే ఎవరైనా అవలీలగా ఆశ్రయం సంపాదించవచ్చు. అంతేకాక టెర్రరిస్టు సంస్థల కోసం నిధులు బహిరంగంగా సేకరించవచ్చు.

ఇస్లామిక్ తీవ్రవాదం

ఇక ప్రస్తుతం ప్రముఖంగా విన్పిస్తున్న ఇస్లామిక్ తీవ్ర వాదం విషయం. ఇంగ్లీషులో ఫండమెంటలిజం అని పిలవబడే ఈ వాదానికి ఖురాన్‌లోని మౌలిక విషయాలకు తిరిగి వెళ్లాలని అర్థం. నిజానికి ఇది క్రైస్తవమతం నుంచి స్వీకరించిన పదం. బైబిల్‌లోని ప్రాథమిక సత్యాలను ఆచరించాలని చెప్పేవారు దాన్ని ప్రవేశపెట్టారు. వలస పాలన దోపిడీ ప్రకోపించి పరిస్థితి దుర్భరంగా మారినపుడు సహజంగానే ఆ దేశాల ప్రజలలో ఇస్లామిక్ విలువల గురించిన దృష్టి పెరిగింది. జాతీయ విముక్తి కోసం పోరాడటంలో అది సానుకూల పాత్ర నిర్వహించింది. టర్కీలో కెమాల్‌పాషా అనేక ప్రగతిశీల సంస్కరణలు ప్రవేశపెట్టారు. తర్వాత కాలంలో పాలస్తీనా విమోచన పోరాటం పట్ల అమెరికా ప్రతికూలత, ఇజ్రాయిల్‌కు దాని వత్తాసు వల్ల అరబ్‌లలో

సామ్రాజ్య వాద వ్యతిరేకత పెరిగింది. ఈ చైతన్యానికి వ్యతిరేకంగా పనిచేయడానికే 1949నుంచి ఈజిప్టులో ఇస్లామిక్ బ్రదర్స్,పాకిస్తాన్‌లో జమాతే ఇస్లామీ ఏర్పడి పని చేయసాగాయి. ఈనేపథ్యంలోనే ఈజిప్టు అధ్యక్షుడు నాజర్, నెహ్రూ, టిటోలతో కలసి అలీనవిధానాన్ని ప్రారంభించారు. చాలా కాలం పాటు అరబ్‌దేశాలు సోవియట్‌కు స్నేహితులుగా అలీనోద్యమ సభ్యదేశాలుగా వ్యవహరించాయి. అతి పెద్ద ముస్లిం దేశమైన ఇండోనేషియాలో అత్యంత బలమైన కమ్యూనిస్టు పార్టీ అభివృద్ధి చెందింది. ఆ పార్టీనాయకుడు ఐదిత్ మరో వేదికపై దేశ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. ఇది సహించలేని అమెరికా సైనిక నియంత సుకర్నోకుట్రను ప్రోత్సహించి కమ్యూనిస్టులపై ఊచకోతకు కారణమైంది. ఇరాన్‌లో మోసాదిక్ ప్రభుత్వ సంస్కరణ విధానాలు గిట్టక ఆయనను కుట్రతో కూలదోసి రాజు షాను తెచ్చి గద్దెక్కించింది. 70వ దశకంలో ఈజిప్టు అధ్యక్షుడు సాదత్‌ను దువ్వి ఇజ్రాయిల్‌కు అనుకూలమైన ఒప్పందంపై సంతకాలు చేయించింది. గల్ఫ్‌లో సౌదీ అరేబియా వంటి పచ్చి అభివృద్ధి నిరోధక రాచరిక ప్రభుత్వాలన్నిటికి ప్రాపుగా నిలిచింది. ఇలాటి చర్యలు ఇస్లామిక్ దేశాలలో సామ్రాజ్యవాదం పట్ల వ్యతిరేకత పెంచాయి. అందుకు తగినట్టే అమెరికా ఒక దశలో అరాఫత్‌ను, మరో దశలో లిబియా నాయకుడు గడాఫీని, ఇంకో దశలో ఇరాక్ అధ్యక్షుడు సద్దాంను ప్రధాన శత్రువులుగా ప్రచారం చేసింది.

ఆఫ్ఘన్,ఇరాన్ పరిణామాల అనంతరం..

ఈ నేపథ్యంలో ఆఫ్ఘన్‌విప్లవం ఆమెరికాకు మొదటి దెబ్బ కాగా ఇరాన్‌లో ఖోమేనీ నాయకత్వాన విప్లవం జయప్రదం కావడం మరో కుదుపు. దాంతో ఇస్లామిక్ అభివృద్ధినిరోధకశక్తులను ప్రోత్సహించేందుకు అది బృహత్ ప్రణాళిక అమలు జరిపింది. ఆఫ్ఘనిస్తాన్‌కు చెందిన ప్రతీఘాత శక్తులను, ఇస్లామిక్ ఛాందసులను ఎక్కడెక్కడ నుంచి చేరదీసి సంఘటితపరచింది. అమెరికా అండలేక పోతే ఆఫ్ఘన్ ప్రతీఘాత శక్తులు అలా సమీకృతం కాగలిగేవి కావు. సోవియట్ నాయకత్వంలో కూడా అప్పుడే మార్పు రావడం దానికి వర ప్రసాదమైంది. గల్ఫ్ యుద్ధంతో ఈ పరిస్థితి పరాకాష్టకు చేరింది. ఆఫ్ఘన్‌లో తాలిబాన్లు అధికారం చేజిక్కించుకోవడానికి అమెరికా మొదట రెండుచేతులా సహకరించింది. బిన్‌లాడెన్ కూడా అలా పెరిగిన వాడే.

మాదక ద్రవ్యాలు

ఇదేకాలంలో మాదక ద్రవ్యాల వ్యాపారం కూడా ఊడల మర్రిలా విస్తరించింది. సామాజిక రాజకీయ సంక్షోభాలు, ఆర్థికదుస్థితి ప్రజలు మాదకద్రవ్యాలకు బానిసలయ్యేలా చేశాయి. వందల కోట్లకు పెరిగిన ఈ శక్తులు ప్రత్యామ్నాయ ప్రభుత్వాల స్థాయికి చేరాయి. పాకిస్తాన్‌తో సహా ఇస్లామిక్ దేశాలలో ఈ బెడద మరింత పెరిగింది.

సాంకేతిక అవకాశాలు

సాంకేతికంగా వచ్చిన మార్పులు కూడా టెర్రరిజం విపరీతంగా పెరగడానికి దారి తీశాయి. ఆర్.డి.ఎక్స్ , బెల్టు బాంబులు వంటివి ఆత్మాహుతి టెర్రరిస్టులను తయారు చేశాయి. ముందే చెప్పుకున్నట్టు యువత నిస్పృహకు ఇదీ ఒకనిదర్శనం. టెర్రరిజం విషవలయంలో వారు చిక్కుకు పోవడం కూడా మరో కారణం. తమ ప్రాణాలు కూడా బలి పెట్టి చంపడానికి విధ్వంసానికి సిద్ధమైన టెర్రరిస్టులను నిరోధించడం పెద్దసవాలు గానే మారింది. ఎల్‌టిటిఇ ఈ తరహాకు పేరు మోసినా అలాటి ఆత్మాహుతి దళాలు గలసంస్థలు మొత్తం 30 వున్నాయని అంచనా. రాజీవ్‌గాంధీహత్యతో మొదలు పెట్టి డబ్ల్యూటిసి ఘటన వరకు ఆత్మాహుతి దళాలు వున్నాయి.

అలాగే చిన్న చిన్న పరికరాలతో భయానక విధ్వంసం సృష్టించగల అవకాశం సాంకేతికాభివృద్ధి వల్ల కలిగింది. ఎకె 47 రైఫిళ్లు పోయి విమాన విధ్వంసక సామాగ్రి కూడా వారికి చేరింది. ఇవన్నీ అమెరికా ఏదో ఒకదశలో ఇచ్చినవే. తర్వాత తర్వాత మాఫియాలు కూడా వాటిని సమకూర్చుకోగలిగాయి. 60రోజుల తర్వాత పేలేవిధంగా కూడా అతి చిన్న విస్ఫోటకాలు అమర్చగల అవకాశమిప్పుడు వుంది.

గ్లోబలైజేషన్

గ్లోబలైజేషన్ కారణంగా దేశాల మధ్య పెరిగిన సమాచార సంబంధాలు మరో కారణం. సెల్‌ఫోన్లు ఈ మెయిల్స్‌తో రకరకాల వ్యాపార సంస్థల పేర్లతో టెర్రరిస్టు సంస్థలు ప్రపంచ వ్యాపితంగా అల్లుకు పోవడం ఇప్పుడు చాలా . తేలిక. బిన్‌లాడెన్ అల్‌ఖైదా ఈ విధంగానే పని



చేస్తోంది.

రాజకీయ సామాజిక కారణాలు

టెర్రరిజం వెనక ఎప్పుడూ అపరిష్కృత రాజకీయసమస్యలు లేదా మత జాతి సమస్యలు వుంటాయి. కాశ్మీర్, అస్సాం, పంజాబ్ రాజకీయ సమస్యలే. అవినీతి, అవకాశవాద రాజకీయాలు దాన్ని పెంచుతాయి. కాశ్మీర్‌లో కీలుబొమ్మ షా ప్రభుత్వం ఉన్న 85-86 కాలంలో టెర్రరిజం విపరీతంగా పెరిగింది. పంజాబ్‌లో భింద్రన్‌వాలే పెరగడానికి కూడా మొదట కాంగ్రెస్‌తోడ్పాటు వుంది. ఇలాటి ఉదాహరణలు చాలా ఇవ్వచ్చు. ఇస్లామిక్ దేశాల పట్ల సామ్రాజ్యవాదం వ్యవహరించిన తీరు కూడా రాజకీయమైందే. ఈ అసంతృప్తిని ఉగ్రవాద ప్రబోధకులు, సంఘ వ్యతిరేక శక్తులు ఉపయోగించుకుంటారు. వాటిని ఎదుర్కోవడంలో ద్వంద్వ ప్రమాణాలు పాటించడం ఆగ్రహాన్ని మరింత పెంచుతుంది.

ఏ తేడాలూ లేవు!

కొన్ని పరిస్థితులలో కొన్ని మతాలు ప్రాంతాల వారు ఉగ్రవాద కార్యకలాపాలకు పాల్పడినట్టు కనిపించినా నిజానికి ఈ సమస్య మత పరమైందే కాదు. ఐఎస్ఐ కి సహకరించినందుకు ముంబాయిలో ఎఎస్ శర్మ అనే పోలీసు కమీషనర్ తొలగించబడ్డాడు. ఇలాగే అనేక ఉదాహరణలున్నాయి. హవాలా కుంభకోణం బయట పడినప్పుడు అదే జైన్ సోదరులు కాశ్మీర్ ఉగ్రవాదులకు, బిజెపితదితరపార్టీలనాయకులకు పెట్టుబడులు పెట్టినట్టు వెల్లడైంది. ఇక్కడ డబ్బు ప్రధానం కాని మతం కాదు. మతాలమధ్య మంటలు పెట్టేరాజకీయాలు కూడా ఉద్రిక్తత పెంచి ఉగ్రవాదాన్ని పెంచడానికి దోహదపడతాయి. ఈశాన్య భారత ఉగ్రవాద ఘటనలలో క్రైస్తవ మిషనరీలు కొంత పాత్ర వహించాయి. శాంతికాముక మతమైన బౌద్ధమతాచార్యులే శ్రీలంకలో బండారనాయకేను చంపేశారు. కనుక మతాన్ని బట్టి ఈ సమస్యను నిర్ణయించడం సాధ్యం కాదు. ఐర్లాండులో క్రైస్తవ మతంలోని రెండు శాఖల మధ్య యుద్ధం కొనసాగుతున్నది. ఆ దేశాన్ని తొలి వలసగా చేసుకున్న బ్రిటన్‌స్థానికక్యాథలిక్కులకు వ్యతిరేకంగా ప్రొటెస్టంట్లను ప్రోత్సహించడంతో వారు ఐరిష్‌రిపబ్లికన్‌ఆర్మీగా ఏర్పడి టెర్రరిస్టు మార్గం చేపట్టారు. మతఛాందసం ఉగ్రవాదాన్ని రగిలించేఅవకాశం ఎప్పుడూ వుంటుంది. మతాన్నయినా, మాఫియాలనైనా ఉపయోగించుకునే శక్తులేమిటనేదే ప్రధాన సమస్య. అమెరికానే తీసుకుంటే ఇరాన్ ఇరాక్‌ల మధ్య యుద్ధంలో అది మొదట ఇరాక్‌నే సమర్థించింది. కుర్దులపై ఆ ప్రభుత్వ అణచివేతకు వంతపాడింది. కాని నికరాగ్వాలో వామపక్ష శాండినిస్టా ప్రభుత్వాన్ని కూలదోయడానికి విప్లవప్రతీఘాతకాంట్రాలకు నిధులు సమకూర్చేందుకు తన బద్ధశత్రువైన ఇరాన్‌కు ఆయుధాలు అమ్మి ఆ డబ్బు రహస్యంగా కాంట్రాలకు చేర్చింది!

సామ్రాజ్య వాద శక్తులు ముఖ్యంగా అమెరికా ప్రపంచవ్యాపితంగా ఇలాటి దుష్ట శక్తులకు అండదండలిచ్చింది. భస్మాసుర హస్తంలా అది ఇప్పుడు దాని నెత్తికే వచ్చింది. అయితే ఆ ప్రమాదాన్ని సాకుగా చూపి అన్ని దేశాలపై ఆధిపత్యం సాధించాలని తిష్టవేయాలని అది పాచికలు వేస్తోంది. అంతేకాక ఈ పేరుతో నిరంకుశశాసనాలు చేయించి తన ప్రపంచీకరణ పెత్తనానికి ప్రతిఘటన లేకుండా చేసుకోవాలనే దుర్బుద్ధి కూడా దానికి వుంది.

అందుకే అన్ని రకాల ఉగ్ర వాదాలను అన్ని రకాలు ఛాందసాలను ఖండించడంతో పాటు ఆధిపత్యానికి అర్రులు చాస్తున్న అమెరికా కూటమిని అడ్డుకోవాలి. లేకపోతే ప్రపంచానికే రక్షణ వుండదు. బిన్‌లాడెన్ రహస్య టెర్రరిజం కంటే బుష్ అధికారిక టెర్రరిజం తక్కువదేమీ కాదు.

అందుకే అన్ని ప్రభుత్వాలు అవకాశవాద పోకడలకు, అణచివేత విధానాలకు పాల్పడకుండా ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించడానికి, వారిలో విశ్వాసం పెంచడానికి చర్యలు తీసుకోవాలి. ముఖ్యంగా యువతకు ఉపాధి కలిగించాలి. బీభత్స చర్యలను అదుపు చేసేందుకు పాలనా చర్యలుతీసుకోవడంతోపాటు సామాజికరాజకీయ చర్యలు కూడా చేపట్టి ఉగ్రవాదానికి పునాది లేకుండా చేయాలి. అందుకు అవసరమైన అంతర్జాతీయ సహకారం తప్ప టెర్రరిజాన్ని అణచేసే పేరిట దాని మూల విరాట్‌లాటి అమెరికా పడగ నీడన చేరడం పెనం మీదనుంచి పొయ్యిలో పడినట్టవుతుంది. టెర్రరిజానికి సంబంధించిన సమస్యలలో ఇవి కొన్ని మాత్రమే. ఏమైనా ప్రజాతంత్ర శక్తులు, శాంతికాముక దేశాలు మరింత నిలదొక్కుకోవడం ద్వారానే ఈ సమస్యకు సమాధానం లభిస్తుంది.

ప్రజాస్వామ్యం - ప్రపంచీకరణ

కె.వీరయ్య

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్థిక రంగ సంస్కరణలతోపాటు పాలనాపరమైన సంస్కరణలు ప్రారంభించాయి. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే స్మార్ట్ ప్రభుత్వం, సుపరిపాలన (గుడ్‌గవర్నెన్స్) పేరుతో ఈసంస్కరణలు చేపట్టింది. దీనికిసంబంధించిన పూర్తి వ్యూహం గత ఏడాది ప్రభుత్వం విడుదల చేసిన "గుడ్ గవర్నెన్స్" శ్వేతపత్రంలో పొందుపర్చారు. కేంద్ర స్థాయిలో పాలనా సంస్కరణల గురించిన రూపురేఖలు ఐదవవేతన సంఘం నివేదికలో పొందుపర్చబడ్డాయి. గత సంవత్సరం రాష్ట్రాన్ని సందర్శించిన ప్రపంచవాణిజ్య సంస్థ, ప్రపంచబ్యాంకు అధ్యక్షులు కూడా కేవలం ఆర్థిక రంగంలో సంస్కరణలు ప్రారంభిస్తే చాలదని, రాజకీయరంగంలోనూ, పాలనా వ్యవహారాలలోనూ సంస్కరణలు అమలు చేసినప్పుడు మాత్రమే సమగ్రాభివృద్ధి సాధ్యమని ప్రకటించారు. కేంద్ర ప్రభుత్వం రూపొందించిన తొమ్మిదవ ప్రణాళిక మధ్యంతర సమీక్షలో "పరిపాలనా, న్యాయ సంస్కరణలు మొత్తం సంస్కరణల ఎజెండాలో అంతర్భాగమే" అని తేల్చి చెప్పారు. 2000 సంవత్సరంలో ప్రపంచబ్యాంకు విడుదల చేసిన వార్షికనివేదిక "దారిద్ర్యంపై దాడి' '(అటాక్ ఆన్ పావర్టీ)లో ప్రపంచవ్యాప్తంగా పేదరిక నిర్మూలనకు ఆర్థిక సంస్కరణలతోపాటు పాలనా పరమైనసంస్కరణలు ప్రారంభించాలని, పరిపాలన వికేంద్రీకరించటం తో పాటు సామాజిక కార్యక్రమాలకోసం కేవలం ప్రభుత్వాలపైనే ఆధారపడకుండా ప్రభుత్వేతర సంస్థలసహాయాన్ని తీసుకోవాలని ప్రకటించారు. వివిధ దేశాలకు రుణాలు ఇచ్చేముందు ఆయా దేశాలలో వికేంద్రీకరణ జరగాలనీ, రాజ్యాంగయంత్రం అధికారాలు కుదించాలని ఆదేశిస్తున్నారు. మరికొన్ని దేశాలలో ప్రజాస్వామిక ప్రభుత్వాలు ఏర్పాటు చేయటం అప్పుకు ముందస్తు షరతుగా ఉన్నది. ప్రపంచబ్యాంకు, దాని నిధులతో పుట్టి పెరిగిన కొన్ని స్వచ్ఛంద సంస్థలు, ప్రపంచీకరణ మేధావులు సూత్రీకరిస్తున్నట్లుగా పెట్టుబడిదారీ విధానానికి, ప్రజాస్వామ్యానికి విడదీయరాని బాదరాయణసంబంధం ఉన్నదా? ప్రజాస్వామిక వ్యవస్థ చట్రంలోనే పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందిందా? ప్రస్తుతం ప్రపంచబ్యాంకు ప్రతిపాదిస్తున్న పరిపాలనాపరమైన సంస్కరణలు ఎవరినుద్దేశించినవి? అన్న విషయాలు కొంత విపులంగా పరిశీలించాలి.

పెట్టుబడిదారీ విధానం - ప్రజాస్వామ్యం

ప్రజాస్వామ్యం, పెట్టుబడిదారీ విధానం మధ్య సంబంధం గురించి ప్రధానంగా రెండు వాదనలు ప్రచారంలో ఉన్నాయి.



ఒకటి ఈ రెండూ ఒకదాని అభివృద్ధికి ఒకటి దోహదం చేస్తాయనే వాదన కాగా మరోటి ఈ రెండూ పరస్పరం పూర్తి విరుద్ధ అంశాలనే వాదన. మొదటి వాదన ప్రకారం ప్రభుత్వాలు చేపడుతున్న సరళీకరణ విధానాలు ఆర్థిక శక్తులను ప్రభుత్వాల నియంత్రణ నుండి విముక్తి చేయటంద్వారా ఆర్థికాభివృద్ధికి దోహదపడుతుండగా రాజకీయ సరళీకరణ ఉత్పత్తి శక్తుల అభివృద్ధికి ముందస్తు చర్యగా ఉంటుంది. మరోరకంగా చెప్పాలంటే ప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థ పెట్టుబడిదారీ వ్యవస్థ ఆవిర్భావం, అభివృద్ధికి ప్రాథమిక షరతుగా ఉంటుంది. రెండవపక్షం వాదన ప్రకారం వివిధ సందర్భాలలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన వర్గపోరాటాలు, విప్లవ పోరాటాల వలన, పెట్టుబడిదారీ విధానం తన అసలు రూపాన్ని విడిచిపెట్టి ప్రజాస్వామిక క్రమానికి మారింది. ఈ రెండు వాదనలు చారిత్రకపరిశీలనకు నిలవటంలేదు. ఒక దేశంలో ఏ రాజకీయ వ్యవస్థను ఎంచుకోవాలి అనే సమస్య ఆయా దేశాలలోని పాలకవర్గాల దోపిడీ ప్రయోజనాలు ఏ రాజకీయ వ్యవస్థలో పదిలంగా ఉంటాయనే అంశం ప్రాతిపదికగా నిర్ణయమవుతోందనే వాస్తవాన్ని పై వాదనలు మరుగుపరుస్తున్నాయి.

పెట్టుబడిదారీ విధానం పుట్టి పెరిగి విశ్వవ్యాప్తస్వరూపం తీసుకొన్న చారిత్రకపరిస్థితులు, ప్రజాస్వామ్యం ఒక పాలనా వ్యవస్థగా ప్రపంచం ముందుకు వచ్చిన చారిత్రకనేపథ్యం వేరుగా ఉన్నాయి. క్లుప్తంగా చెప్పాలంటే సమాజాభివృద్ధికి భూస్వామ్య వ్యవస్థ గుదిబండగా పరిణమించిన నిర్దిష్ట చారిత్రక పరిస్థితులలో ఆ వ్యవస్థలోనే మొదలయిన పెట్టుబడిదారీ వర్గం భూస్వామ్యవర్గాన్ని కూలదోసి రాజ్యాంగయంత్రాన్ని స్వాధీనం చేసుకోవటంతో పెట్టుబడిదారీ వ్యవస్థ పాలకవర్గ వ్యవస్థగా ఆవిర్భవించింది. పెట్టుబడిదారీ వ్యవస్థలో రాజ్యాంగయంత్రం స్వభావం మారలేదు. భూస్వామ్య వ్యవస్థలో భూమిపై పెత్తనం చేసే కులీన వర్గాల ఆధిపత్యానికి రాజకీయ వ్యక్తీకరణే రాజరికపాలన, కాగా పెట్టుబడిదారీ వ్యవస్థలో పెట్టుబడిపై పెత్తనం చేసే కులీన వర్గాల ఆధిపత్యానికి రాజకీయవ్యక్తీకరణే నేడు మనం చూస్తున్న ప్రజాస్వామ్యం. రెండవ ప్రపంచ యుద్ధానంతరం పెరుగుతున్న సోషలిస్టు ప్రభావాన్ని నియంత్రించేందుకు అంతర్జాతీయ పెట్టుబడిదారీ వర్గం, దానికి నాయకత్వం వహిస్తోన్న సామ్రాజ్యవాదం ప్రజాస్వామ్యాన్ని మధ్యేవాద రాజకీయ వ్యవస్థగా ముందుకు తెచ్చింది. ఈ కాలంలోనే సంక్షేమరాజ్య భావన బలపడి విస్తరించింది. వ్యక్తి జీవితంలో ప్రభుత్వం పాత్ర పెరిగింది.

సాధారణ అర్థంలో ప్రజాస్వామ్యం అంటే అన్ని తరగతుల, వర్గాల ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే పాలన. కానీ ఆచరణలో ప్రజాస్వామ్యం పెట్టుబడిదారీ వర్గాల ఆధిపత్యాన్ని వ్యక్తీకరించే ఒకానొక సాధనంగానే మిగిలి పోయింది. పారిస్ కమ్యూన్, అక్టోబరు విప్లవం అనుభవాలతో వర్ధమాన దేశాల పాలక వర్గాలు కూడా మూసపోసిన కులీన వర్గాల పాలన స్థానంలో భిన్నవర్గాల ప్రాతినిధ్య ప్రభుత్వాలను ముందుకు తీసుకురావాల్సి వచ్చింది. ఈతరహా ప్రభుత్వాలలో బూర్జువావర్గం అయిష్టంగానే అయినా భూస్వామ్య వర్గానికి అధికారం పంచాల్సి వచ్చింది. కింది తరగతుల నుండి తమకు అనుకూలంగా ఉండే వారికి కొన్ని పదవులు కట్టబెట్టారు. తద్వారా అన్ని వర్గాల ప్రభుత్వం అని భ్రమలు కల్పించేందుకు ప్రయత్నించారు.

సారాంశంగా చూస్తే బూర్జువా వర్గం ఉనికికే ప్రమాదకరంగా మారిన సంక్షోభ దశను అధిగమించేందుకు పెట్టుబడిదారీ వర్గం ప్రజాస్వామ్యాన్ని హైజాక్ చేసింది.

పెట్టుబడిదారీ విస్తరణలో ప్రజాస్వామ్యం పాత్ర

పాలనా సంస్కరణల గురించి వస్తున్న వ్యాఖ్యానాలు, విశ్లేషణలు పరిశీలిస్తే ప్రజాస్వామ్యమే ఒక లక్ష్యమైనట్లు, ప్రజాస్వామ్యం సాధిస్తే మిగిలిన అన్ని సామాజిక అవసరాలు వాటంతట అవే నెరవేరేటట్లు వాదించటం గమనించవచ్చు. మానవజాతి ఇతిహాస క్రమంలో అంతిమ లక్ష్యం ప్రజాస్వామ్యమేనా? అయితే దాని రూపం, సారం, ఆచరణ ఎలా ఉండాలనే ప్రశ్నలకు వీరిదగ్గర సమాధానాలు లేవు. పెట్టుబడిదారీ వ్యవస్థ అభివృద్ధి క్రమంలో ప్రజాస్వామ్యం కేవలం ఒకమజిలీ మాత్రమే. పెట్టుబడిదారీ విధానం గురించి ఒక్కమాటలో చెప్పుకోవాలంటే అవధుల్లేని దోపిడీకి అవాంతరాలు తొలగించటమే. కానీ ఆధునిక ప్రజాస్వామిక వ్యవస్థలో ఈ తరహా అవధుల్లేని దోపిడీకి కొన్ని అవాంతరాలు ఉన్నాయి. ఆవిర్భావం నుండీ పెట్టుబడిదారీ వ్యవస్థ కులీన వర్గాల పాలనలోనే అభివృద్ధి చెందింది. విస్తరించింది. ఆధిపత్య భావజాలంగా ఎదిగింది. ఆధునిక యుగంలో చూస్తే 1960-80 మధ్య కాలంలో అమెరికా నేతృత్వంలో ప్రపంచవ్యాప్తం అయిన సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానం నియంతలనీడనే విస్తరించింది. రెండవ ప్రపంచ యుద్ధానంతరం సోవియట్ వ్యవస్థ మార్గదర్శిగా ప్రత్యామ్నాయ అభివృద్ధి పంథా ముందుకు వచ్చింది. ప్రజాదరణకు నోచుకొన్నది. ఈ పరిస్థితుల్లో స్వాతంత్ర్యం పొందిన వలసదేశాలు ఏ తరహా అభివృద్ధి మార్గాన్ని అనుసరించాలనే ప్రశ్న ఉత్పన్నమయ్యింది. దీంతో పాటు ఏ తరహా రాజకీయ వ్యవస్థను ఆమోదించాలనే ప్రశ్న కూడా ముందుకు వచ్చింది. ఈ పరిస్థితుల్లో ఆయా దేశాలలో విముక్తి పోరాటంలో ఏశక్తులు నాయకత్వ స్థానంలో ఉన్నాయనే అంశం ప్రాతిపదికన ఈ ప్రశ్నలకు పరిష్కారం లభ్యమయ్యింది. చైనా, క్యూబా, వియత్నాం, కొరియా, తదితర దేశాల విముక్తి పోరాటంలో సోషలిస్టు శక్తులు అగ్రభాగాన ఉండటంతో ఆయా దేశాలు సోషలిస్టు రాజకీయ వ్యవస్థను ఆమోదించాయి. మిగిలిన దేశాలలో అప్పుడే ఎదుగుతున్న బూర్జువా వర్గానికి సమర్ధవంతమైన రాజకీయ ప్రతినిధులు ఉండటంతో పెట్టుబడిదారీ వర్గాలకు అధికార మార్పిడి జరిగింది. ఫలితంగా ప్రపంచంలోని మెజారిటీ దేశాలు ప్రజాస్వామ్య వ్యవస్థలుగా ఆవిర్భవించాయి. ప్రాథమిక దశలో ఉన్న జాతీయ బూర్జువా వర్గం పలు దేశాలలో అభివృద్ధి చెందిగుత్తపెట్టుబడిదారీ వర్గంగా నిర్ణయాత్మక స్థాయికి ఎదిగింది. అంతమాత్రాన పెట్టుబడిదారీ విధానం విస్తరణకు ప్రజాస్వామ్యం కీలక దోహదకారిగా ఉన్నదనే నిర్ధారణకు రాలేము.

సామ్రాజ్యవాదం - ప్రజాస్వామ్యం

ప్రస్తుతం మనం చర్చించుకొంటున్న ప్రపంచీకరణ విధానాలు నిజానికి ఒక ప్రత్యామ్నాయ వ్యవస్థ కానేకాదు. పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాద విధానాలకు విస్తృతమైన కొనసాగింపే ప్రపంచీకరణ. అందువలన ప్రజాస్వామ్యం మధ్య గల సంబంధం చర్చించబోయే ముందు సామ్రాజ్యవాదం ప్రజాస్వామ్యం పట్ల ఏ వైఖరిని అవలంబించిందనే విషయం పరిశీలించాలి. సామ్రాజ్యవాదం ప్రజాస్వామ్యం పట్ల నిరంతరమూ ద్వేషభావాన్ని వెళ్లగక్కుతూనే ఉన్నది. ఎక్కడ తన ప్రయోజనాలకు, ప్రాపంచిక వ్యూహాలకు ఆటంకాలు ఎదురైనా అక్కడ ఎటువంటి ప్రభుత్వాలు ఉన్నాయి అన్న దాంతో నిమిత్తం లేకుండా నిరంకుశ ప్రభుత్వాలను నెలకొల్పటంలో వీరికి సుదీర్ఘమైన చరిత్రే ఉన్నది. మచ్చుకు కొన్ని ఉదాహరణలు ఇలా ఉన్నాయి.

1964లో బ్రెజిల్‌లో ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చిన గోలార్ట్ ప్రభుత్వం ప్రమాణ స్వీకారం చేసిన కొద్దిగంటలకే కూల్చివేయబడింది. బ్రెజిల్ సైన్యాధికారులు ఈ కుట్రకు నేతృత్వం

> "ప్రస్తుతం మనం చర్చించుకొంటున్న ప్రపంచీకరణ విధానాలు నిజానికి ఒకప్రత్యామ్నాయ వ్యవస్థ కానేకాదు. పెట్టుబడిదారీ విధానపు అత్యున్నత దశ అయిన సామ్రాజ్యవాద విధానాలకు విస్తృతమైన కొనసాగింపే ప్రపంచీకరణ."

వహించారు. ఇక్కడ ఆసక్తికరమైన విషయమేమంటే ఈ కుట్ర జరగటానికి కొద్దిసమయం ముందుగా అప్పటి అమెరికా అధ్యక్షుడు లిండా జాన్సన్ నుండి సైన్యాధికారులకు ఒక టెలిగ్రాం వచ్చింది. బ్రెజిల్‌లో ప్రజాస్వామ్యాన్ని పునరుద్ధరించాలనేది ఆ టెలిగ్రాం సారాంశం! ఫిన్లాండ్‌లో 1918లో కమ్యూనిస్టు పార్టీ నేతృత్వంలో అధికారానికి వచ్చిన నూతన ప్రభుత్వం రష్యా దారిలో ఆస్తులు జాతీయం చేయటం ప్రజల జీవన ప్రమాణాలు మెరుగు పర్చటం, భూస్వాముల నుండి భూమిని స్వాధీనం చేసుకోవటం వంటి చర్యలు చేపట్టగా దీన్ని దించేసి పెట్టుబడిదారీ వర్గాల అనుకూలుడైన మనర్‌హీం ప్రభుత్వాన్ని గద్దెనెక్కించారు. ఈ కర్తవ్యాన్ని జర్మన్ సైన్యం సహాయంతో పూర్తి చేశారు. 1953లో గయానాలో ప్రజలు సోషలిస్టుగా ఉన్న చెడ్డీ జగన్‌ను ప్రధానిగా ఎన్నుకున్నారు. జగన్ బహుళజాతి కంపెనీలపై ఆంక్షలు విధించి భూపంపకానికి పూనుకొన్నాడు. దీంతో సంవత్సరం కూడా పూర్తికాని జగన్ ప్రభుత్వం స్థానంలో కొత్త ప్రభుత్వం అధికారానికి వచ్చింది. తిరిగి జగన్ 1961లో అధికారానికి వచ్చినా ఇదే గతి పట్టింది. చివరకు బ్రిటన్ దళాలు జోక్యం చేసుకొని జగన్‌స్థానంలో బర్న్‌హాంపదవి చేపట్టాడు. దీనికిగాను గయానా రాజ్యాంగాన్ని పూర్తిగా మార్చి వేశారు. గవర్నర్ల చేతుల్లో కీలకాధికారాలు పెట్టారు. నియంతృత్వ రాజ్యాంగయంత్రాన్ని ప్రతిష్టించారు. గయానా వాసుల మధ్య కలతలు రెచ్చగొట్టారు.

ఈ ఉదాహరణలలో అత్యంత ప్రముఖమైనది, ప్రపంచం దృష్టిని ఆకర్షించింది చిలీ ఉదంతం. 1970లో చిలీ విప్లవనేత సాల్వెడార్ అలెండీ నేతృత్వంలో ఎన్నికైన ప్రభుత్వాన్ని గద్దె దించేందుకు అమెరికా సహకారంతో చిలీ బూర్జువాలు చేయని దురాగతం లేదు. అలెండీ ప్రభుత్వంలో కీలక అధికారుల హత్యలు మొదలు అధ్యక్షభవనంపై దాడి, అలెండీ హత్య వరకూ సిఐఏ కుట్రల పురాణం చెబితే చాలా ఉన్నది. అలెండీ ప్రభుత్వంపై అమెరికా అంతగా విరుచుకుపడటానికి కారణం అలెండీ నియంతృత్వం ద్వారా అధికారానికి రావడం కాదు. ప్రజాస్వామ్యాన్ని కాలరాసి పగ్గాలు చేపట్టిన వాడు అంతకంటే కాదు. అధికారానికి వచ్చిన వెంటనే అమెరికా బహుళజాతి సంస్థల ఆధీనంలోని రాగిగనులను జాతీయం చేయటం, విదేశీ పెట్టుబడిదారుల చేతుల్లోని భూములను పేదలకు పంచటమే అమెరికా ఆగ్రహానికి ప్రధాన కారణాలని తరువాతి కాలంలో చరిత్ర రుజువు చేసింది. అలెండీని హత్య చేయటమేకాక నరరూపరాక్షసునిగా పేరుతెచ్చుకున్న పినోచెట్‌ను అధికారానికి తీసుకొచ్చి 10 ఏళ్లవరకూ అతన్ని కదిలించవీలులేకుండా రాజ్యాంగాన్నేమార్చేశారు. ఈ పదేళ్లలో చిలీ చట్టసభ అధికారాలు కుదిస్తూ ఈ సైనిక నియంతలు ఆదేశాలు జారీచేయటం మొదలు కీలకమైన నిర్ణయాలు, బడ్జెట్ గురించిన ఆదేశాలు అన్నీ అమెరికా నుండే అందేవి. ప్రజాస్వామ్యం గురించి సామ్రాజ్యవాదులు చెప్పే మాటలు దాని వెనుక గల అర్థాలు తెలుసుకొనేందుకు ఆసియాలో ఇరాన్ ఉదంతం కూడా ఉపకరిస్తుంది. 1950 దశకంలో అధికారానికి వచ్చిన జాతీయవాది మొస్సాదిగె ఇరాన్‌తో చమురువాణిజ్యం చేస్తున్న ఆంగ్లో అమెరికా చమురు కంపెనీలపై ఆంక్షలు విధించాడు. దీంతో సిఐఏ రంగంలోకి దిగి కుట్రల పర్వానికి తెరతీసింది. మొస్సాదిగెను పదవీచ్యుతుడ్ని చేసి అమెరికా బంటుగా ఉన్న షా పహల్వీని గద్దెనెక్కించారు. ఇటు వర్ధమాన దేశాలలోనే కాక బాగా అభివృద్ధి చెందిన దేశాలలో సైతం ఈ రకమైన తిరుగుబాట్లు, కుట్రలు ప్రజాస్వామిక ప్రభుత్వాల కూల్చివేతలు నిరంతరాయంగా జరిగాయి. కమ్యూనిస్టుల పట్టున్న జర్మనీలో బూర్జువాలు ఎన్నికల ద్వారా అధికారానికి వచ్చేందుకు సిద్ధం కాకపోవటంతో హిట్లర్ రూపంలో నిరంకుశ బూర్జువా పాలనకు తెరతీశారు. అలాగే స్పెయిన్‌లో సోషలిస్టు ప్రభుత్వాన్ని కూల్చేసేందుకు ఏకంగా సామ్రాజ్యవాదులు అంతర్యుద్ధాన్నే ప్రారంభించారు. ఇటలీలోనూ ఇదే పరిస్థితి.

ఈ జోక్యానికి కారణం ఏమిటి?

ప్రపంచవ్యాప్తంగా సామ్రాజ్యవాదం ఇంత విచ్చలవిడిగా జోక్యం చేసుకోవటానికి గల కారణాలు పరిశీలిస్తే వాటిని ఈ విధంగా క్రోడీకరించవచ్చు. సామ్రాజ్యవాదం తనకంటూ నిర్దిష్ట ప్రాపంచిక ఆర్థిక రాజకీయ సాంస్కృతిక విధానాలు వర్గ

ప్రయోజనాలు కలిగి ఉన్నది. సంపన్న దేశాలలోని వేళ్లమీద లెక్కించగలిగిన బహుళజాతి కంపెనీల ప్రయోజనాలే ఈ విధానాలను ఖరారు చేస్తాయి. పైన పేర్కొన్న వివరాలలో ఎక్కడ ఏ బహుళజాతి కంపెనీ దోపిడీ ప్రయోజనాలకు విఘాతం కలిగినా వారికి అండగా సామ్రాజ్యవాదం నిర్వహించే ఆధిపత్యవర్గ పోరాటంలో అంతర్భాగమే ఈ ప్రభుత్వాలను మార్చటంగా చెప్పుకోవచ్చు. పైన చెప్పిన దేశాలన్నీ అటు అమెరికా నేతృత్వంలోని సామ్రాజ్యవాద విధానాలను తిరస్కరించటమో, లేక ఆయా దేశాలలోని దోపిడీ వర్గాలను కూలదోయగల శక్తుల ఎదుగుదలకు అవకాశమివ్వటమో, లేదా జాతీయ వనరులపై బహుళజాతి కంపెనీల ఆధిపత్యానికి చరమగీతం పాడటమో, సామ్రాజ్యవాద ప్రపంచ వ్యూహంలో భాగస్వాములయ్యేందుకు తిరస్కరించటమో చేయటం మనం గుర్తించవచ్చు. ఈ పరిస్థితుల్లో తమ ఆధిపత్యాన్ని నిలుపుకునేందుకు చేసే ప్రయత్నాలలో భాగమే ఒకప్పుడు తామే అమోఘం అని పొగిడిన ప్రజాస్వామ్య వ్యవస్థలను, నాయకులను కూలదోసేందుకు, సాధ్యంకాకపోతే హతమార్చేందుకు వెనకాడలేదు. ఈ క్రమంలో దోపిడీ ప్రయోజనాలకు తప్ప వాగ్దానాలు, హామీలు, నీతినియమాలు, సాంప్రదాయాలకు తావు లేనేలేదు.

ప్రభుత్వాల పాత్రను తిరగదోడే ప్రయత్నం

ప్రపంచీకరణ వాదులు ముందుకు తెస్తున్న ఈ పాలనా సంస్కరణలు స్థూలంగా తమ ఆధిపత్యాన్ని విస్తరించేందుకు బహుళజాతి కంపెనీలు వాటి ప్రయోజనాలకు పెద్దపీట వేస్తున్న అంతర్జాతీయ ద్రవ్యసంస్థలు ముందుకు తెచ్చిన విధానాలే. ఈ సంస్కరణలు అమలు చేయటం అంటే ప్రజాస్వామిక వ్యవస్థ రూపం మార్చకుండా ప్రభుత్వాల స్వభావాన్ని, పాలనా వ్యవస్థను తిరగదోడటమే. ఇంతకు ముందే వివరించినట్లు గత అర్ధశతాబ్దికాలంగా ప్రజాస్వామ్య ప్రభుత్వం, సంక్షేమరాజ్యం ఒక బలమైన భావనగా రూపుదిద్దుకున్నది. సమాజపరిణామ క్రమంలో భాగంగా విస్తరిస్తున్న వ్యక్తి జీవితానికి సమాంతరంగా ప్రభుత్వం, దాని కార్యకలాపాలు విస్తరించాయి. ఫలితంగా సంక్షేమప్రభుత్వాల కర్తవ్యం కూడా పెరిగింది. పాలనాయంత్రాంగంలో కేవలం పోలీసు, ఆర్థిక శాఖలే కాక వైవిధ్యభరితమైన అవసరాలు తీర్చేందుకు వేరువేరు శాఖలు అవసరమయ్యాయి. ప్రభుత్వం పాత్రతో పాటే పాలనాయంత్రాంగం విస్తరించింది. ప్రత్యక్షంగానో, పరోక్షంగానో వ్యక్తిజీవితాన్ని ప్రభుత్వం నియంత్రిస్తోంది. దీనికి గాను అందుబాటులో ఉన్న జాతీయవనరులు, సంపదలపై యాజమాన్యం వ్యక్తుల నుండి రాజ్యానికి బదలాయించబడింది. దాంతోపాటే వ్యక్తి జీవితంలో ప్రభుత్వం ఆర్థిక సహాయసహకారాలు కూడా అందించాల్సి వచ్చింది. సామాజికంగా అణగారిన వర్గాలకు రాయితీలు ఇచ్చి ఇతరులతో సమానంగా ముందుకు తేవాలి అన్న వాదం ఇందువల్లే ముందుకు వచ్చింది. మన దేశంలో ఆర్థికరాయితీలు, రిజర్వేషన్లు దీనికి ఆచరణ రూపాలు. అందువల్లే సంక్షేమ ప్రభుత్వ భావనను వర్ణించేటప్పుడు రాజనీతి శాస్త్రవేత్తలు 'పుట్టింది మొదలు తుదిశ్వాస విడిచే వరకూ" (ఫ్రం వూంబ్ టు టోంబ్) ప్రజల జీవితాన్ని ప్రభావితం చేస్తుందని చెప్తారు.

ఈ సంక్షేమరాజ్య భావనలోని ప్రజాతంత్ర, పురోగామి విధానాలకు మూలాలు 17,18 శతాబ్దాలలో కరుడుకట్టిన పెట్టుబడిదారీ విధానం, దాని అమానుషమైన దోపిడికి వ్యతిరేకంగా సాగిన కార్మిక, ప్రజా, సామాజికోద్యమాలలో ఉన్నాయి. అప్పట్లో కార్మికులు 12 గంటల మొదలు 18గంటలు పని చేయాల్సివచ్చేది. ఓటుహక్కు మొదలు నేడున్న అన్ని రకాల పౌరహక్కులు కులీన వర్గాలకే పరిమితం అయ్యాయి. సంపదపైనా, జాతీయ వనరుల వినియోగంపైనా ప్రభుత్వాలకు ఎటువంటి పాత్ర లేదు. కేవలం కులీనవర్గాల ప్రయోజనాలు కాపాడే లక్ష్యంతో శాంతిభద్రతల సమస్య, పన్నులు వసూలు నాటి ప్రభుత్వాల ప్రధాన కర్తవ్యాలు. అందువల్లే దీన్ని పోలీస్ రాజ్యం అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదిస్తున్న పాలనా సంస్కరణల అంతిమ సారాంశం వ్యక్తి జీవితంలో ప్రభుత్వం పాత్రను పరిమితం చేయటం. అందువల్లే ప్రభుత్వాలు తొలుత పాలనా యంత్రాగాన్ని కుదించే చర్యలు చేపట్టాయి. ఒకసారి ఈ కుదింపు జరిగితే ఏర్పడే ఖాళీని సంపదపై ఆధిపత్యం కలిగిన వర్గాలు భర్తీ చేస్తాయి. అందుకు గాను వారికి ప్రజలు సుంకం చెల్లించాలి. రాష్ట్రప్రభుత్వం ప్రతిపాదించిన యూజర్ ఛార్జీలకు పునాదులు ఈ తార్కిక విశ్లేషణలోనే ఉన్నాయి.

పాలనాయంత్రాగాన్ని కుదించటం, జాతీయవనరుల నిర్వహణ నుండి ప్రభుత్వపాత్రను తొలగించటం అంటే సమాజంలో మధ్యయుగాల నాటి కులీనవర్గాల అంతులేని దోపిడీకి దారులు వేయటమే. సంక్లిష్టమైన సామాజిక సంబంధాలలో అసమతౌల్యానికి తద్వారా నిరంతర అశాంతికి తెరతీయటమే. "ప్రభుత్వం నిర్ణయాత్మక పాత్ర పోషించదు. కేవలం సహకారిగానే ఉంటుంది" (గవర్నమెంట్ ఈజ్ నాట్ ఏ ప్రమోటర్. ఓన్లీ ఫెసిలిటేటర్) "ప్రభుత్వం ఎటువంటి ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించదు. శాంతిభద్రతలకే పరిమితం అవుతుంది" అన్న బాబు గారి సిద్ధాంతానికి తార్కిక ముగింపు (లాజికల్ కంక్లూజన్) ఇదే. ఇక్కడ వ్యక్తి అవసరాలు, సామాజిక శాంతి అన్న మాటలకు విలువే ఉండదు. ప్రభుత్వం శాంతి భద్రతలకు పరిమితం కావటం అంటే కర్ర ఉన్నవాడిదే గొర్రె అన్న విధానాలకు చట్టబద్ధత కల్పించటమే. ఇదే జరిగితే ఎనిమిది గంటల పనిదినాలు, వయోజన ఓటు హక్కు, అందరికీ విద్య, వైద్యం, గృహవసతి అనే ఆలోచనలకు చెల్లు చీటి ఇవ్వటం మినహా మరో గత్యంతరం లేదు. సమన్యాయపాలన, ప్రాతినిధ్య పాలన, ప్రాథమిక హక్కులు, విధులు వంటి రాజ్యాంగ నియమాలు నిలువెత్తు గుంటలో పాతరవేయటమే. అందువల్లే ఈ పాలనా సంస్కరణలకు వ్యతిరేకంగా జరిగే పోరాటం సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలకు, బహుళజాతి కంపెనీల ఆధిపత్యానికి, ప్రపంచబ్యాంకు విధానాలకు వ్యతిరేకంగా జరిగే పోరాటంలో అంతర్భాగమవుతాయి.

(జేమ్స్ పెట్రాస్ రాసిన "గ్లోబలైజేషన్ అన్‌మాస్క్‌డ్" ఆధారంగా)

సామ్రాజ్యవాదంపై అధ్యయనానికి మార్గదర్శి

(11వ పేజీ తరువాయి)

సూత్రాలు యధాతధంగా అనువర్తిస్తాయని నిర్ధారించారు. ఈ దశలో జాతీయ విముక్తి కోసం పోరాడే శక్తులను శ్రామిక వర్గం తోడుచేసుకోవాలనే అతి ప్రధానమైన ప్రతిపాదన చేశారు. ఇదిమరో రూపంలో ఇంటర్నేషనల్ తీర్మానంగా వచ్చింది. కార్మిక కర్షక ఐక్యత అనే భావాన్ని కూడా లెనిన్ పరిపుష్టం చేశారు. అన్నిటినీ మించి సామ్రాజ్యవాద అమానుష స్వభావాన్ని, యుద్ధాలు రగిలించేదాని లక్షణాన్ని విశ్లేషించారు. ఫైనాన్స్ పెట్టుబడి ద్వారా సామ్రాజ్య వాదం దేశాలపై ఎలా పెత్తనం చేసేది విశదపరచారు.

ఈ సిద్ధాంతీకరణల కోసం లెనిన్ తీసుకున్న శ్రమ, సేకరించిన సమాచారం సామ్రాజ్యవాదం.. అన్న ఈ పుస్తకం పొడుగునా మనకు కనిపిస్తాయి. ఆ రచన నేపథ్యాన్ని అందుకు ఆయన అనుసరించిన పద్ధతిని ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ ఉపోద్ఘాతంలో వివరించారు. గ్లోబలైజేషన్ యుగంలో ఫైనాన్స్ పెట్టుబడి స్వరూపంలో వచ్చిన మార్పులను విశ్లేషించారు. గతంలో వలె దేశాలను ఆక్రమించుకోవడం కోసం సామ్రాజ్య వాద దేశాలు యుద్ధాలకు పాల్పడక పోవడం అనే అంశాన్ని దృష్టిలో వుంచుకుంటూనే ఆ వైరుధ్యాల నూతన రూపాలను తెలియజేశారు. సోషలిజం సవాలును ఎదుర్కొనేందుకు పెట్టుబడిదారీ విధానం ఒకప్పుడు సంక్షేమ రాజ్యం అనే సిద్ధాంతాన్ని తెచ్చింది. ఆ అవసరం తీరిపోయింది కనుక ఇప్పుడు సంక్షేమచర్యలు అనవసరమని అంటోంది. గుత్తసంస్థల విస్తరణలో కొత్త దశ దేశాల ప్రభుత్వాల పాత్రను దాదాపు హుళక్కి చేస్తోంది. అయితే ప్రపంచీకరణ పెట్టుబడి ప్రయోజనాలను కాపాడేందుకు గాను అమెరికాకు అనధికార అంతర్జాతీయ నాయకత్వం అందిస్తున్నది. ఇలాటి కీలకమైన నూతనాంశాలతో ప్రభాత్ పట్నాయక్ రాసిన 35 పేజీల ఈ ఉపోద్ఘాతం దృష్టిలో వుంచుకుని చదివితే సామ్రాజ్యవాదం రచన అమూల్యప్రాధాన్యత పాఠకులు తెలుసుకోగలుగుతారు. మహోపాధ్యాయుల అంచనాలను ఆలోచనలను ఇప్పుడు ఎలా అర్ధంచేసుకోవాలనేది నమ్రతగా చూడవలసిన విషయమే కాని అపహాస్యానికి, తిరస్కారానికి గురి చేయడం సరికాదు. సహజంగానే అలాటి నిశితత్వం, నమ్రతల మేళవింపు అనదగిన ప్రభాత్ పట్నాయక్ శైలి ఆ బాధ్యత అమోఘంగా నిర్వహించింది. అనుభవజ్ఞులైన హరి పురుషోత్తమరావు అనువాదం ఆ క్లిష్ట విషయాన్ని తెలుగు పాఠకులకు సాధ్యమైనంత సుబోధకం చేయడానికి దోహదపడింది.

2001 సెప్టెంబరు 11 టెర్రరిస్టు దాడుల అనంతర పరిణామాల పూర్వరంగంలో సామ్రాజ్యవాద వ్యతిరేక సమరం మరింత తక్షణ కర్తవ్యంగా మన ముందుకొచ్చింది. ఆ పెనుభూతం పుట్టుపూర్వోత్తరాలు దృష్టిలో వుంటే గాని ఈ కర్తవ్య నిర్వహణకు న్యాయం జరగదు. లెనిన్ రచన అందుకు తొలి మెట్టు. సైద్ధాంతిక ప్రాతిపదిక.

-పీపీ

పోరాటమే మార్గం

(6వ పేజీ తరువాయి)

తెదేలను ఓడించేందుకు చేయాల్సిందంతా చేయాలి. విద్యుత్ ఉద్యమ సమయంలో వామపక్షాలు స్వతంత్రంగా ఉద్యమం నిర్వహిస్తూనేఅదేసమయంలో కాంగ్రెస్‌తో పిలుపులను సమన్వయ పరుచుకోవడం (సింక్రనైజేషన్) మంచి ఫలితాలనిచ్చింది. స్థానిక ఎన్నికల్లో తెలుగుదేశాన్ని ఓడించడానికి కాంగ్రెస్‌తో అవకాశమున్న చోట పోటీలు నివారించుకోవడం కూడాకొంతవ్వరకుఫలితాలనిచ్చింది. ఈఅనుభవాలను దృష్టిలో వుంచుకుని రానున్న కాలంలో నిర్దిష్టంగా వ్యవహరించాలని మహా సభ నిర్ణయించింది.

ఇక రెండవది, పార్టీ పునాది విస్తరణ జరగాలంటే నిర్దిష్టఅధ్యయనం, నిర్దిష్టపోరాటపద్ధతులు, నిర్దిష్టఎత్తుగడలు–వీటి ద్వారా పోరాటాలను ఉధృతం చేయడం, పోరాటాలను విస్తరించడం అత్యంత కీలకమైన విషయం. ఒక్కమాటలో చెప్పాలంటే పోరాటాన్ని పదునైన సాధనంగా మార్చుకోవడం ద్వారా మాత్రమే పార్టీ ముందుకు పోతుంది. గత నాలుగేళ్ల పార్టీ పోరాటానుభవాలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి.

సమాజంలో నేడు శీఘ్రగతిన మార్పులు సంభవిస్తున్నాయి. సామాజిక ఆర్థిక వైవిధ్యం విపరీతంగా పెరిగింది. సమాజంలో సంభవిస్తున్న ఆర్థిక సామాజిక పరిస్థితులపై నిర్దిష్ట అధ్యయనం జరపడం నేడు అత్యంత కీలక విషయమని మహాసభ స్పష్టంచేసింది. సామాజిక అధ్యయనం పెరిగితేనే స్థానిక సమస్యలపై పార్టీకి స్పందన పెరుగుతుంది. అప్పుడే ఉద్యమాలూ పెరుగుతాయి. స్థానికసమస్యలపైజోక్యం కూడా అప్పుడే పెరుగుతుంది. అంతే కాదు ఏ విషయం మీద పోరాడాలి, ఎవరిని సమీకరించాలి, నిర్దిష్టంగా ఏ పోరాట రూపం ఎన్నుకోవాలి అనేది కూడా నిర్దిష్ట అధ్యయనం మీద ఆధారపడి ఉంటుంది. అనంతపురం జిల్లాలో కూలీలకూ, రైతులకు పెద్దగా తేడా లేదు. కాని డెల్టా ప్రాంతంలో కూలీలు, కౌలుదార్లు,రైతుల మధ్య స్పష్టమైన విభజన రేఖ ఉంది. ఇటువంటి సామాజిక ఆర్థిక వైవిధ్యాలే రాష్ట్రంలో అన్నిచోట్లా కనిపిస్తాయి. వాటిని నిర్దిష్టంగా అధ్యయనం చేయడం ద్వారా మాత్రమే మనం ఆయా ప్రాంతాల్లో ఆయా సెక్షన్ల ప్రజల సమస్యలపై స్పందించగలం, పోరాటాలు నిర్వహించగలం. ఈ సందర్భంగా జిల్లాల్లో పార్టీ నాయకత్వాల నిర్దిష్టఅధ్యయనం చాలా తక్కువగా ఉన్న విషయాన్ని మహాసభ ఎత్తిచూపింది.

పోరాటాల విస్తరణకు స్థానిక సమస్యలపై స్పందించడంతో పాటు నిర్దిష్ట పోరాట పద్ధతులు అనుసరించడంకూడాఅతిముఖ్యమైనవిషయం. ప్రజలు కదిలే పద్ధతులు ఎన్నుకుని ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించాలి. ఒక సమస్యపై ఒక సారి ఆందోళన చేసి వదిలేయడంకాకుండా తగినంతకాలంనిరంతరాయంగా సమస్యలపై పోరాడాలి. అప్పుడే సమస్య పరిష్కారం అయినాకాకపోయినాపార్టీకృషిప్రజలమనసుల్లోనాటుకు పోతుంది. స్పాంటేనియస్‌గా ఉద్యమాలు లేవడం ఇటీవల ఎక్కువైంది. అలాంటి స్పాంటేనియస్ ఉద్యమాలన్నిటిలోనూ పార్టీజోక్యం చేసుకోవాలి. పట్టణ ప్రాంతాల్లో ప్రధానంగా స్థానికసమస్యల మీదకేంద్రీకరిస్తే గ్రామీణ ప్రాంతాల్లో భూమి, కూలి, కౌలు సమస్యలపై కేంద్రీకరించాలి. అలాగే నివాస ప్రాంతాల్లో ఉద్యమనిర్మాణానికి ప్రత్యేకంగా కేంద్రీకరించాలని మహాసభ పిలుపునిచ్చింది. ప్రజావ్యతిరేక విధానాల నుండి ప్రజల దృష్టి మళ్లించేందుకు, వారిని భ్రమ పెట్టేందుకు ప్రభుత్వం రకరకాల పథకాలు పెడుతోంది. ఆ పథకాల అమలులో కూడా పార్టీ చురుకుగా జోక్యం చేసుకుని అవి ప్రజలకు చేరేందుకుతోడ్పడాలి. ప్రభుత్వ ప్రతినిధులు పాల్గొనే సమావేశాలు, కార్యక్రమాలు ప్రజా సమస్యలపై ఆందోళన చేయడానికి మంచిసందర్భాలు. మంత్రుల పర్యటనలు, ప్రభుత్వ ప్రతినిధుల టూర్లు, జన్మభూమి వంటి కార్యక్రమాలు వంటి సందర్భాలన్నీ తక్షణ సమస్యలను ప్రజల దృష్టికి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి వినియోగించుకోవాలి. ఉద్యమాలు జరిగేటప్పుడే ప్రజలు ఆయా విషయాలు తెలుసుకోడానికి ఆసక్తి కలిగి ఉంటారు. వారు సమస్యలను అర్థం చేసుకోవడమూ అప్పుడే సులువవుతుంది. అందువల్ల ప్రతి ఉద్యమాన్నీ సైద్ధాంతిక పోరాటానికి వేదికగా మార్చుకోవాలని, ప్రభుత్వం వాదనలను, సిద్ధాంతాలను తిప్పికొట్టాలని మహాసభ కోరింది. ఈ పని చేయాలంటే కూడా నిర్దిష్ట అధ్యయనం అవసరం.

ఉద్యమాలు, పోరాటాలు జరిగేటప్పుడు ఎత్తుగడలు కూడా నిర్దిష్టంగా ఉండాలని నివేదిక సూచించింది. సరైన సమయంలో సరైన రూపాన్ని ఎన్నుకోవడం చాలా కీలకం. ఇందులో లోపం జరిగితే చాలా నష్టం జరుగుతుంది. ప్రజల మూడ్‌ను బట్టి ఉద్యమ రూపాలు ఎంచుకోవాలి. ఆ ఉద్యమాల్లో పార్టీ కార్యకర్తలు ఎల్లవేళలా ముందుండాలి. మన రాజకీయ ఎత్తుగడలు ఈ ప్రజా పోరాటాలనుముందుకు తీసుకుపోయేవిగా ఉండాలి. రాష్ట్రంలో సమస్యలపై పోరాడేటప్పుడు వామపక్షాలన్నిటినీ కలుపుకొని పోడానికి మార్క్సిస్టు పార్టీ చేసిన కృషి మంచి ఫలితాలనిచ్చింది. విద్యుత్‌పోరాటంలోనూ ఇతర అనేక ఆందోళనల్లోనూ పార్టీ స్వతంత్ర కృషి కొనసాగిస్తూనే తొమ్మిదివామపక్షాలతో కలిసి ఐక్యపోరాటాలు చేసింది. దీనివల్ల వామపక్ష అభిమానుల్లోనూ, ప్రజల్లోనూ విశ్వాసం పెరిగింది. ఉద్యమాలపై నిర్బంధం వంటి కొన్ని సందర్భాల్లో కాంగ్రెస్‌ను కూడా కలుపుకుని పోరాడాల్సి ఉంటుంది.

ఐక్యకార్యాచరణ సందర్భంలో ఇతరుల కన్నా మిన్నగా పోరాటపటిమ కనబరచడం, త్యాగాలు చేయడం ద్వారా మాత్రమే ప్రజలు మార్క్సిస్టు పార్టీ ప్రత్యేకతను గుర్తించగలుగుతారు. పోరాటంలో మనం చూపే తెగువ ద్వారా మాత్రమే బూర్జువా పార్టీలనుండి పార్టీ స్వతంత్రతను కాపాడులోగలుగుతాం. ఇటీవల రాష్ట్రంలో జరిగిన విద్యుత్ ఉద్యమం, ఆర్టీసి సమ్మెతో సహా అనేక అనుభవాలు ఈ విషయాన్నే స్పష్టం చేస్తున్నాయి.

చివరిగా నేడు పార్టీ ముందుకు పోవాలన్నా, ప్రజల్లోదాని పునాది విస్తరించాలన్నా పోరాటమే మన ఏకైక మార్గమని మహాసభ పిలుపునిచ్చింది. పోరాటాలను ఉధృతం చేయడం, విస్తృతం చేయడం –ఇదే రానున్న కాలంలో కీలకం. పోరాటాన్ని పదునైన సాధనంగా మార్చాలి.

దీనికిగాను మహాసభ పార్టీ కార్యకర్తలముందు నిర్దిష్టంగా అయిదు కర్తవ్యాలుంచింది :

1. ప్రజా సమస్యలపై పోరాటాలు మరింత ఉధృతం చేయాలి!
2. పోరాటాల్లో సమరశీలత ప్రదర్శించాలి!
3. ప్రజలతో సంబంధాలు మెరుగు పడాలి, వారితో పార్టీ మమేకం కావాలి!
4. కమ్యూనిస్టు ప్రమాణాలు కాపాడాలి!
5. పార్టీ స్వతంత్రతను కంటికి రెప్పలా కాపాడుకోవాలి!

ప్రతినిధులు - నూతన కమిటీ

సిపిఐ(ఎం) రాష్ట్ర మహాసభలకు 551 మంది ప్రతినిధులు, 87 మంది పరిశీలకులు మొత్తం 638 మంది హాజరయ్యారు. వారిలో అత్యధిక శాతం యువకులు, విద్యావంతులు కావడం విశేషం. ఇంటర్‌మీడియట్ ఆపైన చదువుకున్న వారు 70 శాతం మంది కాగా 80 శాతం మంది 50 ఏళ్లకన్నా తక్కువ వయసు కలిగి ఉన్నారు. వర్గ రీత్యా చూస్తే కార్మిక, వ్యవసాయ కార్మిక, పేద, మధ్యతరగతి రైతాంగం నుండి వచ్చిన వారు 70 శాతం మంది. సామాజిక తరగతుల రీత్యా చూస్తే 57 శాతం మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ సెక్షన్లనుండి వచ్చారు. నాయకత్వంలో మౌలిక వర్గాలనుండి, సామాజిక తరగతులనుండి వచ్చిన వారి సంఖ్య పెరిగిన విషయాన్ని ఈ గణాంకాలు తెలియజేస్తున్నాయి. మహాసభ చివరిలో ప్రతినిధులు రానున్న నాలుగు సంవత్సరాలకు గాను నూతన రాష్ట్ర కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. 81 మందితో ఎన్నికైన నూతన కమిటీలో 66 మంది పాతకమిటీ సభ్యులు కాగా 12 మంది కొత్తగా ఎన్నికైనారు. నూతన రాష్ట్ర కమిటీ సమావేశమై కార్యదర్శిగా బివి రాఘవులును తిరిగి ఎన్నుకున్నది. 15 మందితో కొత్త కార్యదర్శి వర్గాన్ని కూడా ఎన్నుకున్నది. కొత్త కార్యదర్శి వర్గంలో బివి రాఘవులుతో పాటు కొరటాల సత్యనారాయణ, మల్లు వెంకట నర్సింహా రెడ్డి, పాటూరు రామయ్య, తమ్మినేని వీరభద్రం, అల్లూరు సత్యనారాయణ, జక్కా వెంకయ్య, పి. మధు, కె. వెంకటయ్య, వి. శ్రీనివాసరావు, వై. రాధాకృష్ణ మూర్తి, వి. కృష్ణయ్య, వై. వెంకటేశ్వరరావు, ఎం.ఎ. గఫూర్, సిహెచ్. నర్సింగరావు ఉన్నారు. వీరిలో మొదటి 14 మంది పాత కార్యదర్శి వర్గ సభ్యులే కాగా సిహెచ్. నర్సింగరావు కొత్తగా కార్యదర్శి వర్గంలోకి ఎన్నికయ్యారు. అలాగే డి. రామిరెడ్డి నేతృత్వంలో ముగ్గురు సభ్యుల కంట్రోల్ కమిషన్‌నూ, రానున్న పార్టీ అఖిల భారత మహాసభలకు 35 మంది ప్రతినిధులను 9 మంది ప్రత్యామ్నాయ ప్రతినిధులను కూడా మహా సభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది.

ఉక్కుమనిషి స్టాలిన్

(2వపేజీ తరువాయి)

కుమ్మరించి ఆమె రచనలను ప్రచురణ కర్తలు కొన్నారు. చివరకు వాళ్ళాశించినదేమీ ఆ రచనలలో లేకపోగా ఇందుకు విరుద్ధమైన పదార్ధమే వుంటడం చూసి నిస్పృహ చెందారు.

ఆమె వర్ణించిన రెండు మూడు ఘటనలు స్టాలిన్ స్వభావాన్ని సువిదితం చేశాయి. ఆయన ఎప్పుడైనా కోప్పడినా పెద్దవాళ్ళనే తప్ప సామాన్యులను కాదు అని ఆమె వ్రాసింది. ఈ సందర్భంలో ఆయనకు ఇంటివద్ద సేవలు చేస్తున్న వారిని ఆయన ఎంతగా ఆదరించేదీ, వాళ్ళు ఆయన కోసం ఎలా ప్రాణాలు విడిచేదీ వెల్లడించింది. స్వెట్లానా యుద్ధకాలంలో ఒక యువకుణ్ణి పెళ్ళిచేసుకున్నది. అందరూ దేశరక్షణకు రణరంగానికి పోతున్న రోజుల్లో వీడెక్కడ దొరికాడు నీకు అని తండ్రి తనపై విసుక్కున్నాడట.

ఆయన రెండవ కొడుకు బాధ్యతారాహిత్యమైన మనిషి. అయినా స్టాలిన్ మెప్పుపొందాలన్న తలంపుతో అతడికి అధికారులు సైన్యంలో అమితమైన ప్రమోషన్లు యిచ్చారు. ఈ సంగతి తెలుసుకున్న స్టాలిన్ తక్షణమే చర్య తీసుకొని అతడిని దిగువ మెట్టుకు పంపాడు.

పెద్దకొడుకు యాకోవ్ అంటే స్టాలిన్‌కి ఎంతో ప్రేమ. ఆయన నాజీల చేజిక్కాడు. దేశానికి ద్రోహంచేస్తే ఆయన్ను అందల మెక్కించుతామని నాజీలు మురిపించారు. దాన్నతడు నిరాకరించాడు. తర్వాత స్విస్ దౌత్య కార్యాలయం ద్వారా స్టాలిన్‌కు కబురు పంపారు. స్టాలిన్ గ్రాడ్‌లో పట్టుబడిన తమ సేనాధిపతి పౌలన్‌ను విడుదలచేస్తే స్టాలిన్ కొడుకును విడిచిపెడతామన్నది ఆ కబురు.

పౌలన్ ఒక కమాండరు. యాకోవ్ ఒక సైనికుడు మాత్రమే. తన కొడుకు కోసం ఒక నాజీ కమాండరును విడిచిపెట్టటమా? అసంభవం అని ఆ ప్రతిపాదనను స్టాలిన్ నిరాకరించాడు. ఈ విషయాన్ని స్వెట్లానా తన రచనలో పేర్కొన్నది. ఇటీవల ప్రదర్శించబడుతున్న సోవియట్ ఫిలిం 'విముక్తి' లో యీ దృశ్యాలను చూపుతున్నారు కూడా.

ఒకసారి స్టాలిన్‌తో మాట్లాడే సందర్భంలో ఝుకోవ్ యాకోవ్‌ని గురించి అడిగాడు. 'వాడిని నాజీలు వేరుగా వుంచి దేశద్రోహానికి ప్రోత్సహిస్తున్నారు. కాని వాడెన్నడూ ఆపనిచెయ్యడు. నాజీ హంతకులు వాడ్ని బ్రతకనివ్వరు" అన్నాడు స్టాలిన్. ఆ క్షణంలో తమ బిడ్డలను కోల్పోయిన సోవియట్ కుటుంబాలన్నీ ఆయన కంట తిరిగాయి. 'ఈ యుద్ధమెంత దారుణమైంది ఎవరో ఒక ఆప్తుణ్ని కోల్పోని కుటుంబాలు ఈ దేశంలో బహుతక్కువ వుంటా''యని నిట్టూర్పు విడిచాడు. స్టాలిన్ హృదయంలేని వాడని శత్రువులు విరివిగా ప్రచారం చేశారు. కాని ఆయనెంతటి విశాల హృదయుడో, ఎంతటి మానవతా వాదో ఝుకోవ్ వర్ణన విదితం చేస్తోంది.

స్టాలిన్ మితభాషి ప్రతిదానికీ తగుదునని తానే తయారయ్యేవాడు కాదు. అరుదుగా మాట్లాడేవాడు. అదొక అత్యవసర సందర్భం అయివుంటేనే మాట్లాడేవాడు. ఆ మాట్లాడిన దాంట్లో ఏ పొల్లూ, కామా మార్చే పనుండదు. ఏ మాటా చెప్పిందే చెప్పడంగా ఉండదు. ఊదరగొట్టడం, అనవసర ప్రసంగం చేయడం



ఆయనకు గిట్టవు. అందరికీ గంట చెప్పేదాన్ని పదినిమిషాల్లో ఆయనకు సూటిగా నిశితంగా చెప్పమని కోరేవారు. రాసినా, మాట్లాడినా తానూ అంతే. పదేపదే ప్లాట్‌ఫారం ప్రదర్శనలు ఆయన కాలంలో లేవు. ఎప్పుడూ స్టాలిన్ ఫొటోలతో సోవియట్ పత్రికలు నిండివుండేవి కాదు. అసలు ఆయన బొమ్మ దొరకడమే దుర్లభంగా ఉండే సందర్భాలూ ఉండేవి. స్టాలిన్ కాలంలోనే ఆయన రచనలన్నీ 13 సంపుటాలుగా అచ్చయినాయి. ఆ పదమూడు గ్రంధాల్లోనూ ఆయన ఫొటో ఉన్నది ఒక్క మొదటి సంపుటంలో మాత్రమే. ఆయన మహత్తరమైన రచనలు లెనినిజం పునాదులు, బోల్షివిక్ పార్టీ చరిత్ర. ఆయన కాలంలో అచ్చయిన పుస్తకాల్లో ఆ మొదటి గ్రంధంలో ఆయన ఫొటో ఒక్కటుండేది. రెండవదాంట్లో అసలు ఫొటోయే ఉండేది కాదు. ఆయన్ను గురించి పొగడ్తలు జరిగిందా, ఆయన ఫొటోలు ఎక్కువగా కనబడ్డదీ యుద్ధానంతరమే. అదీ ఆయన చివరిరోజుల్లోనే ముఖ్యంగా ఆ పొగడ్తలు జరిగాయి. 19వ పార్టీ మహాసభలో ఆ పొగడిన వాళ్లలో అగ్రగణ్యులు కృశ్చేవ్, మికోయన్ మొదలైనవారే. ఆ పార్టీ మహాసభ జరిగింది 1953 జనవరిలో. స్టాలిన్ అస్తమించింది 1953 మార్చి 5వ తేదీన. ఆయనగా ఆ పార్టీ మహాసభలో చేసిన ప్రసంగం రెండు మూడు పేజీలకు సరిపోయినదే. అందులో ఆయన చెప్పిన విషయాలు రెండు. అవి అంతర్జాతీయతా భావానికి చక్కగా జీవంపోసేవి మాత్రమే. వాటి సారాంశం : "సోవియట్ యూనియన్‌ను ప్రపంచంలో కమ్యూనిస్టు పార్టీలన్నీ తమ కంటికి రెప్పవలె కాపాడుకున్నాయి. వాటికి మేమెంతైనా రుణపడిఉన్నాం. ఆ రుణాన్ని తీర్చుకునే అవకాశం ఇప్పుడు మాకు కలిగింది" అని వినమ్రుడై ఆయన చెప్పాడు. పెట్టుబడిదారీ ప్రపంచంలో బూర్జువా నాయకత్వం విముక్తి పోరాటాలను వినర్జించింది. కొనసాగించ లేదు. కమ్యూనిస్టు నాయకత్వం ఆ పతాకాన్ని చేబూని ఆ మహత్తర కర్తవ్యాన్ని నిర్వహించాలి.

తాననుకున్నదే చెప్పి అందరి మీదా రుద్దే అలవాటు స్టాలిన్‌కి లేదు. అందరూ చెప్పింది విని, చివరకు సమీక్ష చేసి చర్చల సారాంశాన్ని విశదీకరించి నిర్ణయాలు చేయడం స్టాలిన్ పద్ధతి. అన్నా లూయిా స్ట్రాంగ్ ఆ విషయాన్నే విదితం చేసింది. యుద్ధకాలంలో సేనానాయకులు చెప్పింది జాగ్రత్తగా విని ఎలా నిర్ణయాని కొచ్చేవాడో ఝుకోవ్ తన ఉద్గ్రంధంలో పదేపదే పేర్కొన్నాడు. సంప్రదింపుల అనంతరం, ప్రతిష్టకై పెనుగులాడకుండా స్టాలిన్ తన నిర్ణయాలనే మార్చుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని ఝుకోవ్ పేర్కొన్నాడు.

చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం 1963లో చేసిన వ్యాఖ్యలో దిగువవిధంగా పేర్కొన్నది. 'స్టాలిన్ తప్పుచేసినా ఆత్మవిమర్శ చేసుకోగల సమర్ధుడు. ఉదాహరణకు చైనా విప్లవ వధాన్ని గూర్చి ఆయనొక తప్పుసలహా ఇచ్చాడు. చైనా విప్లవం విజయం పొందిన అనంతరం ఆయన తనది తప్పు సలహా అని అంగీకరించాడు. 1939లో 18వ పార్టీ మహాసభకు ఇచ్చిన నివేదికలో పార్టీని శుద్ధిచేసే సందర్భంలో కూడా తాను కొన్ని తప్పులు చేసినట్లు ఆయన అంగీకరించాడు.

([illegible])

LPSAI01M116

మనసు ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	LPSA101M116
పుస్తకం పేరు	సాహిత్య ప్రస్థానం
తారీఖు	14 March 2025
ముందు అట్ట	YES
వెనుక అట్ట	YES
మొత్తం పేజీలు	201
పెద్ద సైజు పేజీలు	No
ఖాళీ పేజీలు	No
లేని పేజీలు	No
తయారు చేసినది	P. Jayamma
పేజీలు విడదీసినది	P. Jayamma
స్కాన్ చేసినది	Naveena
పరీక్ష చేసినది	THASIN
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	Good